

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 27-7-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 141 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: తదియ రా.10.42 తదుపరి చవితి, నక్షత్రం: మఖ సా.4:23 తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.12.47-2.27, దుర్ముహూర్తం: సా.5.04-5.55, అమృతఘడియలు: మ.1.55-3.33, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.46 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

2034 ఎన్నికల్లోనే!

కొత్త నియోజకవర్గాల కోసం ఆగాల్సిందే

విభజన చట్టం ఇచ్చిన వెసులుబాటు వృథా


ఇప్పుడున్నది 2011 జనాభా లెక్కలే

కొత్త లెక్కల ప్రకారమే డీలిమిటేషన్

తేల్చిచెప్పిన సుప్రీం కోర్టు

2027లో మొదలుకానున్న జనగణన

అది ముగిశాకే డీలిమిటేషన్ ప్రక్రియ



అసెంబ్లీ నియోజకవర్గాల పెంపుపై పార్టీలు, ఔత్సాహిక రాజకీయ నాయకులు పెట్టుకున్న ఆశలు ఇప్పట్లో నెరవేరేలా లేవు! రాష్ట్ర విభజన చట్టంలో వెసులుబాటు ఇచ్చినా... రాజ్యాంగం ఒప్పుకోదంటూ సుప్రీంకోర్టు తేల్చేసింది. జనాభా లెక్కలు తేలిన తర్వాతే... నియోజకవర్గాల పునర్‌వ్యవస్థీకరణ జరుపుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. వెరసి... 2034 ఎన్నికలకు గానీ కొత్త నియోజకవర్గాలు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు.

2029 ఎన్నికల్లోపు పునర్వ్యవస్థీకరణ అసాధ్యం

ఆ తర్వాతి ఎన్నికల్లోనే 225 అసెంబ్లీ సీట్లు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

2014లో అమలులోకి వచ్చిన రాష్ట్ర విభజన చట్టంలో... సీమాంధ్రలోని అసెంబ్లీ నియోజకవర్గాలను 175 నుంచి 225కు పెంచుకునే వెసులుబాటు కల్పించారు. అసెంబ్లీలో 'అధ్యక్షా' అని పిలవాలని లక్ష్యంగా పెట్టుకున్న నేతలు అప్పటి నుంచే కొత్త నియోజకవర్గాల కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. కానీ... కేంద్ర ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. అప్పట్లో తెలుగుదేశం పార్టీ ఈ దిశగా చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక ఈ ఊసే మరిచిపోయారు.

విభజన చట్టంలో చెప్పినా...

సీమాంధ్రలో అసెంబ్లీ నియోజకవర్గాలను 225కు పెంచుకోవచ్చని రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నారు. అయితే... దానికి ఏదో ఒక ప్రాతిపదిక కావాలి. 2011 నాటి లెక్కల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేయలేని పరిస్థితి. కాబట్టి... తదుపరి జనాభా లెక్కల ఆధారంగా అసెంబ్లీ స్థానాలు పెంచవచ్చని భావించారు. 2021లో జనగణన చేపట్టాల్సి ఉన్నా... కొవిడ్ కారణంగా అది జరగలేదు. 2026 తర్వాత జరిగే జన గణన ప్రకారం నియోజకవర్గాల డీలిమిటేషన్ జరగాలని ప్రజాప్రాతినిధ్య చట్టంతోపాటు రాజ్యాంగంలోనూ పేర్కొన్నారు. తాజాగా... 2026 అక్టోబరు నుంచి

మిగతా 13వ పేజీలో...

ఇక రయ్.. రయ్.. రోడ్లు

8 వేల కోట్లతో స్టేట్ హైవేల నిర్మాణం

పీపీపీ విధానం కింద కార్యాచరణ 3



'సిట్' సోదాల పర్వం

హైదరాబాద్‌లో మూడు చోట్ల తనిఖీలు

భారతీ సిమెంట్స్ ఆఫీసులోకి బృందం

బాలాజీ గోవిందప్ప చాంబర్ పరిశీలన

అక్కడి మీటింగ్ హాల్‌లోనే డిస్టిలరీల ప్రతినిధులతో సమావేశాలు

సాంకేతిక ఆధారాలతో గుర్తించిన సిట్

ఆయన నివాసంలోనూ సోదాలు


రాజ్ కసిరెడ్డి సాఫ్ట్‌వేర్ ఆఫీసు, చాణక్య 'టీ గ్రిల్' ఆవరణలో తనిఖీలు

పలు డాక్యుమెంట్లు స్వాధీనం

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం దర్యాప్తులో మరిన్ని ఆధారాల సేకరణ కోసం 'సిట్' హైదరాబాద్‌లో విస్తృత సోదాలు నిర్వహించింది. సహ నిందితులు, డిస్టిలరీల యజమానులతో భేటీలు జరిపిన ప్రాంతాలను గతంలోనే గూగుల్ టేకౌట్ ద్వారా గుర్తించిన 'సిట్'... శనివారం ఆ ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ క్రమంలో జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ కార్యాలయంలోనూ అడుగు పెట్టింది. మద్యం స్కామ్‌లో ఏ1గా ఉన్న రాజ్ కసిరెడ్డికి చెందిన రిసోర్స్ వన్ ఐటీ సొల్యూషన్స్

మిగతా 14వ పేజీలో...

ఏ గ్రంథం చెప్పింది జగన్?



బైబిల్‌ను నిత్యం పఠించేవారు, క్రైస్తవ మతాన్ని చిత్తశుద్ధితో ఆచరించేవారెవరూ పాపిష్టి డబ్బు కోసం ఆశపడరు. దీన్నిబట్టి జగన్ రెడ్డి అటు ఆస్తికుడూ కాదు.. ఇటు నాస్తికుడూ కాడని భావించాల్సి ఉంటుంది. ఆయనకు డబ్బే ముఖ్యం. అధికారం కూడా డబ్బు కోసమే అనే కోణంలోనే ఆలోచిస్తాడన్నది సుస్పష్టం.

> ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గానీ, అధికారం కోల్పోయినప్పుడు గానీ జగన్ రెడ్డి చేష్టలను పరిశీలిస్తే ఆయనలో ఏ కోశానా పాపభీతి లేదని స్పష్టమవుతుంది. దేవుడి కంటే డబ్బే తనకు ముఖ్యమని అధికారంలో ఉన్నప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలను బట్టి ఎవరైనా భావించడంలో తప్పు లేదు. జగన్ హయాంలో అమలు చేసిన మద్యం విధానమే ఇందుకు నిదర్శనం.

లిక్కర్‌ను సొంతానికి ప్రధాన ఆదాయ వనరుగా మార్చిన ఘనత కూడా జగన్ రెడ్డికే దక్కుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, రాష్ట్రం విడిపోయిన తర్వాత గానీ ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారెవరూ లిక్కర్‌ను తమ పార్టీల ప్రధాన ఆర్థిక వనరుగా భావించలేదు.

> 2024 ఎన్నికల్లో జగన్ ఘోరంగా ఓడిపోవడానికి నాసి రకం మద్యం సరఫరా ఒక కారణం కాదా? ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినందుకే దేవుడు 2019లో రాసిన స్క్రిప్ట్‌ను తిరగరాశాడు. బ్రేక్ ఫాస్ట్ నుంచి రాత్రి డిన్నర్ వరకు డబ్బును మాత్రమే నంజుకు తినాలని చూసే వారిని దేవుడు ఉపేక్షిస్తాడా?

వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు ఇస్తున్న కొన్ని ఆదేశాలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం చేస్తున్న వ్యాఖ్యలు, వెల్లడిస్తున్న అభిప్రాయాలు సంచలనంగా ఉంటున్నాయి.

> న్యాయ వ్యవస్థ సక్రమంగా, నిజాయితీగా వ్యవహరిస్తే అన్ని వ్యవస్థలూ గాడిలో ఉంటాయి. న్యాయ వ్యవస్థపై పాలకుల్లో, ప్రజల్లో భయం పోకూడదు. లేని పక్షంలో అరాచకం ప్రబలుతుంది. అంటే న్యాయ వ్యవస్థపై ఎంతటి గురుతర బాధ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

రాజ్‌భవన్‌కు రాజు

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి ప్రమాణం

ఏపీ నుంచి తరలివెళ్లిన టీడీపీ నాయకులు

కేంద్ర మంత్రులు రామ్మోహన్, శ్రీనివాస వర్మ అయ్యన్న, లోకేశ్, పల్లా, కంభంపాటి హాజరు

అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

13



శనివారం గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్ గజపతిరాజును అభినందిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

ఫెర్టిలిటీ సెంటర్‌లో ఘరానా మోసం

ఇతరుల వీర్యంతో దంపతులకు సంతానం

రెండేళ్ల తర్వాత వెలుగులోకి .. బాబుకు క్యాన్సర్ రావడంతో అనుమానం

డీఎన్ఏ పరీక్షల్లో బట్టబయలైన మోసం.. సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌పై దంపతుల ఫిర్యాదు.. పోలీసులు, వైద్యులు, అధికారుల తనిఖీలు

లైసెన్స్ లేకుండా నడుస్తున్న కేంద్రం.. డాక్టర్ నమ్రత విజయవాడలో అరెస్ట్! 13

విశాఖలోని సెంటర్‌పైనా పోలీసుల దాడులు.. భారీగా వీర్యం నిల్వల గుర్తింపు

సంతాన సాఫల్యం మాటున దందా.. దంపతులను మోసం చేస్తున్న కేంద్రాలు



సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్ (ఇన్‌సెట్) డాక్టర్ నమ్రత



2

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీలు మృతి

సడన్ బ్రేక్ వేసిన వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం

డివైడర్ దాటి వెళ్లడంతో ఎదురుగా వచ్చిన లారీ ఢీ

ఏఎస్పీ, కానిస్టేబుల్‌కు గాయాలు

అందరూ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది

హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం

ఆర్మీలో సరికొత్త దళం.. రుద్ర

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 'ఆల్ ఆర్మ్ బ్రిగేడ్' ఏర్పాటు

సరిహద్దుల్లో 'భైరవ్' పేరుతో లైట్ కమాండో బెటాలియన్

ప్రత్యేక పాఠ్యాంశంగా ఆపరేషన్ సిందూర్

శుభాంశు శుక్లా రోదసి యాత్రపై కూడా

ఎన్‌సీఈఆర్‌టీ యోచన

12

నాసాలో 4 వేల మందికి వీఆర్ఎస్

ప్రభుత్వ వ్యయం తగ్గింపు కోసం ట్రంప్ చర్యల ఫలితం



ఖరీఫ్ కళకళ

వర్షాలతో జీవం పోసుకున్న పైర్లు

ఊపందుకున్న వరి నాట్లు

పుంజుకున్న పత్తి సాగు 14

10 లక్షలకు పైగా హెక్టార్లలో పంటలు

17 జిల్లాల్లో మెరుగైన వర్షపాతం

సీమలో 22% నుంచి 48% లోటు

నెలాఖరుకల్లా కరువు మండలాలు?

ఏఐ భామ.. బూతుల బొమ్మ!



స్టాండప్ కామెడీలా అనిపించేలా బూతులు, అసభ్య వ్యాఖ్యలతో వీడియోలు

మహిళా క్యారెక్టర్లతో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు.. పురుషులపై ద్వంద్వార్థాల సెటైర్లు

ఏఐ అని చెప్పినా నమ్మలేని రీతిలో రూపకల్పన

కాసుల కోసం కొందరు ఐటీ నిపుణుల కక్కుర్తి

విచ్చలవిడితనంపై పెరుగుతున్న ఆందోళన

హైదరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆకట్టుకునే రూపం.. అందమైన శరీర సౌష్టవం.. మత్తెక్కించే స్వరం.. కానీ అన్నీ అసభ్య, అశ్లీల, బూతు మాటలే!! ఇదేమిటి ఇంత అందంగా, బాగా చదువుకున్నవారిలా కనిపిస్తున్న అమ్మాయిలేంటి.. ఇలా చేస్తున్నారేమిటి అనే ఆశ్చర్యం కలగకమానదు. కానీ అది

మిగతా 12వ పేజీలో...



మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

లొంగిపోండి.. లేదంటే లొంగదీస్తాం



మావోయిస్టులకు ఏడు నెలలే గడువు

హింస వీడి జనంలోకి రావాలి: డీజీపీ

డీజీపీ గుప్తా ముందు లొంగిపోయిన తూర్పు బస్తర్ ఇన్‌చార్జి కమలేశ్


13 మంది మావోయిస్టులకు రూ.22 లక్షల చెక్కులు పంపిణీ 14

పెట్టుబడుల సాధనే లక్ష్యం

బ్రాండ్ ఏపీ ప్రచారంపైనా దృష్టి

సింగపూర్‌లో సీఎం చంద్రబాబు బిజీ షెడ్యూల్





సింగపూర్‌లో ఆదివారం నిర్వహించే తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి సిద్ధమైన వేదిక

5 రోజులు.. 29 కార్యక్రమాలు

మంత్రులు, పారిశ్రామికవర్గాలతో చర్చలు

ఆ దేశాధ్యక్షుడితోనూ సమావేశం

నేడు తెలుగు డయాస్పోరా భేటీకి హాజరు

విదేశాల్లో ఏపీ యువతకు ఉద్యోగాలపై చర్చ

పీ4లో భాగస్వామ్యం కావాలని పిలుపు

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన సాగనుంది. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ప్రమోషన్ కూడా అందులో భాగం కానుంది. శనివారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన చంద్రబాబు నేతృత్వంలోని బృందం ఆదివారం ఉదయం సింగపూర్‌కు చేరుకున్నదే తడవుగా బిజీబిజీగా గడపనుంది. ఐదు రోజుల పర్యటనలో భాగంగా చంద్రబాబు ప్రముఖ

మిగతా 13వ పేజీలో...

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీలు మృతి

మరో ఏఎస్పీ, కానిస్టేబుల్‌కు గాయాలు

హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం.. అందరూ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగే



ప్రమాదంలో నుజ్జయిన వాహనం





మృతులు శాంతారావు, చక్రధర్ రావు

అమరావతి/చౌటుప్పల్ రూరల్/గొల్లపూడి, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏపీ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో పనిచేస్తున్న ఇద్దరు డీఎస్పీలు మరణించగా, మరో ఏఎస్పీ, హెడ్‌కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన శాంతారావు(57), పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వాసి చక్రధర్ రావు(52) ఉన్నారు. హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా శనివారం తెల్లవారుజామున విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం స్టేజి వద్దకు వారు ప్రయాణిస్తున్న స్కార్పియో రాగానే ముందుగా వెళ్తున్న వాహనం సడన్‌బ్రేక్ వేసింది. దాన్ని తప్పించబోయిన స్కార్పియో డివైడర్ ముందు భాగాన్ని బలంగా ఢీ కొట్టి, కొద్దిదూరం దూసుకెళ్లి విజయవాడ వెళ్లే రోడ్డులో పడిపోయింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న సిమెంట్ కాంక్రీట్ లారీ స్కార్పియోను ఢీ కొట్టడంతో నుజ్జయింది. కారు మధ్య సీటులో కూర్చున్న డీఎస్పీలు చక్రధర్‌రావు, శాంతారావుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ముందు సీటులో కూర్చున్న అడిషనల్ ఎస్పీ రామ్‌ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ నరసింహరాజు(డ్రైవర్) గాయపడ్డారు. సీటు బెల్టు పెట్టుకోవడం, బెలూన్లు తెరుచుకోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. వారిద్దరినీ చికిత్స కోసం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. వారిద్దరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

శిక్షణ కోసం వెళ్తుండగా..

ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి వృత్తి పరమైన మెలకువలు నేర్పించే శిక్షణ హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్‌లో ఉంటుంది. అందులో భాగంగానే ప్రీ ప్రమోషన్ ట్రైనింగ్(పీపీటీ) కోసం డీఎస్పీలు శాంతారావు, చక్రధర్ రావు, అడిషనల్ ఎస్పీ రామ్‌ప్రసాద్ శుక్రవారం రాత్రి 9.30 గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్ కారులో బయల్దేరారు. రాత్రి నార్కట్‌పల్లి వద్దకు రాగానే కారు మరమ్మతుకు వచ్చింది. దీంతో హైదరాబాద్ ఐఎస్‌డబ్ల్యూ కార్యాలయం నుంచి మరో స్కార్పియో వాహనాన్ని (ఏపీ 18 పీ 1176) తెప్పించుకొని మళ్లీ బయలుదేరారు. ఘటన స్థలం వద్ద ప్రమాద హెచ్చరిక సూచికలు లేకపోవడంతోనే ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. ఖైతాపురం క్రాసింగ్ అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగాయి. సీటు బెల్టు పెట్టుకోకపోవడం కూడా డీఎస్పీల మృతికి కారణంగా తెలుస్తోంది. ముందు సీటులో కూర్చున్నవారు సీటు బెల్టు పెట్టుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. మధ్య సీటులో కూర్చున్న డీఎస్పీలు శాంతారావు, చక్రధర్‌రావు సీటు బెల్టు పెట్టుకోకపోవడంతో మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. మృతదేహాలను చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చక్రధర్‌రావు, శాంతారావు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. చక్రధరరావుకు భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు హాసిని ప్రియ, డింపుల్ ఉన్నారు. శాంతారావుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు బాల గంగాధర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, చిన్న కుమారుడు శ్రీరామ్ నెదర్లాండ్స్‌లో చదువుతున్నాడు.

మృతదేహాలకు హోం మంత్రి నివాళి

డీఎస్పీలు చక్రధర్‌రావు, శాంతారావుల మృతదేహాలను శనివారం సాయంత్రం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకువచ్చారు. హోం మంత్రి అనితతో పాటు పోలీసు ఉన్నతాధికారులు మృతదేహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కడసారి వీడ్కోలు పలికి మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించారు. శాంతారావు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం డోలలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆంధ్రజ్యోతి

నేరేడుకు లాభాల 'ఫార్ములా'






అనంత రైతు వినూత్న ఆవిష్కరణలు.. ఫలించిన పరిశోధనలు.. మార్కెట్లోకి ఉత్పత్తులు

- అల్ల నేరేడుతో డ్రైఫ్రూట్, జ్యూస్, జామ్ తయారీ
- ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా అమ్మకాలు
- నష్టాల నుంచి పట్టుదలతో లాభాల్లోకి



నేరేడుతో తయారు చేసిన జ్యూస్‌లు, ఉత్పత్తులు



నేరేడును గ్రైండర్‌లో వేసి గుజ్జు చేస్తున్న మారుతీ ప్రసాద్



నేరేడు డ్రైఫ్రూట్

(రాయదుర్గం-ఆంధ్రజ్యోతి)

కృషి, పట్టుదల, నూతన ఆలోచనలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకున్నాడు ఓ రైతు. నేరేడు పంటలో ప్రయోగాలు చేసి, నష్టాలను అధిగమించి, లాభాలను ఆర్జిస్తున్నాడు. ఆ రైతు అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన మారుతీప్రసాద్. ఆయనకు రెండెకరాల పొలం మాత్రమే ఉంది. అందులో 2018లో 150 అల్ల నేరేడు మొక్కలను నాటారు. మూడేళ్లకు దిగుబడి రావడం మొదలైంది. కానీ మార్కెట్‌లో ధర లేకపోవడంతో క్రమేపీ నష్టాలను చవి చూశారు. వాటిని ఓర్పుగా భరించి, కొత్త ఆలోచనలు చేశారు. చదువుకున్నది ఇంటర్మీడియట్ అయినా, తన తెలివితేటలు, అనుభవంతో నేరేడు పండ్లను.. జ్యూస్, డ్రై ఫ్రూట్, జామ్, పౌడర్ ఇలా వివిధ రూపాల్లో మార్కెట్‌కు పరిచయం చేశారు. డిమాండ్ పెరగడంతో జాతీయస్థాయిలో తన ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ లాభాలను గడిస్తున్నారు.

సొంత ఫార్ములాతో ముందుకు..

నష్టాలను అధిగమించడానికి శాస్త్రవేత్తల సలహాలతో మారుతీ ప్రసాద్ సొంతంగా నేరేడు పళ్ల జ్యూస్ చేసే ఓ ఫార్ములాను రూపొందించారు. గుజ్జుగా ఫార్ములాకు అనుగుణంగా వేడి చేసి, ద్రవంగా మార్చి 15 రోజులు నిల్వ చేసి జ్యూస్‌గా తయారు చేశారు. ఆ ఉత్పత్తిని మైసూర్‌లోని న్యూట్రిన్స్ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించారు. ఈ జ్యూస్ పరిపూర్ణంగా చక్కెర వ్యాధిగ్రస్థులకు ఉపయోగపడుతుందని అక్కడి నుంచి అనుమతి పొందారు. దీంతో ఆ నేరుడు జ్యూస్‌ను మార్కెట్‌కు పరిచయం చేశారు. నేరేడు విత్తనాలను సైతం పౌడర్‌గా మార్చి, కిలో రూ. 300 చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. రెండు రూపాల్లో ప్రారంభించిన ఉత్పత్తులను క్రమేపీ పెంచుకుంటూ వచ్చారు. తన పొలంలోని పండ్లతో పాటు ఇతర రైతుల పొలాల్లో పండిన పంటను కూడా కొనుగోలు చేసి, జ్యూస్ తయారు చేస్తున్నారు. తద్వారా ఆ రైతులు నష్టపోకుండా ఆదుకుంటున్నారు.

ఏడాది నిల్వ ఉండేలా..

నేరేడు జ్యూస్, పౌడర్‌తో మొదలైన ఉత్పత్తులను డ్రైఫ్రూట్, జామ్ రూపంలోకి కూడా మార్చారు. గింజలను తొలగించి, సోలార్ డ్రయ్యర్‌లో మూడురోజుల పాటు ఎండబెట్టి, డ్రై నేరేడును తయారు చేస్తున్నారు. ఎండ లేనపుడు ఎలక్ట్రికల్ డ్రయ్యర్లను ఉపయోగిస్తున్నారు. డ్రై నేరేడు కిలో రూ. 3 వేలకు పైగా విక్రయిస్తున్నారు. ఏడాది పాటు డ్రై నేరేడును ఫ్రిడ్జ్‌లో ఉంచుకుని వాడుకోవచ్చని, అందులోని న్యూట్రిషన్స్‌కు ఎలాంటి నష్టం వాటిల్లదని చెబుతున్నారు. తమ ఉత్పత్తుల్లో ఎలాంటి రసాయనాలు వినియోగించలేదని రైతు తెలిపారు. ప్రభుత్వ అనుమతితో ఆన్‌లైన్ ద్వారా దేశంలోని చాలా ప్రాంతాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్థులు వీటిని కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ఉద్యాన శాఖ అధికారుల సహకారంతోనే ఇలాంటి ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

ఓర్పు చాలా అవసరం

నేరేడు పంటలో చాలా నష్టాలను చవి చూశాను. నష్టాలను అధిగమించి, ఎలాగైనా మార్కెట్‌లో నిలవాలని పట్టు వదలకుండా ఓర్పుతో ముందుకెళ్లాను. నాలా నేరేడు పండించే రైతులందరూ ఈ ప్రయత్నాన్ని చేయాలంటే చాలా ఓర్పు ఉండాలి. నేరేడు ఉత్పత్తుల తయారీ యంత్రాల కోసం రూ. 30 లక్ష లు వెచ్చించాను. రెండేళ్లుగా లాభాలను గడిస్తున్నాను. జాతీయస్థాయిలో డ్రై నేరేడు ఫ్రూట్, జ్యూస్, పౌడర్‌కు డిమాండ్ రావడంతో ఆర్డర్లు వస్తున్నాయి. రైతులు కొత్తగా ఆలోచిస్తే తప్పకుండా ఎక్కడో ఒకచోట ఫలితాలు లభిస్తాయనేందుకు నేనే ఉదాహరణ.

- మారుతీప్రసాద్, రైతు, ఉద్దేహాళ్

మేకిన్ ఇండియా అస్త్రాల సత్తా చాటాం

- ఆపరేషన్ సిందూర్‌లో శత్రువులను మట్టికరిపించాం
- స్వదేశీ ఆయుధాల బలాన్ని ప్రపంచానికి చూపాం
- భారత్-యూకే వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకం
- మన దేశంపై పెరుగుతున్న నమ్మకానికి సూచిక
- కాశీ-తమిళ సంగమంతో సాంస్కృతిక వారసత్వం బలోపేతం
- ఆత్మవిశ్వాసంతో వికసిత్ భారత్ నిర్మిస్తున్నాం
- తమిళనాడులోని తూత్తుకుడిలో ప్రధాని మోదీ
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం




విమానాశ్రయ వివరాలను ప్రధానికి వివరిస్తున్న రామ్మోహన్‌నాయుడు

చెన్నై, జూలై 26(ఆంధ్రజ్యోతి): మేకిన్ ఇండియాలో భాగంగా తయారైన ఆయుధాలతో శత్రువులను మట్టికరిపించామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. స్వదేశీ ఆయుధాల బలమేంటో ప్రపంచానికి చాటామన్నారు. శనివారం రాత్రి 8 గంటలకు మాల్దీవుల నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా తమిళనాడులోని తూత్తుకుడికి ప్రధాని వచ్చారు. రూ. 4,900 కోట్ల వ్యయంతో చేపట్టిన తూత్తుకుడి విమానాశ్రయ నూతన టెర్మినల్ నిర్మాణం, వీవోసీ పోర్ట్ ఉత్తర కార్గో బెర్త్-3 నిర్మాణం ప్రారంభించారు. అలాగే పలు రైల్వే ప్రాజెక్టులు జాతికి అంకితం చేశారు. కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రం 3, 4 యూనిట్ల నుంచి విద్యుత్ తరలింపు కోసం ఐఎస్‌టీఎస్ కింద ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని అమరజవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఆపరేషన్ సింధూర్‌లో మేకిన్ ఇండియా ఆయుధాలు ఎంతో ప్రభావం చూపాయి. కీలక పాత్ర పోషించాయి. వాటితోనే తీవ్రవాదులను మట్టిలో కలిపేశాం. దేశంలో తయారయ్యే ఆయుధాలు ఉగ్రవాదానికి ఆశ్రయమిచ్చే వారికి నిద్ర లేకుండా చేస్తున్నాయి. నాలుగు రోజుల విదేశీయానం తరువాత నేరుగా రామేశ్వరం వంటి పవిత్ర భూమికిపైకి వచ్చే అదృష్టం నాకు కలిగింది. భగవాన్ శ్రీరాముడు, తిరుచ్చెందూర్ మురుగన్‌ల ఆశీర్వాదంతో తమిళనాట కొత్త అధ్యాయం లిఖితమవుతోంది. 2014లో తమిళనాడు అభివృద్ధిలో పరుగులు పెట్టే ప్రణాళికలు రచించాం. వాటి ఫలితమే ఇప్పుడు తూత్తుకుడి విమానాశ్రయం, పోర్టు విస్తరణ వంటివి జరుగుతున్నాయని చెప్పారు. నా విదేశీ పర్యటనలో చరిత్రాత్మక భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశాం. ఇది దేశంపై ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకాన్ని, దేశ నూతన ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తుంది. ఈ ఆత్మవిశ్వాసంతో వికసిత భారత్‌ను నిర్మిస్తున్నాం. మహాకవి సుబ్రమణ్య భారతీయార్ కూడా తూత్తుకుడి గడ్డపై జన్మించారు. ఆయనకు తూత్తుకుడితో పాటు నా నియోజకవర్గం కాశీతో కూడా గాఢాను బంధముంది. అందుకే కాశీ-తమిళ సంగమం వంటి కార్యక్రమాల ద్వారా మన ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని నిరంతరం బలోపేతం చేసుకుంటున్నాం. పారిశ్రామిక వృద్ధికి, ఆత్మనిర్భర్ భారత్‌కు రైల్వే జీవనాడి. గత 11 ఏళ్లలో దాని ఆధునీకరణపై దృష్టి సారించాం. నేడు దేశవ్యాప్తంగా ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి గట్టి కృషి జరుగుతోంది. ఇటీవల ఇంజనీరింగ్ అద్భుతమైన చీనాబ్ వంతెనతో జమ్మూ-శ్రీనగర్‌ను అనుసంధానించాం. అటల్ సేతు, బోగిబీల్ వంతెన, సోన్‌మార్గ్ సొరంగం వంటివి ఎన్నో ప్రాజెక్టులను మా ప్రభుత్వం పూర్తి చేసింది. తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాం" అని పేర్కొన్నారు. తమిళ సంప్రదాయమైన పంచెకట్టులో సభకు హాజరైన ప్రధాని.. తమిళంలో ప్రసంగాన్ని ప్రారంభించి, తమిళంలోనే ముగించడం విశేషం.

ఆకట్టుకున్న రామ్మోహన్ తమిళ ప్రసంగం

తూత్తుకుడి విమానాశ్రయ కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తమిళంలో ప్రసంగించి స్థానికుల్ని విశేషంగా ఆకట్టుకున్నారు. 'వణక్కం తమిళగం ఎనక్కి రొంబ పిడిక్కుం' అంటూ ప్రసంగాన్ని ధారాళంగా మొదలుపెట్టారు. తమిళ తల్లి ఆశీర్వాదం వల్ల ఈ భాషలో మాట్లాడగలుగుతున్నానని తెలిపారు. సాంకేతిక విజ్ఞానం, త్యాగం, సేవలో తమిళనాడు ముందంజలో ఉందని కొనియాడారు. ఇది తిరువళ్లువర్, రామానుజులు, ఏపీజే అబ్దుల్ కలాం వంటి దిగ్గజాలు జన్మించిన పుణ్య భూమి అన్నారు. వెయ్యేళ్లకు ముందు రాజేంద్రచోళుడు తన సామ్రాజ్యాన్ని గంగా నదివరకూ వ్యాపింపచేశారని, తమిళులంతా గర్వపడాల్సిన రోజు ఇదేనన్నారు. మోదీ పాలనలో దక్షిణాది రాష్ట్రాల్లో కొత్త శకం ప్రారంభమైందన్నారు. ముత్యాల నగరంగా పేరొందిన తూత్తుకుడి ఇకపై వాణిజ్యపరంగా మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. దేశంలో ప్రతి 50 రోజులకు ఒక కొత్త విమానాశ్రయాన్ని ప్రధాని ప్రారంభిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం మరో 5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. దేశం కోసం 24 గంటలు శ్రమిస్తున్న ప్రధాని మోదీ యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం విమానాశ్రయ టెర్మినల్‌లో ఆధునిక సదుపాయాల గురించి ప్రధానికి కేంద్ర మంత్రి స్వయంగా వివరించారు.

వానొచ్చినా.. వరదొచ్చినా.. ముందుకే!



డయాఫ్రంవాల్ ప్రాంతంలో జరుగుతున్న పనులు

ఎగువ, దిగువ కాఫర్ డ్యాంకు ఇరువైపులా వరద జలాలు

వేగంగా 'పోలవరం' డయాఫ్రంవాల్ పనులు

పోలవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): వరదొచ్చినా వానొచ్చినా తగ్గేదేలే! అంటూ పోలవరం ప్రాజెక్టుకు పనులు వేగంగా సాగుతున్నాయి. శనివారం నాటికి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నా.. డయాఫ్రంవాల్, బట్రస్ డ్యాం, గ్యాప్ 1 పనులు వేగంగా చేస్తున్నారు. 1,396 మీటర్ల మేర డయాఫ్రంవాల్ నిర్మాణం చేయాల్సి ఉండగా ఇప్పటికే 404 మీటర్లు పూర్తయ్యింది. 373 ప్యానెల్స్ నిర్మించాల్సి ఉండగా 124 పూర్తయ్యాయి. డయాఫ్రంవాల్ పనులను ఈ ఏడాది జనవరి 2న ప్రారంభించాల్సి ఉండగా డిజైన్ ఎనాలసిస్ జాప్యం వల్ల ప్రారంభం కాలేదు. జనవరి 16న టీ5 ప్లాస్టిక్ కాంక్రీటుతో నిర్మాణం చేయవచ్చని సీడబ్ల్యూసీ, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు చెప్పడంతో మంత్రి నిమ్మల రామానాయుడు జనవరి 18న పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రెండు కాఫర్ డ్యాంల మధ్య 15.95 మీటర్ల నీటిమట్టం ఉన్నా.. ఎలాంటి ఆటంకం లేకుండా డీవాటరింగ్ పనులు సక్రమంగా జరుగుతున్నాయని డిసెంబరు నెలాఖరుకు ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేస్తామని ఈఈ శ్రీనివాస్ తెలిపారు.


మా అమ్మను భారత్‌కు రప్పించండి

▸ ప్రభుత్వానికి కుటుంబసభ్యుల వినతి

▸ జీవనోపాధి కోసం 3నెలల క్రితం కువైత్‌కు

కొయ్యలగూడెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం కువైట్ వెళ్లిన తమ తల్లిని స్వదేశానికి తిరిగి రప్పించాలని ఆమె పిల్లలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఏలూరు జిల్లా బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన మర్రిపూడి సుమ 3 నెలల క్రితం కువైత్‌లో ఇంటి పనులు చేసేందుకు వెళ్లారు. అక్కడికి వెళ్లిన తరువాత ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తిరిగి ఇంటికి వచ్చేస్తానని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సుమ సమాచారం ఇచ్చారు. అక్కడి యాజమానులు ఆమె ఫోన్ తీసుకుని తమతో మాట్లాడనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేశ్ వద్ద శనివారం మొరపెట్టుకున్నారు. ఎంపీ పుట్టా మహేశ్ ద్వారా విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే ఆమెను భారత్‌కు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని నరేశ్ వారికి తెలిపారు.

అమెరికాలో 'పల్నాడు' బాలుడు మృతి



యత్విక్ సాయి

ఈపూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని జఫర్‌సన్ సిటీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన తుర్లపాటి యత్విక్ సాయి (9)మృతి చెందాడు. బాలుడి తండ్రి తుర్లపాటి శ్రీనివాసరావు ఉద్యోగరీత్యా పది సంవత్సరాలుగా అమెరికాలోనే ఉంటున్నారు. యత్విక్‌సాయి అమెరికాలోనే జన్మించాడు. ప్రతిరోజూ వాకింగ్‌కు వెళ్లే తండ్రి వెంట యత్విక్‌సాయి వెళ్తుంటాడు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లినప్పుడు ట్రక్ ఢీకొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్టు బంధువులు తెలిపారు.

ఇక రయ్.. రయ్.. రోడ్లు

8 వేల కోట్లతో స్టేట్ హైవేల నిర్మాణం.. పీపీపీ విధానంలో చేపట్టడానికి కార్యాచరణ

▸ వచ్చే నెలలో డీపీఆర్‌లు రెడీ

▸ తొలిదశలో 18 రహదారులు అభివృద్ధి

▸ 12 రోడ్లు వీజీఎఫ్ ద్వారా, మిగిలినవి సీఆర్ఎఫ్ కింద నిర్మాణం

▸ ఫోర్‌లేన్ రోడ్లుగా రెండు వరుసల రోడ్లు

▸ 2 వరుసలుగా సింగిల్ లేన్ రోడ్లు అభివృద్ధి

▸ కేంద్రానికి ప్రతిపాదనలు పంపేనాటికే భూమి సిద్ధం చేయాలని సీఎం ఆదేశం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రయ్.. రయ్.. మంటూ ప్రయాణం సాగించేలా రాష్ట్రంలోని రహదారులను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషిచేస్తోంది. ఎంపిక చేసిన ప్రధాన రహదారుల (స్టేట్ హైవే) విస్తరణ, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న కార్యాచరణ ప్రణాళికలు కొలిక్కివస్తున్నాయి. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో చేపట్టాలనుకున్న రాష్ట్ర ప్రధాన రహదారుల నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లు ఆగస్టులో ఖరారుకానున్నాయి. అధికారిక నివేదిక ప్రకారం 1,332 కి.మీ. పరిధిలో 18 రహదారులను తొలి దశలో పీపీపీ కింద అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం రూ. 8 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా వేశారు. 12 రహదారులను కాంట్రాక్టర్, కేంద్రం ఇచ్చే నిధుల భాగస్వామ్యంతో వయబులిటీ గ్యాప్ ఫండ్(వీజీఎఫ్) ద్వారా నిర్మించాలని, మిగిలిన వాటిని సెంట్రల్ రోడ్‌నోట్‌వర్క్ ఫండ్ (సీఆర్ఎఫ్) కింద చేపట్టాలని ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. పీపీపీ రోడ్లకు సంబంధించి మొత్తం నిర్మాణ వ్యయం రూ. 8,588 కోట్లు కానుంది. ఇందులో ప్రాజెక్టు వ్యయమే రూ. 5,894 కోట్లుగా ఉంది. భూ సేకరణ, పునరావాసం, ఇతర ఖర్చులు కలిపి రూ. 2,694 కోట్లు కానుందని లెక్క తేల్చారు. వీజీఎఫ్‌లో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 598 కోట్లు ఉండనుందని అంచనావేశారు. ఇలా ఈమొత్తం పీపీపీ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 3,292 కోట్లు ఉండనుందని అధికారవర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. ఇందులో ఆరు రహదారులకు సంబంధించి 448 కి.మీ. మేర సీఆర్ఎఫ్ కింద చేపట్టాలని ప్రతిపాదించారు. వచ్చే నెలలో డీపీఆర్‌లు ఖరారైన తర్వాత వాటి కి ఆమోదం కోసం కేంద్రానికి పంపించనున్నారు. కేంద్రానికి ప్రతిపాదనలు పంపించే నాటికే రహదారుల నిర్మాణానికి అవసరమైన భూమిని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి అనుమతులు రాగానే తొలుత 12 రోడ్లకు టెండర్లు పిలవాలని ఆర్అండ్‌బీ సిద్ధమవుతోంది. ఇదిలా ఉంటే, 3,854 కి.మీ. పరిధిలో మరో 67 రహదారులను పీపీపీ విధానం పరిధిలో అభివృద్ధి చేసేందుకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఆర్అండ్‌బీని ఆదేశించింది. దీంతో ఈ అధ్యయనం బాధ్యతలను కొన్ని ఏజెన్సీలకు అప్పగించారు. ఇవి కూడా ఆగస్టు నెలాఖరు నాటికి సిద్ధం కానున్నాయని తెలిసింది.

20 కి.మీ. పొడవుంటే ఉంటే చాలు

పీపీపీలో ఏదైనా రహదారిని ఎంపిక చేయాలంటే కనీసం 20 కి.మీ. పొడవు ఉంటే చాలని ఆర్అండ్‌బీ భావిస్తోంది. కనీసం 20 కి.మీ. ఉండి, గరిష్ఠంగా 110 కి.మీ. వరకు ఉండే రహదారులను ఈ ప్రాజెక్టులో ఎంపిక చేశారు. ఇప్పటికే రెండు వరుసలుగా ఉన్న రహదారులను నాలుగు వరుసలుగా అభివృద్ధి చేస్తారు. సింగిల్‌లేన్‌గా ఉన్న వాటిని రెండు వరుసలుగా అభివృద్ధి చేయనున్నారు. ఆ తర్వాత ఆ రహదారులపై టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేస్తారు. రహదారి నిర్మాణ వ్యయాన్ని బట్టి టోల్ రుసుము వసూలు కాలాన్ని నిర్ధేశించనున్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో జస్టిస్ గోపాలకృష్ణారావు



జస్టిస్ గోపాలకృష్ణారావును ఆశీర్వదిస్తున్న మంత్రాలయ పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు.

30న ఆర్టీసీ ఎన్ఎంయూఏ సమావేశం

విజయవాడ(బస్‌స్టేషన్), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న విజయవాడలో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కమిటీ సమావేశం జరుగుతుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలతో పాటు కీలకమైన సమస్యలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

ఆగస్టు 26 నుంచి పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర శివార్లలోని తాడి-దువ్వాడ స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆగస్టు 26 నుంచి పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్టు విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వచ్చే నెల 26, 28, 30 తేదీల్లో రాజమండ్రి-విశాఖ (67285), విశాఖ-రాజమండ్రి (67286), కాకినాడ-విశాఖ (17267), విశాఖ-కాకినాడ మెము ప్యాసింజర్లు (17268), విశాఖ-విజయవాడ రత్నాచల్ (12717), విజయవాడ-విశాఖ రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12718) రైళ్లను రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. 26, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ (22876), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875) రద్దు చేశామని పేర్కొన్నారు.

వ్యభిచార గృహాలను నిర్మూలించాలి

▸ అసత్య ఆరోపణలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

▸ పెద్దాపురంలో సూర్యబలిజ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో



కాకినాడ జిల్లా పెద్దాపురం మున్సిపల్ జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న సూర్య బలిజ సంఘం మహిళలు

పెద్దాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో వ్యభిచార గృహాలను సమూలంగా నిర్మూలించాలని, తమ మనోభావాలు దెబ్బతినేలా అసత్య ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూర్య బలిజ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి గూడూరి మోహన్‌రావు ఆధ్వర్యంలో పెద్దాపురం మున్సిపల్ జంక్షన్ వద్ద శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం వదిలేసిన వృత్తిని ప్రస్తావిస్తూ కొన్ని సామాజిక మాధ్యమాల్లో తమను కించపరిచేలా దుష్ప్రచారం చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమాజంలో తమ కులస్థులు ఎంతో ఉన్నతమైన జీవితాలను గడుపుతున్నారని, అయినా తమ పేరు ప్రస్తావించి మనోభావాలు దెబ్బతినేలా కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఇటువంటి అసత్య ఆరోపణలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అనంతరం సీఐ విజయ్‌శంకర్‌కు వినతిపత్రాన్ని అందచేశారు.

హ్యాట్సాఫ్ మాస్టారూ!

▸ ఆదర్శ ఉపాధ్యాయుడు శ్రీధర్‌కు లోకేశ్ అభినందనలు

▸ మోడల్ ఎడ్యుకేషన్‌కు మీలాంటివారే ప్రేరణ అంటూ మంత్రి కితాబు

▸ ఆయన గురించి వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కీ లోకేశ్ అభినందనలు



శ్రీధర్ మాస్టారును సన్మానిస్తున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి

విజయవాడ (విస్సన్నపేట), జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'ప్రాణాలు కాపాడిన ఫేస్‌బుక్ సందేశం' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన వార్తకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ విద్యార్థికి చికిత్స చేయించడం కోసం ఫేస్‌బుక్ మాధ్యమంగా రూ.6 లక్షల విరాళాలు సేరించిన శ్రీధర్ అనే ఉపాధ్యాయుడి గురించి వచ్చిన కథనాన్ని చూసిన లోకేశ్ ఎక్స్‌లో ఆ ఉపాధ్యాయుడిని, 'ఆంధ్రజ్యోతి'ని అభినందించారు. 'అంకితభావంతో బోధన, నిస్వార్థ సేవా కార్యక్రమాల ద్వారా అందరికీ మార్గదర్శిగా నిలుస్తున్న ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం నర్సాపురం జడ్పీ హైస్కూల్ ఇంగ్లీష్ టీచర్ బొల్లేపల్లి శ్రీధర్‌కు అభినందనలు. ప్రమాదానికి గురైన ఒక విద్యార్థి బ్రెయిన్ సర్జరీ కోసం రూ.6 లక్షల విరాళాలు పోగుచేసి ప్రాణాలు నిలిపిన మీకు హ్యాట్సాఫ్. ప్రభుత్వ స్కూల్లో వసతులు, లైబ్రరీ బుక్స్, మైక్‌సెట్, క్రీడా సామగ్రి కోసం దాతల సహకారంతో రూ.లక్షలు సమకూర్చి విద్యా వికాసానికి దోహదపడిన శ్రీధర్ మాస్టారు అందరికీ ఆదర్శం. పాఠశాల సమయం ముగిశాక..ఇంగ్లీష్ నేర్చుకోవాలనే ఆసక్తి కలిగిన విద్యార్థులకు సొంతింట్లో భోజనం పెడుతూ క్లాసులు చెబుతున్న శ్రీధర్ మాస్టర్ వంటివారే ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌ను రూపొందించేందుకు ప్రేరణ' అని లోకేశ్ ట్వీట్ చేశారు. 'ఆంధ్రజ్యోతి' పోస్టు చేసిన వార్త క్లిప్పింగ్‌ను లోకేశ్ తన సందేశానికి జత చేశారు. ఈ సందర్భంగా శనివారం విస్సన్నపేట వచ్చిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆర్డీవో మాధురి.. శ్రీధర్ మాస్టారును సన్మానించి అభినందించారు.

ఎంబీబీఎస్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నోటిఫికేషన్

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి హెల్త్ వర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉన్న సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో బి 1, బి 2, ఎన్ఆర్ఐ కోటా సీట్లతో పాటు తిరుపతిలోని పద్మావతి మెడికల్ కాలేజీల్లో ఎన్ఆర్ఐ కోటా సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా కాలేజీల్లో సీట్ల కోసం దరఖాస్తుకు 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ అవకాశం కల్పించారు.

ఆగస్టు 6న క్యాబినెట్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్) ఆగస్టు 6వ తేదీన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రులు, కార్యదర్శులకు సాధారణ పరిపాలన శాఖ నుంచి సమాచారం అందించారు. మంత్రివర్గ సమావేశంలో పెట్టే అంశాలకు సంబంధించి ప్రతిపాదనలను ఆయా శాఖాధిపతులు 4వ తేదీన నాటికి పంపించాలని ఆదేశించారు.

దేశాన్ని పాలించే అర్హత రాహుల్‌కే ఉంది: రఘువీరా

మడకశిర, జూలై 26(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నేత రాహుల్ గాంధీకి అన్ని విషయాలపై సంపూర్ణమైన అవగాహన ఉందని, దేశాన్ని పాలించడానికి పూర్తి అర్హతలు ఆయనకు ఉన్నాయని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఉన్న బడుగు, బలహీన వర్గాల వారికి సమాన అవకాశాలు రావాలని ఆకాంక్షించారు.

కరేడు రైతు కూలీలపై తప్పుడు కేసులు

▸ జాతీయ ఎస్టీ కమిషన్‌కు సుంకర పద్మశ్రీ పిర్యాదు

న్యూఢిల్లీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కరేడులో రైతుల నిరసనల్లో పాల్గొంటున్న రైతు కూలీలపై ఉలవపాడు పోలీసుస్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేశారని జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ శనివారం జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తప్పుడు కేసులు నమోదు వెనుకాల ఉన్న బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

'ఉచిత బస్సు'లో రాష్ట్రమంతా తిరగొచ్చు

▸ ప్రత్యేకంగా ఐదు రకాల బస్సులు

▸ ఆటోడ్రైవర్లకు ప్రత్యేక పథకం.. త్వరలో వివరాలు

▸ మంత్రి లోకేశ్ చొరవతోనే: మంత్రి అచ్చెన్నాయుడు

అన్నవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మహిళలు రాష్ట్రమంతటా ప్రయాణించేలా ఉచిత బస్సు పథకానికి రూపకల్పన జరుగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఆగస్టు 15 నుంచి ఈ పథకం అమలవుతుందని గుర్తుచేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం అన్నవరంలో శనివారం జరిగిన 'సుపరిపాలన-తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఆర్టీసీ అధికారులతో తాను, మంత్రి లోకేశ్ సమావేశమయ్యామన్నారు. ఆ సందర్భంలో, రాష్ట్ర మహిళలు పనిలేకుండా ప్రయాణించరని, దానికి అనుగుణంగా ఉచిత ప్రయాణం జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రమంతా అమలు చేయాలని లోకేశ్ ఆదేశించినట్లు తెలిపారు. ఈ మేరకు ఐదు రకాల బస్సులను ప్రవేశపెడుతున్నామన్నారు. అదే సమయంలో ఆటోడ్రైవర్లు ఇబ్బంది పడకుండా వారికి ప్రత్యేక పథకం అమలు చేస్తామని, దాన్ని త్వరలోనే వెల్లడిస్తామని స్పష్టం చేశారు. ఇటీవల బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా ఇస్తున్న సాయంలో అధికశాతం నాటి ప్రభుత్వంలో నాసిరకం మద్యం తాగి కిడ్నీ, లివర్ పాడైన కేసులు ఉన్నాయని తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద 54లక్షల మంది రైతులకు మూడు విడతల్లో కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ.20 వేలు అందజేస్తామన్నారు. పరిశ్రమల స్థాపన కోసం సీఎం అహర్నిశలూ కష్టపడుతున్నా, కొందరు పారిశ్రామికవేత్తలు 'మీ రాష్ట్రంలో అవినీతి భూతం ఉందని, అది ఉంటే తాము రాలేమ'ని చెబుతున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం, మరోసారి ఆ భూతం రాకుండా తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రజల చేతిలోనే ఉందని అచ్చెన్న అన్నారు.

రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబే

▸ అప్పుపుట్టకుండా చేసిన ఘనుడు జగన్

▸ కొత్తగా 40 అన్న క్యాంటీన్లు: మంత్రి పయ్యావుల



మండపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం చేసిన ఘనత నాటి సీఎం జగన్‌కే దక్కుతుందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరులో శనివారం ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వైసీపీ పాలనలో జగన్ పది లక్షల కోట్ల మేర అప్పులు చేసి, చివరికి రాష్ట్రానికి అప్పు కూడా పుట్టని పరిస్థితి తీసుకువచ్చారన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబేనని, ఆయన వల్లే పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. తమ ప్రభుత్వ ప్రయత్నాలతో రూ.90 వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. గత ఐదేళ్లలో ఎక్కడా పరిశ్రమలు రాలేదని, ఆదాయం పెంచుకునేందుకు ఇసుక, మద్యం, ఖనిజ దోపిడీ తప్ప చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. కూటమి పార్టీలకు ఓటు వేసిన ప్రజలకు తామంతా రుణపడి ఉంటామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 40 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

130 గ్రామాల్లో భూ సమస్యలు

▸ జిల్లాల పునర్విభజన చేస్తాం: మంత్రి సత్య ప్రసాద్



మంత్రి సత్యప్రసాద్‌ను కలిసిన వీఆర్వోల అసోసియేషన్ నాయకులు

నరసాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 130 గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నాయని, వాటిపై ప్రభుత్వానికి అక్టోబరు నాటికి ఓ నివేదికను అందిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కొన్ని భూములు వెబ్‌ల్యాండ్‌లో చూపించని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కారణంగా రిజిస్ట్రేషన్లు జరగడం లేదని రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇలాంటి సమస్యల్ని పరిష్కరించాలని జిల్లా యాంత్రాంగాన్ని ఆదేశించినట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన సక్రమంగా జరగలేదన్నారు. కొన్ని పార్లమెంట్ పరిధిలోని కొన్ని గ్రామాలు, మండలాలు పక్క జిల్లాలో ఉన్నాయని, ఇలాంటి సమస్యల్ని జిల్లాల పునర్విభజనలో సరి చేస్తామని చెప్పారు. అంతకుముందు వీఆర్వోల సంఘ నాయకులు మంత్రిని కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించారు.

పబ్జీ ఆడుకునేవాడికి పాలనేమి తెలుసు?

▸ దేవదాయశాఖ మంత్రి ఆనం వ్యాఖ్యలు

పెద్దదోర్నాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎంతో నమ్మకంతో అధికారం ఇస్తే తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని పబ్జీ ఆడుకుంటూ లక్షల కోట్లు దోపిడీ చేసేవానికి ప్రజాపాలన ఏమి తెలుసని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. ప్రకాశం జిల్లా యైపాలెం నియోజకవర్గం పెద్దదోర్నాలలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి.. వెలిగొండ పూర్తి చేయకుండా జాతికి అంకితం చేశానని, వాననీటిని నిల్వ చేసి కట్టలు తెంచి హంద్రీ-నీవా ప్రాజెక్టు నుంచి కుప్పానికి నీళ్లిచ్చానంటూ ప్రజలను మభ్యపెట్టాలని చూసిన ఘనుడు జగన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. కానీ, ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని అవరోధాలు ఎదురైనా అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అన్ని పథకాలనూ అమలు చేస్తున్న దార్శనికుడు చంద్రబాబు అని కొనియాడారు.

అధికారం కోల్పోయినా బుద్ధి మారలేదు: మంత్రి సుభాష్

అహంకారం, అహంభావంతో అధికారం కోల్పోయినా జగన్‌రెడ్డికి ఇంకా బుద్ధి మారలేదని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆక్షేపించారు. చీకటి పాలన చేసిన జగన్ అధికారం కోల్పోవడంతో పిచ్చిపట్టినట్లుందని, ఏవేవో మాట్లాడుతున్నారని ఆరోపించారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం ఇంట్లో.. భారీగా విదేశీ మద్యం స్వాధీనం

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవికుమార్ ఇంట్లో భారీగా విదేశీ మద్యంతో పాటు డిఫెన్స్, ఇతర రాష్ట్రాలకు చెందిన 67 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీఎం పాలెంలోని ఎంవీవీ సిటీలో ఫ్లాట్ నంబర్ 8088లో విదేశీ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ముసలనాయుడు బృందం శనివారం సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఇంట్లో 18 విదేశీ, 16 డిఫెన్స్, ఒడిశా, గోవా మద్యం సీసాలు ఒక్కొక్కటి, తెలంగాణ మద్యం సీసాలు 11, హరియాణ రాష్ట్ర మద్యం బాటిళ్లు ఏడు, మహారాష్ట్రకు చెందినవి రెండు స్వాధీనం చేసుకున్నారు. రవికుమార్ పరారీలో ఉండడంతో గాలిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సోషల్ మీడియాలో ఉన్నతాధికారి రాసలీలల వీడియో

స్టీల్‌ప్లాంట్‌లోని ఓ ఉన్నతాధికారి రాసలీలల వీడియో ఒకటి శనివారం సాయంత్రం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వీడియోను సదరు అధికారే స్వయంగా రికార్డు చేసినట్టు అందులో స్పష్టంగా తెలుస్తోంది. ప్లాంటులోని ఆయన కంప్యూటర్ నుంచే ఇది బయటకు వచ్చిందని సమాచారం. ఇంకొద్ది రోజుల్లో ఆయన పదవీ విరమణ చేయబోతుండగా ఇది బయటపడడం గమనార్హం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ఏ గ్రంథం చెప్పింది జగన్?

నిజాయితీగా చెప్పుకోవాలంటే, జగన్‌రెడ్డి మినహా మరే ఇతర ముఖ్యమంత్రి కూడా మద్యం, ఇసుక నుంచి డబ్బు పిండుకొనే ప్రయత్నం చేయలేదు. అలాంటి అవకాశం ఉందన్న ఆలోచన కూడా వారెవరికీ రాలేదు. 2024 ఎన్నికల్లో జగన్ ఘోరంగా ఓడిపోవడానికి నాసిరకం మద్యం సరఫరా కూడా ఒక కారణం కాదా? ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినందుకే దేవుడు 2019లో రాసిన స్క్రిప్ట్‌ను తిరగరాశాడు. బ్రేక్ ఫాస్ట్ నుంచి రాత్రి డిన్నర్ వరకు డబ్బును మాత్రమే నంజుకు తినాలని చూసే వారిని దేవుడు మాత్రం ఉపేక్షిస్తాడా? ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారు. జరిగిన తంతును పరిశీలించిన ఎవరైనా జగన్ అండ్ కోకు పాపభీతి ఉందని, దైవభక్తికి కొదవ లేదని చెప్పగలరా? నాసిరకం మద్యం తాగి ప్రాణాలు కోల్పోయిన వారు, ఒళ్లు గుల్ల చేసుకున్న వారి శాపనార్థాలను కొట్టిపారేయలేం. ఎవరైనా పాప పరిహారం చెల్లించుకోవాల్సిందే! అది ఎప్పుడు అన్నదే ప్రశ్న?

ఇంతకూ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆస్తికుడా? నాస్తికుడా? మాటకు ముందూ వెనుకా ఆ దేవుడు కరుణిస్తే అని ఆయన అంటూ ఉంటారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 23 సీట్లకే పరిమితమై, తనకు 151 సీట్లు వచ్చినప్పుడు 'ఆ దేవుడి స్క్రిప్ట్ ఎంత గొప్పగా ఉందో' అని పొంగిపోయారు. 2024 ఎన్నికల్లో తన పార్టీ 11 సీట్లకే పరిమితమైనప్పుడు మాత్రం దేవుణ్ని తలుచుకోలేదు. అన్నిటికీ దేవుడు ఉన్నాడని ఆయన చెబుతుంటారు. దీన్నిబట్టి ఆయనకు దైవభక్తి ఎక్కువ అని ఎవరైనా నమ్మాల్సిందే. పదహారణాల క్రైస్తవుడిగా ప్రతి రోజూ ఆయన ప్రేయర్లు చేస్తుంటారు. తనకు ఆ ప్రభువే అండగా ఉన్నాడని నమ్మకంగా చెబుతుంటారు. క్రైస్తవ మతాన్ని మనసా వాచా కర్మణా ఆచరించేవారు బైబిల్ సూక్తులను ఆచరించాలి. దైవ భక్తి ఉన్నవారికి సహజంగానే పాపభీతి ఉంటుంది. అన్నట్టు ఆ మధ్య ఎవరో తమ బిడ్డకు పేరు పెట్టమని కోరగా 'దేవుడు' అని జగన్‌రెడ్డి నామకరణం చేశారు. ఆడపిల్లకు దేవుడు అనే పేరు ఎలా నప్పుతుందో తెలియదు. మొత్తానికి ఆయనను ఆస్తికుడిగానే పరిగణించాలి. అయితే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గానీ, ఆ తర్వాత అధికారం కోల్పోయినప్పుడు గానీ ఆయన చేష్టలను పరిశీలిస్తే జగన్‌రెడ్డిలో ఏ కోశానా పాపభీతి లేదని స్పష్టమవుతుంది. దేవుడి కంటే డబ్బే తనకు ముఖ్యమని అధికారంలో ఉన్నప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలను బట్టి ఎవరైనా భావించడంలో తప్పు లేదు. జగన్ హయాంలో అమలు చేసిన మద్యం విధానమే ఇందుకు నిదర్శనం. మద్యం వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిందని కూటమి ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతోంది. దీనిపై ఏర్పాటు చేసిన సిట్ విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. అయితే అవన్నీ భేతాళ కథలుగా జగన్ అండ్ కో కొట్టిపడేస్తున్నారు. మద్యం వ్యవహారంలో సిట్ అధికారులు చెబుతున్నట్టుగా 3,600 కోట్ల రూపాయల అవినీతి జరిగిందా? లేదా? అన్నది న్యాయ సమీక్షలోనే తేలుతుంది. అయితే ధన దాహంతో జగన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మద్యం విధానమే అసలు సమస్య. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, రాష్ట్రం విడిపోయిన తర్వాత గానీ నాణ్యమైన మద్యాన్ని మాత్రమే ఆయా ప్రభుత్వాలు సరఫరా చేసేవి. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా పేరున్న బ్రాండ్లనే కొనుగోలు చేయించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రమే విషతుల్యమైన నాసిరకం మద్యాన్ని మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ మద్యం తాగడం వల్ల పలువురు మరణించగా, ఎన్నో వేల మందికి కిడ్నీలు పాడైపోయాయి. ఇప్పుడు వారంతా జీవచ్ఛవాలుగా బతుకుతున్నారు. కమీషన్ల కక్కుర్తితో ఇంతటి మహా పాతకానికి ఒడిగట్టిన జగన్‌రెడ్డిలో దైవభక్తి ఉంది, పాపభీతి ఉంది అని ఎలా నమ్మడం? పాపభీతి ఉన్నవారు ఎవరూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కాసుల కోసం కక్కుర్తి పడరు. నిజానికి మద్యం వ్యాపారం చేసిన వారెవరూ బాగుపడలేదు. మందు బాబుల ఇళ్లలోని ఆడవాళ్ల శాపనార్థాలు తగిలి వారి కుటుంబాలు చితికిపోయాయి. విజయ్ మాల్యా వంటి వారికి ఎలాంటి దుస్థితి దాపురించిందో చూస్తున్నాం. అలాంటిది నాసిరకం మద్యం సరఫరా చేసిన వారికి మహిళల ఉసురు తగలకుండా ఉంటుందా? నిజంగా దైవభక్తి ఉన్నవాళ్లు ఇలాంటి నీచానికి ఒడిగట్టరు. ప్రభుత్వం చెబుతున్న లిక్కర్ కుంభకోణం అంతా బోగస్ అని, గత ప్రభుత్వంలో లిక్కర్ అమ్మకాలు తగ్గి ప్రభుత్వ ఆదాయం పెరిగిందని, అలాంటప్పుడు అవినీతికి ఆస్కారం ఎక్కడ ఉంటుందని జగన్ అండ్ కో ప్రశ్నిస్తున్నారు. అయితే అలా ఎలా జరిగిందో మాత్రం వారు వివరించడం లేదు. గత ప్రభుత్వాలు నాణ్యమైన మద్యం సరఫరా చేయడం వల్ల అమ్మకాలు అధికంగా కనిపించినా లాభాలు అందుకు తగ్గట్టుగా ఉండేవి కావు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాసిరకం మద్యాన్ని అధిక మార్జిన్‌తో అమ్మేవారు. దీంతో అమ్మకాలు తగ్గినట్టుగా, ప్రభుత్వ ఆదాయం పెరిగినట్టుగా కనిపించేది. ఈ లాజిక్‌ను కనిపెట్టే జగన్ అండ్ కో తమకు అనుకూలమైన పాయింట్లతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలు పెరిగాయన్నది వాస్తవం. అయితే ఇందుకు ప్రజలు విపరీతంగా తాగేయడమో, మరొకటో కారణం కాదు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే మార్కెట్‌లోకి నాణ్యమైన బ్రాండ్స్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల ఆదాయం సహజంగానే పెరుగుతుంది. ఎందుకంటే వాటి ధర ఎక్కువగా ఉంటుంది. జగన్ జమానాలో కమ్మని బీరు కూడా ఆంధ్రప్రదేశ్‌లో లభ్యం కావడం లేదని ఎంతో మంది వ్యాఖ్యానించడం తెలిసిందే. పది రూపాయల విలువ కూడా చేయని క్వార్టర్ బాటిల్‌ను జగన్ హయాంలో వంద రూపాయలకు అమ్మారని చెబుతారు. ఆయన అధికారంలోకి వచ్చిన రెండు మూడు నెలల్లోనే అంతకుముందు నుంచి ఉన్న డిస్టిలరీలను ఇప్పుడు లిక్కర్ కుంభకోణంలో అరెస్టయి జైల్లో ఉన్న కొందరు హస్తగతం చేసుకున్నారు. సదరు డిస్టిలరీలలో నాసిరకం మద్యం తయారుచేసి ప్రభుత్వానికి సరఫరా చేశారు. ఈ క్రమంలో జగన్ అండ్ కో నిర్ణయించిన మొత్తాన్ని ఆయన సూచించిన వారికి ముట్టజెప్పేవారు. ఉదాహరణకు, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ అనే కంపెనీ మద్యం వ్యాపారంలో రెండు మూడు తరాలుగా ఉంది. అన్ని రాష్ట్రాలు ఆ కంపెనీ నుంచి అంతో ఇంతో మద్యం కొనుగోలు చేసేవి. అలాంటి కంపెనీ నుంచి మద్యం కొనుగోలు చేయడానికి జగన్ ప్రభుత్వం నిరాకరించింది. దీంతో విధిలేని పరిస్థితుల్లో జగన్ రెడ్డి విధించిన షరతులకు తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ తలవొంచక తప్పలేదు. అంగీకరించిన విధంగా చెల్లించాల్సిన ముడుపులను పది గ్రాముల బంగారు నాణేల రూపంలో కావాలని కోరడం వల్లనే ఆ కంపెనీ వాళ్లు పద్మావతి జ్యువెలరీస్ నుంచి 200 కోట్ల రూపాయల విలువైన బంగారం కొనుగోలు చేసి అప్పగించారు. ఇలా బంగారం కొనుగోలు చేసిన ఉదంతాలు ఆ కంపెనీ చరిత్రలో లేవు. జగన్‌రెడ్డిని సమర్థిస్తున్న వాళ్లు ఇందుకు ఏం సమాధానం చెబుతారు?

తమ్ముడు తమ్ముడే...

లిక్కర్ కుంభకోణం.. అమలు కోసం ఒక వెబ్ అంటే సాలెగూడు తరహా నెట్‌వర్క్‌ను సృష్టించారు. ఫలితంగానే ఈ వ్యవహారంలో పలువురి పేర్లు బయటికొస్తున్నాయి. లిక్కర్‌ను సొంతానికి ప్రధాన ఆదాయ వనరుగా మార్చిన ఘనత కూడా జగన్‌రెడ్డికే దక్కుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, రాష్ట్రం విడిపోయిన తర్వాత గానీ ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారెవరూ లిక్కర్‌ను తమ పార్టీల ప్రధాన ఆర్థిక వనరుగా భావించలేదు. మద్యం తయారీ కంపెనీలు ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేవి. అంతకు మించి మద్యం కొనుగోళ్లలో ప్రభుత్వ పెద్దల జోక్యం ఉండేది కాదు. డిమాండ్‌ను బట్టి ఏ బ్రాండ్‌ను ఎంత మొత్తంలో కొనుగోలు చేయాలో అధికారుల స్థాయిలో నిర్ణయించేవారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత లిక్కర్ వ్యాపారాన్ని బంగారు గుడ్డు పెట్టే బాతుగా మార్చారు. నెలకు 50 నుంచి 60 కోట్ల వరకు పార్టీ ఖాతాకు సమర్పించవలసిందే అని షరతు పెట్టారు. తమకు అందే ముడుపులను బట్టి ఏ కంపెనీ నుంచి ఎంత మొత్తం కొనుగోలు చేయాలో పై స్థాయిలో నిర్ణయించేవారు. అధికారులు నిమిత్త మాత్రులు. 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అన్నట్టుగా అధికారులు తమ వాటాలు రాబట్టుకునేవారు. నిజానికి జగన్ అండ్ కో లక్ష్యంగా పెట్టుకున్న మొత్తాన్ని ఇవ్వడానికి పేరున్న బ్రాండ్లకు చెందిన కంపెనీలు అంగీకరించలేదు. ఆ కారణంగానే నాసిరకం మద్యం సరఫరా చేశారు. నిర్దేశించుకున్న మొత్తాలను కాజేశారు. ఉదాహరణకు మద్యం వ్యాపారంలో దశాబ్దాలుగా ఉన్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అప్పుడు వైసీపీలోనే ఉన్నారు. తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే అన్నట్టుగా ఆయనకు కూడా జగన్ అండ్ కో టార్గెట్ విధించింది. అయితే అంత మొత్తం ఇవ్వడం సాధ్యం కాదని మాగుంట తేల్చిచెప్పడంతో ఆయన సరఫరా చేసే మెక్‌డొనాల్డ్ మద్యం కొనుగోళ్లను నిలిపివేశారు. దాని స్థానంలో చెత్త బ్రాండ్లు మార్కెట్లోకి వచ్చాయి. ఈ విషయంలో ఎవరికైనా అనుమానాలు ఉంటే మాగుంట శ్రీనివాసులురెడ్డిని అడిగి తెలుసుకోవచ్చు. ఇసుక, మద్యం ద్వారా నెలకు వంద కోట్లకు పైగా సమకూర్చుకోవాలని జగన్ అండ్ కో లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కారణంగానే ఈ రెండు విధానాలూ వివాదాస్పదం అయ్యాయి. నిజాయితీగా చెప్పుకోవాలంటే, జగన్‌రెడ్డి మినహా మరే ఇతర ముఖ్యమంత్రి కూడా మద్యం, ఇసుక నుంచి డబ్బు పిండుకొనే ప్రయత్నం చేయలేదు. అలాంటి అవకాశం ఉందన్న ఆలోచన కూడా వారెవరికీ రాలేదు. 2024 ఎన్నికల్లో జగన్ ఘోరంగా ఓడిపోవడానికి నాసిరకం మద్యం సరఫరా కూడా ఒక కారణం కాదా? ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినందుకే దేవుడు 2019లో రాసిన స్క్రిప్ట్‌ను తిరగరాశాడు. బ్రేక్ ఫాస్ట్ నుంచి రాత్రి డిన్నర్ వరకు డబ్బును మాత్రమే నంజుకు తినాలని చూసే వారిని దేవుడు మాత్రం ఉపేక్షిస్తాడా? ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారు. జరిగిన తంతును పరిశీలించిన ఎవరైనా జగన్ అండ్ కోకు పాపభీతి ఉందని, దైవభక్తికి కొదవ లేదని చెప్పగలరా? పాపభీతి ఉంటే ప్రజల రక్తమాంసాలను పణంగా పెట్టి కాసులకు కక్కుర్తిపడరు. నాస్తికులు కూడా ఇలాంటి నీచానికి ఒడిగట్టరు. ఎందుకంటే వారిలో నైతికత అధికంగా ఉంటుంది. బైబిల్‌ను నిత్యం పఠించేవారు, క్రైస్తవ మతాన్ని చిత్తశుద్ధితో ఆచరించేవారు ఎవరూ కూడా పాపిష్టి డబ్బు కోసం ఆశపడరు. దీన్నిబట్టి జగన్‌రెడ్డి అటు ఆస్తికుడూ కాదు– ఇటు నాస్తికుడూ కాడని భావించాల్సి ఉంటుంది. ఆయనకు డబ్బు మాత్రమే ముఖ్యం. అధికారం కూడా డబ్బు కోసమే అనే కోణంలోనే ఆయన ఆలోచిస్తాడన్నది సుస్పష్టం. పాపభీతి, కుటుంబ సంబంధాల పట్ల అనురాగం ఉండి ఉంటే సొంత బాబాయ్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వెనకేసుకొని రారు కదా? 2004తో పోల్చితే జగన్‌రెడ్డి వద్ద ఇప్పుడు అంతులేని సంపద ఉంది. అదే సమయంలో కుటుంబ సభ్యులు ఆయనకు దూరమయ్యారు. రక్తసంబంధం కంటే డబ్బే ముఖ్యమని భావించి సొంత చెల్లిని, తల్లిని కూడా దూరం చేసుకున్నారు. మనకు అంటూ ఎవరూ లేనప్పుడు ఈ డబ్బు ఎందుకు? తమిళనాడు ముఖ్యమంత్రిగా మరణించిన జయలలిత ఏమి తీసుకెళ్లారు? నాసిరకం మద్యం తాగి ప్రాణాలు కోల్పోయినవారు, ఒళ్లు గుల్ల చేసుకున్నవారి శాపనార్థాలను కొట్టిపారేయలేం. ఎవరైనా పాప పరిహారం చెల్లించుకోవాల్సిందే! అది ఎప్పుడు అన్నదే ప్రశ్న?

అంతా మీ చేతుల్లోనే మిలార్డ్స్!

ఈ విషయాన్ని అలా ఉంచితే, వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు ఇస్తున్న కొన్ని ఆదేశాలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం చేస్తున్న వ్యాఖ్యలు, వెల్లడిస్తున్న అభిప్రాయాలు సంచలనంగా ఉంటున్నాయి. కొన్ని సందర్భాలలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కటువుగానూ ఉంటున్నాయి. సదరు వ్యాఖ్యలను పరిశీలిస్తే సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురైనవారు హైకోర్టు న్యాయమూర్తులుగా ఎలా నియమితులయ్యారు? అన్న సందేహం కలగడం సహజం. అయితే అలాంటి వారిని కూడా సుప్రీంకోర్టు కొలీజియమే ఎంపిక చేసినందున ఎవరిని తప్పు పట్టాలి? తాజాగా ఒక హత్య కేసులో అరెస్టై జైల్లో ఉన్న కన్నడ నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. 'పర్వర్టెడ్ ఆర్డర్' అని కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇంకొంచెం వెనక్కు వెళితే, ఆంధ్రప్రదేశ్‌లో ఐపీఎస్ అధికారి సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంపై కూడా సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. బెయిల్ విచారణ దశలోనే పూర్తి స్థాయి ట్రయల్ నిర్వహించినట్టుగా 49 పేజీల ఆదేశాలు జారీ చేయడం ఏమిటి? అని సుప్రీంకోర్టు నిలదీసింది. అక్రమ మైనింగ్ కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు గాలి జనార్దన్‌రెడ్డిని దోషిగా నిర్ధారిస్తూ ఏడేళ్ల కారాగార శిక్ష విధించింది. దాదాపు పదమూడేళ్ల విచారణ తర్వాత సీబీఐ కోర్టు ఈ తీర్పు వెలువరించగా హైకోర్టు మాత్రం ఒకే రోజు గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ చేసి బెయిల్ మంజూరు చేయడమే కాకుండా సీబీఐ కోర్టు తీర్పుపై స్టే కూడా విధించింది. ఇలాంటి సందర్భాలలో కింది స్థాయి న్యాయ వ్యవస్థలో నైతికత చచ్చిపోదా? అన్న అనుమానం కలుగుతుంది. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, నోట్ల కట్టలు తగులబడిన ఉదంతంలో అభిశంసనకు గురికాబోతున్న ఢిల్లీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నోట్ల కట్టలు దొరికినంత మాత్రాన ఒక వ్యక్తిని నిందితుడిగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నిస్తున్నారు. అవినీతి కేసులలో రెడ్ హ్యాండెడ్‌గా దొరకడం అంటే నోట్ల కట్టలు అందుకోవడమే కదా? సీబీఐ, ఏసీబీ అధికారులు అలాంటి సందర్భాలలోనే కదా నిందితులను అరెస్టు చేస్తారు. ఇప్పుడు వర్మ సంధిస్తున్న ప్రశ్న ప్రకారం వారు నిందితులు కారన్న మాట! ఆయన అంతటితో ఆగకుండా తనపై చర్య తీసుకునే అధికారం కానీ, విచారణ జరిపే అధికారం కానీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేదంటూ సుప్రీంకోర్టులోనే పిటిషన్ వేశారు. న్యాయ వ్యవస్థపై కుట్రలు జరగకుండా నిరోధించడానికి, వ్యవస్థ ఔన్నత్యం కాపాడటానికి రాజ్యాంగంలో హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ప్రత్యేక రక్షణలు కల్పించారు. ఇప్పుడు చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఈ రక్షణలను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని సామాన్య ప్రజలకు అనుమానం రాకుండా ఎలా ఉంటుంది? జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు తగులబడటాన్ని యావద్దేశం గమనించింది. అయినా ఆయనను అభిశంసించాలని పార్లమెంటును కోరే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉండదా? సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన వారినే కదా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రం సిఫారసు చేస్తుంది. ఏదైనా పదవిలో నియమితుడైన వ్యక్తి తప్పు చేస్తే చర్య తీసుకునే అధికారం నియామకపు అథారిటీకే మిగతా వ్యవస్థలలో ఉంటుంది. ఒక్క న్యాయ వ్యవస్థలోనే ఈ వెసులుబాటు లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలను మార్చే అధికారం ఓటర్లకు ఉంటుంది. అంటే, తాము ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ఐదేళ్ల తర్వాత ప్రజలు తిరస్కరించవచ్చు. అవినీతి, అనైతిక చర్యలకు పాల్పడిన న్యాయమూర్తులను తొలగించాలంటే ప్రస్తుతానికి పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడం ఒక్కటే మార్గం. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రక్షణ ఏర్పాట్లు చేశారు. అయితే ప్రస్తుతం మన దేశంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం సడలుతోంది. తప్పు చేసిన కింది స్థాయి న్యాయాధికారులపై చర్య తీసుకునే అధికారం హైకోర్టులకు ఉంది. అదే హైకోర్టు తప్పు చేస్తే మాత్రం చర్య తీసుకోకూడదట! ఈ రక్షణ వల్లనే కదా న్యాయ వ్యవస్థలో పెడధోరణులు చోటు చేసుకుంటున్నాయి. ఉపరాష్ట్రపతి పదవికి ఇటీవలే రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ ఈ విషయంలో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేయడం చూశాం. ఫలానా కేసులో హైకోర్టు ఆదేశాలు, తీర్పులు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని సుప్రీంకోర్టు ఎన్నో సందర్భాలలో వ్యాఖ్యానించింది. అయితే సదరు ఆదేశాలు, తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులు మాత్రం నిక్షేపంగా ఉంటారు. న్యాయ సూత్రాలకు విరుద్ధంగా రాజ్యాంగ నిర్దేశితాలకు భిన్నంగా తీర్పులు ఇచ్చిన సందర్భాలలో సర్వోన్నత న్యాయస్థానం అయినా దాన్ని సరిదిద్దే పరిస్థితి ఉండాలి కదా? నాపై విచారణ జరపడానికి నువ్వెవరివి? అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తినే అభిశంసన తీర్మానం ఎదుర్కోబోతున్న జస్టిస్ యశ్వంత్ వర్మ ఎలా అనగలుగుతున్నారు? ఇలాంటి వారిని కట్టడి చేయడానికైనా వ్యవస్థలో కొన్ని మార్పులు అవసరం అని ప్రజలు భావించడం తప్పు కాదు కదా? తప్పు చేస్తే చర్యలు ఉంటాయన్న భయం ఉంటేనే కదా ఏ వ్యవస్థ అయినా బాధ్యతగా ఉంటుంది? నేను ఏం చేసినా నన్ను విమర్శించకూడదు, నాపై ఎవరూ చర్యలు తీసుకోలేరు అనే అపరిమిత ధీమా ఏ వ్యవస్థకూ మంచిది కాదు. సుప్రీంకోర్టు తప్పు పడితే పరిస్థితి ఏమిటి? అన్న కనీసపు వెరపు హైకోర్టులకు ఉండాలా? వద్దా? నటుడు దర్శన్ విషయంలో గానీ, ఐపీఎస్ సంజయ్ విషయంలో గానీ హైకోర్టులు అనుచితంగా బెయిల్ మంజూరు చేశాయని సుప్రీంకోర్టు భావించినప్పుడు సదరు ఆదేశాలు ఇచ్చినవారు నిక్షేపంగా ఉండవచ్చా?.. తెలియదు! అదేమంటే న్యాయమూర్తులను ఏమీ అనకూడదు అని చట్టంలో ఉందంటారు. న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడాల్సిందే! అయితే న్యాయ వ్యవస్థకు మచ్చ తెస్తున్నదీ, ప్రతిష్ఠ దిగజారుస్తున్నదీ ఎవరు? ప్రజలు కాదు కదా? న్యాయ వ్యవస్థలో ఉన్నవారే కదా అందుకు బాధ్యులు? ఇవాళ ఈ దేశంలో మిగతా వ్యవస్థలన్నీ విశ్వసనీయతను కోల్పోయాయి. ఒక్క న్యాయ వ్యవస్థ మాత్రమే అంతో ఇంతో విశ్వసనీయతను నిలుపుకొంది. పలు కీలక సందర్భాలలో ఆయా న్యాయస్థానాలు వెలువరించిన కీలక తీర్పుల వల్ల న్యాయ వ్యవస్థ ఔన్నత్యం ఇనుమడించడమే కాకుండా, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిన విషయం కూడా వాస్తవం. నిజానికి న్యాయ వ్యవస్థ సక్రమంగా, నిజాయితీగా వ్యవహరిస్తే అన్ని వ్యవస్థలూ గాడిలోనే ఉంటాయి. న్యాయ వ్యవస్థపై ఇటు పాలకుల్లో అటు ప్రజల్లో భయం పోకూడదు. లేని పక్షంలో అరాచకం ప్రబలుతుంది. అంటే న్యాయ వ్యవస్థపై ఎంతటి గురుతర బాధ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. మిమ్మల్ని జీతాలకు పని చేసే మిగతావారిలా సమాజం చూడటం లేదు. 'మిలార్డ్' అంటే నా ప్రభువా అని కోర్టులలో న్యాయమూర్తులను సంబోధిస్తారు. ఈ దేశ పౌరులకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం పోతే మీరు ఎవరికి ప్రభువులు? అని ప్రశ్నించడానికి ఎంతో సమయం పట్టదు. ఆ మధ్య నాగపూర్‌లో ఒక న్యాయాధికారి తప్పుడు ఆదేశాలు జారీ చేయడంతో ప్రజలు ఆయన వెంట పడ్డారు. హెల్మెట్ పెట్టుకొని పారిపోయారు. న్యాయ వ్యవస్థ గౌరవం పెంచేది.. తుంచేది న్యాయమూర్తులే. న్యాయమూర్తుల తీర్పులే. న్యాయమూర్తులు సక్రమంగా ఉంటే వారి ఔన్నత్యాన్ని రాజకీయ నాయకులు కూడా దిగజార్చలేరు. కాబట్టి మీ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడుకోవడం మీ చేతుల్లోనే ఉంది మిలార్డ్స్!

> **న్యాయ వ్యవస్థ సక్రమంగా, నిజాయితీగా వ్యవహరిస్తే అన్ని వ్యవస్థలూ గాడిలోనే ఉంటాయి. న్యాయ వ్యవస్థపై ఇటు పాలకుల్లో అటు ప్రజల్లో భయం పోకూడదు. లేని పక్షంలో అరాచకం ప్రబలుతుంది.**



> **సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన వారినే హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రం సిఫారసు చేస్తుంది. ఏదైనా పదవిలో నియమితుడైన వ్యక్తి తప్పు చేస్తే చర్య తీసుకునే అధికారం నియామకపు అథారిటీకే మిగతా వ్యవస్థలలో ఉంటుంది. ఒక్క న్యాయ వ్యవస్థలోనే ఈ వెసులుబాటు లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలను మార్చే అధికారం ఓటర్లకు ఉంటుంది. అంటే, తాము ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ఐదేళ్ల తర్వాత ప్రజలు తిరస్కరించవచ్చు. అవినీతి, అనైతిక చర్యలకు పాల్పడిన న్యాయమూర్తులను తొలగించాలంటే ప్రస్తుతానికి పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడం ఒక్కటే మార్గం. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రక్షణ ఏర్పాట్లు చేశారు. న్యాయ సూత్రాలకు విరుద్ధంగా రాజ్యాంగ నిర్దేశితాలకు భిన్నంగా తీర్పులు ఇచ్చిన సందర్భాలలో సర్వోన్నత న్యాయస్థానం అయినా దాన్ని సరిదిద్దే పరిస్థితి ఉండాలి కదా? నాపై విచారణ జరపడానికి నువ్వెవరివి? అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తినే అభిశంసన తీర్మానం ఎదుర్కోబోతున్న జస్టిస్ యశ్వంత్ వర్మ ఎలా అనగలుగుతున్నారు? ఇలాంటి వారిని కట్టడి చేయడానికైనా వ్యవస్థలో కొన్ని మార్పులు అవసరం అని ప్రజలు భావించడం తప్పు కాదు కదా?**

తరిమెల నాగిరెడ్డిని గవర్నర్ ఆహ్వానించి ఉంటే...

జననేత తరిమెల నాగిరెడ్డి చనిపోయి అర్ధ శతాబ్ది కావస్తున్నా ఇంకా ఆయన జీవితం నుండి పొందాల్సిన స్ఫూర్తి అనంతమే! 'తాకట్టులో భారత దేశం' అనే విశ్లేషణతో ఆయన కోర్టులో ఇచ్చిన స్టేట్‌మెంటు పుస్తక రూపంలో వచ్చి అనేక భారతీయ భాషల్లోకి అనువాదమైన ఇన్నేళ్ళ తర్వాత దాని ప్రాసంగికత ఇంకా పెరిగి ఇప్పుడు 'తాకట్టు కాదు, అమ్మకానికి భారతదేశం' అనే స్థాయికి చేరిందని చాలామంది మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాభై ఏళ్ల కాలంలో అనేకమంది మిత్రులు అనేక సందర్భాలలో ఆయన్ని గుర్తు చేశారు. నేనూ అనేకసార్లు వివిధ వేదికలపై ఆ పని చేయటంతో పాటు 'ప్రజాసేవలో తరిమెల నాగిరెడ్డి' పేరుతో 570 పేజీల పుస్తకాన్ని ఆయన శతజయంతి సందర్భంగా 2017లో ప్రచురించాను. యాభై రూపాయల రేటుతో ఇప్పటికి పది వేల కాపీలు జనంలోకి వెళ్లాయి. ఇప్పుడు ఎక్కువమందికి తెలియని కొత్త విషయాలు చెప్పటానికి ప్రయత్నిస్తాను.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్న ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచాలన్న ఆందోళన జరుగుతున్న రోజులవి. మద్రాసులో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో నాగిరెడ్డి (మద్రాసు రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు) కమ్యూనిస్టు పార్టీ పక్షాన పాల్గొని 3 గంటల సేపు ప్రసంగించారు. ఆ సభలో ప్రేక్షకునిగా ఉన్న సుప్రసిద్ధ చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖర శర్మ ఆయన ప్రసంగానికి ముగ్ధుడై సభానంతరం ఆయన నివాసానికి వెళ్లి "నాగిరెడ్డి గారూ నాకు కమ్యూనిస్టులంటే చాలా చులకన భావం ఉండేది. కాని మీలాంటి గొప్ప వక్త, విశ్లేషకుడూ ఆ పార్టీలో ఉన్నారని తెల్సుకుని నా అభిప్రాయం మార్చుకున్నాను" అని అభినందించారు. తర్వాత కొద్దికాలానికే పొట్టి శ్రీరాములు బలిదానంతో ఉద్యమం ఉధృతం కావటంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా, కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర శాసనసభలో కూడా నాగిరెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నారు.

1953 నవంబర్‌లో ఏర్పడిన ప్రకాశం మంత్రివర్గం సంవత్సర కాలంలోనే పడిపోయింది. మెజారిటీపక్ష (41 సీట్లు) నాయకుడుగా ఉన్న నాగిరెడ్డిని మంత్రివర్గం ఏర్పాటు చేయాలని ఆహ్వానించటం రాజ్యాంగ సంప్రదాయం. కమ్యూనిస్టు పార్టీ అదే కోరింది. చందూలాల్ మాధవలాల్ త్రివేది అప్పటి గవర్నర్. "I can invite you for dinner Nagi Reddy, but not to form government" (నిన్ను భోజనానికి పిలవగలను నాగిరెడ్డీ, కాని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేను) అనే పరిస్థితి, ఆ ఒత్తిడి ఆయనపై లేకపోయి ఉంటే దేశ రాజకీయాలు, కమ్యూనిస్టుల పరిస్థితి మరోరకంగా ఉండేవి. మెజారిటీ పక్షానికి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వకుండా నెహ్రూ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలి అప్రజాస్వామిక చర్యకి పూనుకుంది. గవర్నర్‌ని కల్సిన సందర్భంలో, "How to control comunists?" అనే పుస్తకం చదివారా? అని త్రివేది అడిగితే దానిపై సమాధానంగా వచ్చిన పుస్తకం కూడా చదివానని నాగిరెడ్డి చెప్పారు.

> **1953 నవంబర్‌లో ఏర్పడిన ప్రకాశం మంత్రివర్గం సంవత్సర కాలంలోనే పడిపోయింది. మెజారిటీపక్ష (41 సీట్లు) నాయకుడుగా ఉన్న నాగిరెడ్డిని మంత్రివర్గం ఏర్పాటు చేయాలని ఆహ్వానించటం రాజ్యాంగ సంప్రదాయం. కమ్యూనిస్టు పార్టీ అదే కోరింది. 'నాగిరెడ్డీ నిన్ను భోజనానికి పిలవగలను గానీ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేను' అనే పరిస్థితి, ఒత్తిడి గవర్నర్ చందూలాల్ మాధవలాల్ త్రివేదిపై లేకపోయి ఉంటే దేశ రాజకీయాలు, కమ్యూనిస్టుల పరిస్థితి మరో రకంగా ఉండేవి.**




1975 జూలై 6న ఎడ్లపాడులో జరిగిన నా పెళ్లికి నాగిరెడ్డి అధ్యక్షత వహించాలి. వస్తున్నట్లు నాకు టెలిగ్రాం ఇచ్చి ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. టెలిగ్రాం సెన్సార్ అయి నా పెళ్లి వేదికను సుమారు పాతికమంది పోలీసులు చుట్టుముట్టారు. మీసాలు వచ్చినప్పటి నుండి ఎప్పుడూ మీసాలు పెంచని ఆయన బుర్ర మీసాలు పెంచారు. సుప్రసిద్ధ నవలా రచయిత్రి మాదిరెడ్డి సులోచన ఇంట్లో పార్టీ అద్దెకు తీసుకున్న పోర్షన్‌ని పార్టీ డెన్‌గా ఉపయోగిస్తూ ఆ ఇంట్లో నుండే వస్తూపోతూ కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ ఉండగానే నాగిరెడ్డిలో అనారోగ్య లక్షణాలు కన్పడటంతో పార్టీ కార్యకర్తలుగా ఉన్న డా. బిక్కసాని పూర్ణ, ఆయన భార్య డా. మేదరమెట్ల అరుణ (తెలంగాణ పోరాట యోధుడు మేదరమెట్ల సీతారామయ్య కూతురు. ప్రస్తుతం ఇద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు) దగ్గరకు తీసుకెళ్లారు. వారి ట్రీట్‌మెంట్‌కి లొంగకపోవటంతో మాదిరెడ్డి వెంకట్రామయ్య అనే పేరుతో ఉస్మానియా ఆసుపత్రిలో చేర్చారు. అదే వార్డులో చికిత్స పొందుతున్న ప్రముఖ సాహితీవేత్త శ్రీనివాస చక్రవర్తి, జయంతి పబ్లికేషన్స్ పెరుమాళ్లు ఆయన్ని గుర్తించలేదు. 1976 నాటికి ఉస్మానియాలో వెంటిలేటర్ సదుపాయం కూడా లేదు. తుదకి జూలై 28 ఉదయాన నాగిరెడ్డి చనిపోయారు.

అప్పుడు అందుబాటులో పార్టీ నాయకులు ఎవరూ లేరు. సాయినాథ్, లాయర్ వెంకటరెడ్డి ఇద్దరూ ఏం చేయాలో తోచక ప్రముఖ లాయర్ సి. పద్మనాభరెడ్డి దగ్గరకు వెళ్ళి పక్క ఇంటిలో ఉన్న మరో ప్రముఖ న్యాయవాది బాల్‌రెడ్డిని తీసుకొని యస్.ఆర్. నగర్‌లో ఉన్న నాగిరెడ్డి చెల్లెలు రమాదేవికి నాగిరెడ్డి పార్థివదేహాన్ని అప్పగించారు. ఈలోగా ప్రతిపక్ష నాయకులు వేములపల్లి శ్రీకృష్ణ ద్వారా ఈ విషయం ముఖ్యమంత్రి వెంగళరావుకి తెలియటంతో పోలీసులు అనంతపురం జిల్లా కల్లూరు గ్రామం వద్ద నాగిరెడ్డి పార్థివదేహం ఉన్న కారును అటకాయించి శవాన్ని స్వాధీనం చేసుకొని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తీసుకెళ్లారు. విషయం తెల్సుకున్న వేలాది ప్రజలు అక్కడకు చేరారు. నాగిరెడ్డిని చూడటానికి పోలీసులు ఎవరినీ అనుమతించలేదు. దానితో అక్కడేవున్న నాగిరెడ్డి బావ, మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి "ఇంకా వాడంటే మీకు భయమెందుకు? జనాన్ని చూడనివ్వండి" అని కేకలేయటంతో ప్రజల్ని అనుమతించారు. పోస్టుమార్టం అనంతరం కల్లూరు నుంచి వేలాది జనం వెంటరాగా తరిమెల వరకు అంతిమ యాత్ర సాగింది. నాగిరెడ్డి అర్ధ శతాబ్ది వర్ధంతి సభలు ఈ సంవత్సరంపాటు జరిపి ఆ గొప్ప కమ్యూనిస్టు స్ఫూర్తిని నిలపాలని ఆయన సహచరులు, అనుచరులకు మనవి చేస్తున్నాను.

▪ చెరుకూరి సత్యనారాయణ
తరిమెల నాగిరెడ్డి స్మారక కమిటీ ప్రధాన కార్యదర్శి

(జూలై 28: తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి)



ఎంఈవోలు ఏరి?



350 పాఠశాలలకు ఒకే ఎంఈవో

గుంటూరు ఎంఈవో తూర్పు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలను పర్యవేక్షించాల్సి వస్తోంది. రెండు నియోజక వర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 350కి పైగా ఉన్నాయి. దుగ్గిరాల, మంగళగిరి, పెదకాకాని చేబ్రోలు, పొన్నూరు మండలాల్లో అయితే ప్రధానోపాధ్యాయులపై పర్యవేక్షణ బాధ్యతలు ఉన్నాయి. దీంతో వారు పనిచేస్తున్న పాఠశాలల్లో విధులు నిర్వహణ కష్టతరంగా మారిందని ఆయా ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.



- జిల్లాలో భారీగా పోస్టులు ఖాళీ
- అటకెక్కుతున్న పాఠశాలల పర్యవేక్షణ
- 57 మండలాలకు 31 మండలాల్లో ఇన్‌చార్జిలే దిక్కు
- కొన్ని మండలాల్లో ప్రధానోపాధ్యాయులపై అదనపు భారం
- ప్రకాశం జిల్లా హెచ్ఎంకూ పల్నాడులో పాఠశాలల బాధ్యత
- ఉద్యోగోన్నతులతో భర్తీకి అవకాశం ఉన్నా పట్టించుకోని అధికారులు

గుంటూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, బోధనా తీరు, విద్యార్థుల అడ్మిషన్లు, వారి హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, మౌలిక వసతులను మండల స్థాయిలో మండల విద్యాశాఖాధికారులు(ఎంఈవోలు) నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో వసతులు, అనుమతుల బాధ్యత ఎంఈవోలదే. అయితే జిల్లాలో పలు మండలాల్లో పెద్దసంఖ్యలో పాఠశాలలు ఉన్నా.. వాటిని పర్యవేక్షించాల్సిన ఎంఈవోలు లేరు. ఎంఈవోల కొరత కారణంగా పాఠశాలల పర్యవేక్షణ అటకెక్కుతోంది. మండలానికి ఎంఈవో-1, ఎంఈవో-2 ఉండాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇద్దరిలో ఒకరు అకడమిక్ పర్యవేక్షణ చేపడితే, మరొకరు అడ్మినిస్ట్రేషన్ చూసుకోవాలి. అయితే అందుకు అనుగుణంగా నియామకాలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వంలోనూ అదే కొనసాగుతుండటంతో పర్యవేక్షణ కష్టంగా మారింది. జిల్లా వ్యాప్తంగా భారీగా ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీపై విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 57 మండలాలు ఉండగా దాదాపు 31 మండలాల్లో పూర్తిస్థాయి ఎంఈవోలు లేరు. దీంతో ఆయా మండలాల్లో పాఠశాలల పరి రక్షణ సక్రమంగా జరగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన (మిగతా 6వ పేజీలో)



నిండుకుండలా సాగర్

- జలాశయానికి భారీగా వరద
- 582 అడుగులకు చేరిన నీటి మట్టం
- రెండు రోజుల్లో తెరుచుకోనున్న క్రస్ట్ గేట్లు
- పులిచింతలలో గంటగంటకూ పెరుగుతోన్న నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)



కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలతో కృష్ణమ్మ పోటెత్తి ప్రవహిస్తోంది. శ్రీశైలం నుంచి వరద కొనసాగుతుండటంతో నాగార్జున సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. 1.20 లక్షల కూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. దీంతో డ్యాం నీటి మట్టం శనివారం 582 అడు గులకు చేరింది. సాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 26,040 క్యూసెక్కులు విడు దల చేస్తున్నారు. దీంతో పులిచింతల జలాశ యం దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. పులిచింతలలోనూ నీటి మట్టం గంటగంట కు పెరుగుతోంది. సాగర్ నీటి మట్టం 585 అడుగులకు చేరిన వెంటనే డ్యాం క్రస్ట్ గేట్లు తెరిచేందుకు జలవనరుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాగర్‌లో 312.05 టీఎంసీలకు ప్రస్తుతం 285 టీఎంసీల నీటి మట్టం ఉంది. కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడు దల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తంగా 32,638 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పుష్కలంగా సాగునీరు..

పల్నాడు జిల్లాలో 5.71 లక్షల ఎకరాలు, గుం టూరు 95 వేలఎకరాలు, బాపట్ల 1.88 లక్షల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా సరఫరా కానున్నది. సాగర్‌కు కృష్ణమ్మ పోటెత్తుతుండటంతో సాగునీటి చింత తీరింది. సాగర్ జలాశయంతో పాటు పులిచింతల, ప్రకాశం బ్యారేజీల్లో నీటి మట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో ఈ ఏడాది సాగుకు కొరత లేకుండా పుష్కలంగా నీరు సరఫరా కానున్నది. దీంతో ఆయకట్టు లో రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. వరిసాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో గతంలోనే రైతులు వరినారుమళ్లను విస్తృ తంగా సాగు చేశారు. ప్రస్తుతం కుడి కాల్వ నుంచి నీరు విడుదల చేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో వరి నాట్లు ప్రారంభం కానున్నాయి.

వేగవంతమైన విచారణతోనే నిందితులకు శిక్షలు

- 170 మంది చురుకైన రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి
- అర్ధ సంవత్సర నేర సమీక్షలో ఎస్పీ సతీష్‌కుమార్



సీఐ వీరయ్యచౌదరికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, ప్రాసిక్యూషన్స్ డీడీ బర్కత్ అలీ

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వేగవంతమైన విచారణలతోనే నిందితులకు శిక్షలు పడతాయని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అర్ధ సంవత్సర నేర సమీక్ష శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. చార్జిషీట్లను గడువులోపే కోర్టులో దాఖలు చేయాలన్నారు. ఎంపిక చేసిన 170 మంది చురుకైన రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచుతూ, వారిలో పీడీ యాక్ట్‌కి ఎవరు అర్హత కలిగి ఉన్నారో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. తరచుగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించే వారిని ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేయాలన్నారు. ఏదైనా కేసుల్లో నిందితులు బెయిల్‌పై ఉంటూ ఫిర్యాదుదారులను, సాక్షులను బెదిరిస్తుంటే వారి బెయిల్ రద్దు అయ్యే విధంగా చూడాలన్నారు. సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమేరాలు అమర్చుకోవడానికి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి శివారు ప్రాంతాలు, పాడుబడిన భవనాలు, ముళ్ళ పొదల ప్రాంతాల్లో నిఘా పెడుతూ అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలన్నారు. విజువల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని భరోసా కల్పించాలన్నారు. ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బర్కత్ అలీ మాట్లాడుతూ న్యాయస్థానాల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా పోలీస్, న్యాయ శాఖలు కలసికట్టుగా పనిచేయాలన్నారు. నిందితులకు శిక్షలు పడటంలోవాదించిన ప్రాసిక్యూసన్ డిప్యూటీ డైరెక్టర్ ఎండి బర్కత్ అలీ, తెనాలి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమేష్, కేసుల విచారణ పురోగతిని పర్యవే క్షిస్తున్న డీసీఆర్‌బీ సీఐ నరసింహారావును, పలు కేసుల్లో సమగ్ర దర్యాప్తు జరిపిన అప్పటి డీఎస్పీలు రవికుమార్(మహిళ), వై.జెస్సీ ప్రశాంతి (సౌత్), సీలు సుధాకర్‌రావు, నారాయణస్వామి, వీరయ్యచౌదరి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, జి.సంధ్యారాణిలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవికుమార్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ప్రవేశాలకు నోటిఫికేషన్

- గుంటూరు నల్లపాడు ఎంబీటీఎస్‌లో హెల్ప్‌లైన్
- తొలి విడత 18 వేలలోపే సీట్లు భర్తీ.. మూడో విడత లేనట్లే

శాసన సభ, మండలి కమిటీల్లో.. 'గుంటూరు' ప్రజాప్రతినిధులు

- అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే నసీర్

'విశాఖ ఎక్స్‌ప్రెస్'లో పెరిగిన స్లీపర్ క్లాసులు

షిర్డీ, తిరుపతికి ప్రత్యేక రైళ్లు

ఏషియన్ స్కేటింగ్‌లో జెస్సీరాజ్‌కు రజతం



8

మిషన్ గ్రీన్ గుంటూరు

లోగో డిజైన్లకు ఆహ్వానం



గుంటూరు కార్పొరేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గుంటూరు.. క్లీన్ గుంటూరు లక్ష్యంలో భాగంగా మిషన్ గ్రీన్ గుంటూరు నినాదంతో లోగోకు నగరవాసులు, విద్యార్థులు, సంస్థల నుంచి డిజైన్లను ఆహ్వానిస్తున్నారు. వచ్చిన లోగోల్లో అత్యుత్తమగా ఉన్న దానిని ఎంపిక చేసి, దానిని రూపొందించిన వారికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో వార్డుల వారీగా కార్యాచరణ సిద్ధం చేసుకుని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యావరణ హిత గుంటూరే లక్ష్యంగా పచ్చదనం పెంపు, పారిశుధ్యంలో మెరుగుదల, వ్యర్థాలను తడిపొడిగా విభజన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం తదితరాలను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు, జంక్షన్లు, ఐలాండ్స్, పార్కులు, డివైడర్లపై పచ్చదనం పెంపు వంటి చర్యలు పగడ్బందీగా తీసుకుంటామన్నారు. వచ్చే నెల 1 నుంచి ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మిషన్ గ్రీన్ గుంటూరుని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. ఈ క్రమంలో ఈ కార్యక్రమానికి సంబంధించి ఆకర్షణీయమైన డిజైన్‌తో కూడిన లోగో రూపకల్పనకు నగరవాసులకు అవకాశం ఇచ్చామన్నారు. ఆసక్తి కల్గిన వారు తాము రూపొందించిన లోగో డిజైన్‌ను సెల్ఫ్ డిక్లరేషన్, పేరు, ఫోన్ నంబర్ వివరాలతో ఆగస్టు 15వ తేదీలోపు జీఎంసీ వాట్సాప్ 9849908391కు లేదా గుంటూరు ఎట్ ది రేట్ ఆఫ్ సిడిఎంఎ.వివోవి.ఇన్ అనే మెయిల్‌కి పంపవచ్చన్నారు. అందిన డిజైన్లను జీఎంసీ ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలించి, ఉత్తమ డిజైన్‌ను ఎంపిక చేస్తుందన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు..యువకుడి మృతి



పవన్ కల్యాణ్ మృతదేహం, కారును పరిశీలిస్తున్న ఎస్ఐ రవితేజ

అమృతలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలుకు చెందిన జూపల్లి పవన్ కళ్యాణ్ (19) విజయవాడలోని ఒక కాలేజ్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ మొదటి సంవత్సరం చదువు తున్నాడు. ఈ క్రమంలో తన ఆరుగురు స్నేహితులు ఇ.డేవిడ్, వి.శ్రవణ్‌సాయి, కె.వసంత కుమార్, వై.కళ్యాణ్, ఎన్.హేమంత్ కుమార్, ఎ రోహిత్‌లతో కలిసి ఒంగోలులో తన సర్టిఫికెట్స్ తెచ్చుకునేందుకు సెల్ఫ్ డ్రైవింగ్ కారు తీసుకుని వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో బాపట్ల సూర్యలంక బీచ్‌లో కొంత సమయం గడిపి విజయవాడ బయలు దేరారు. మార్గ మధ్యంలో అతివేగంగా వస్తున్న కారు అదుపు తప్పి మండల పరిధిలోని యలవర్రు - ప్యాపర్రు గ్రామాల మధ్య నిజాంపట్నం కాల్వలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న పవన్ కల్యాణ్ కాలు సీటు కింద భాగంలో ఇరుక్కు పోవడంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందినట్టు అతనితో ఉన్న స్నేహితులు తెలిపారు. మిగిలిన ఆరుగురు స్థానిక సాయంతో బయటపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రవితేజ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో కాల్వలో నీరు పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

అప్పుల బాధతో పురుగు మందు తాగి..

కౌలు రైతు ఆత్మహత్య



మరక సత్యన్నారాయణ (ఫైల్ ఫోటో)

ప్రత్తిపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగు మందు తాగి కౌలు రైతు మృతి చెందిన ఘటన గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మరక సత్యన్నారాయణ (42) కౌలుకు పొలం తీసుకుని వ్యవసాయం చేస్తుంటాడు. తనకున్న నాలుగు ఎకరాల పొలంతో పాటు మరో 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశారు. గతేడాది ఈ భూమిలో పత్తి, మిర్చితో పాటు పొగాకు పండించారు. గత ఐదేళ్లుగా పంటలు సరిగా పండక పోవడం, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో తెచ్చిన అప్పులు తీర్చలేక పోయారు. దీంతో మొత్తంగా రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అప్పులు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు రికార్డు చేశారు. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోవడంతో పాటు ఈ ఏడాది కౌలుకు తీసుకున్న భూమికి కౌలు చెల్లించడానికి, పెట్టుబడికి కూడా డబ్బులు దొరక్క చాలా కాలంగా మానసికంగా ఇబ్బందులు పడ్డాడు. అలాగే అప్పులు ఇచ్చిన వారి నుండి కూడా ఒత్తిడి పెరగుతుండటంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో శుక్రవారం రాత్రి ఇటుకల బట్టీల వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వెంటనే వారు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే సత్యన్నారాయణ మరణించినట్టు వైద్యులు తెలిపారు. భర్త మృతిపై భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే మరక సత్యన్నారాయణ మరణ విషయం తెలిసిన అప్పుల వారు ఇంటి వద్దకు వచ్చారు. తమ అప్పు సంగతి చెప్పాలంటూ కుటుంబ సభ్యులను నిలదీశారు. ఇంటి ముందు మృతదేహం ఉన్న సమయంలోనే అప్పులు ఇచ్చిన వాళ్లు మూకుమ్మడిగా దాడి చేయడంతో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు ఏమి చేయాలో తెలియని దయనీయ పరిస్థితి ఏర్పడింది.

అమరావతి శిల్ప సంపదను రాష్ట్రానికి తెప్పించండి

● కేంద్రానికి రాష్ట్ర పర్యాటక శాఖ విజ్ఞప్తి



లండన్ మ్యూజియంలో అమరావతి శిల్ప సంపదను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

గుంటూరు సిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కింగ్‌డమ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉన్న అమరావతి శిల్ప సంపదను ఆంధ్రప్రదేశ్‌కు తెప్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్రానికి రాసిన లేఖను అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శనివారం మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు బౌద్ధ మతం విరాజిల్లిన ప్రాంతం అమరావతి అని పేర్కొన్నారు. అమరావతికి చెందిన రూ.వేల కోట్ల విలువ చేసే చారిత్రాత్మక బౌద్ధ శిల్ప సంపద లండన్ మ్యూజియం, చెన్నై, ఢిల్లీ, కలకత్తా, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉందన్నారు. ఆ సంపదను నూతన రాజధాని అమరావతికి రప్పించేందుకు తాను గడిచిన పదేళ్ల నుంచి పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. ఎట్టకేలకు స్పందించిన రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి కేంద్రానికి లేఖ రాయడం హర్షించదగిన పరిణామం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించి.. చర్యలు తీసుకోవాలని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు.

ఆ పది గ్రామాలు రాజధానిలో విలీనం

అమరావతి, జులై 26(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలోని గ్రామసభలు నిర్వహించిన పది గ్రామాలు రాజధాని అమరావతిలో విలీనం అయినట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. శనివారం సాయంత్రం లేమల్లెలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి నారాయణతో మాట్లాడటం జరిగిందని.. ల్యాండ్ పూలింగ్ తప్పనిసరిగా జరుగుతుందని ఆయన చెప్పారని వెల్లడించారు. నాలుగు గ్రామాలు యూనిట్‌గా రైతులకు ప్లాట్‌లు కేటాయించడం జరుగుతుందన్నారు. పూలింగ్ జరిగే గ్రామాల్లో మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. పది గ్రామాల పరిధిలోని 2500 ఎకరాల్లో స్పోర్ట్ సిటీ నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు.

ఓఆర్ఆర్‌కు 574 ఎకరాల భూ సేకరణ

ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి నిర్మాణానికి సంబంధించి అమరావతి మండల పరిధిలో లింగాపురం, ధరణికోట గ్రామాల పరిధిలో 574 ఎకరాలు భూ సేకరణ చేయనున్నారు. ధరణికోటలో 49సర్వే నంబర్లలో 476 ఎకరాలు, లింగాపురంలో ఎల్‌పీఎంఎస్‌లో 98ఎకరాలు సేకరించనున్నారు. ఇందులో పట్టా భూమి 419 ఎకరాలు, ప్రభుత్వ భూమి 0.93 సెంట్లు, ఇతరులకు కేటాయించిన భూమి 144 ఎకరాలు, ఈనా భూమి 9.45 ఎకరాలు ఉంది.

దొంగలు దొరికారు..

కర్లపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దమ్మనవారిపాలెంలో జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు దొంగలను పోలీసులు అదుపులోకి తీసకున్నారు. వారి నుంచి రూ.10లక్షల విలువైన బంగారు, ఇతర ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ జి.రామాంజనేయులు శనివారం వివరాలను విలేకరుల సమావేశం నిర్వహించి, వెల్లడించారు. దమ్మనవారిపాలేనికి చెందిన ఆర్ఎంపీ పిట్ల పెద వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాండిచ్చేరిలోని కుమార్తె ఇంటికి ఈ నెల 17న వెళ్లారు. 21న అతని ఇంటిలో చోరీ జరిగింది. సోదరుడి ద్వారా విషయం తలుసుకున్న వెంకటరెడ్డి కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రవీంద్ర సాంకేతిక ఆధారాలతో.. పాత నేరస్తులు తెనాలిలోని నందివెలుగుకు చెందిన పులి సురేష్, రాజమండ్రికి చెందిన జనదివ్య శేఖర్, మరుప్రోలువారిపాలేనికి చెందిన మరుప్రోలు నాగేంద్రరెడ్డి, రాజమండ్రికి చెందిన లంకా హర్షవర్ధన్‌ని దొంగతనం చేసినట్లు గుర్తించారు. వీరిలో పులి సురేష్ పరారీలో ఉండగా.. మిగిలిన ముగ్గురినీ బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రూ.6 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఎంఈవోలు.. ఏరి?

(5వ పేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని జడ్పీ, మండల పరిషత్, ప్రాథమికోన్నత, ఎయిడెడ్ పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత ఎంఈవోలదే. ఇంతటి కీలకమైన ఎంఈవోల నియామ కంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నా యి. అనేక మండలాల్లో ఇన్‌చార్జిలుగా సమీప మండలాలు ఎంఈవోలు లేదంటే ఉన్నత పాఠశాలల్లో సీనియర్‌గా ఉన్న ప్రధానోపాధ్యా యులకే ఆ బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో ఇన్‌చార్జి బాధ్యతలకు వారు న్యాయం చేయలేక పోతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అయితే ఒకరిద్దరు ఎంఈవోలు నాలుగైదు మండలాల్లో పాఠశాలలను తనిఖీ చేయాల్సి వస్తోంది. దీంతో పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి. నెలలో కనీసం పది రోజుల పాటు ఉపాధ్యాయుల జీతాల బిల్లులు చేసే బాధ్యత ఎంఈవోలదే. కొరత నేపథ్యంలో ఉపాధ్యాయుల బిల్లుల అప్‌లోడ్‌లో కూడా జాప్యం జరుగుతుందని ఉపాధ్యా యులు, సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీని యర్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పలువురు ఉద్యో గోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఉద్యోగోన్నతులతో ఎం ఈవో పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నా విద్యాశాఖా ధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

ఇద్దరి పని ఒక్కరే..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అనేక మండలాల్లో ఎంఈవోలు లేరు. అయితే కొన్ని మండలాలకు ఇద్దరు ఎంఈ వోలు ఉన్నా పరిస్థితిలో మార్పులేదు. ఒకరు కార్యాలయంలో పరిపాలనలో నిమగ్నం కాగా మరొకరు పర్యవేక్షణకు వెళ్లాల్సి వస్తుంది. అనేక మండలాల్లో ఇద్దరు ఎంఈవోలు లేరు ఒకవైపు పర్యవేక్షణ, మరోవైపు కార్యాలయంలో విధులు నిర్వహణ ఒకరే చూడాల్సి వస్తోంది. మరోవైపు డిప్యూటీ డీఈవోలు కూడా ఎంఈవోల బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. నరసరావుపేట డిప్యూటీ డీఈవో నరసరావుపేట మండలాన్ని పర్యవేక్షిస్తున్నారు. సత్తెనపల్లి డిప్యూటీ డీఈవోకు అదనపు బాధ్యతలు ఉన్నాయి. గుంటూరు డిప్యూటీ మేడికొండూరు మండల ఎంఈవో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెనాలి డిప్యూటీ డీఈవో తాడేపల్లి ఎంఈవోగా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా రాజుపాలెం, నగరం, అమృతలూరు, పెదనందిపాడు, పెద్దకూరపాడు, అమరావతి తదితర మండలాలు ఇన్‌చార్జి ఎంఈవోల పాలనలోనే కొనసాగుతున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లలచెరువు, వెల్దుర్తి మండలాలను పర్యవేక్షించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రధానోపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించి పూర్తిస్థాయి ఎంఈవోలుగా నియమించాలని విజ్ఞప్తులు వస్తున్నాయి.

ఎన్నారైలో ఏఐ టెక్నాలజీతో అరుదైన శస్త్రచికిత్స

● టీసీటీ ఇండియా కోసం ప్రత్యక్ష ప్రదర్శన



శస్త్రచికిత్స వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు సురేంద్ర, సతీశ్

మంగళగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎన్నారై ఆస్పత్రిలో కృత్రిమ మేధను వినియోగించి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం నిర్వహించినట్లు వైద్యుల బృందం తెలిపింది. ఎన్నారై వైద్యశాల కాన్ఫరెన్స్ హాలులో శనివారం శస్త్రచికిత్స వివరాలను డాక్టర్ ఆవుల సురేంద్ర, డాక్టర్ జాన్‌సతీశ్ మీడియాకు వెల్లడించారు. 73 ఏళ్ల వ్యక్తి గుండెకు సంబంధించిన రక్త నాళాల్లో క్యాల్షియం పెరిగిపోవడం (క్యాల్సిఫైడ్ కొరోనరి లెషన్స్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరినట్లు చెప్పారు. రోగికి వయస్సు ఎక్కువగా ఉండడంతో అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను వైద్య బృందం చేపట్టింది. లెసన్ ప్రిపరేషన్ కోసం ఒర్బిటల్ అథెరెక్టమీను ఉపయోగించగా, స్టెంట్ అమర్చే ప్రదేశాన్ని కచ్చితంగా నిర్ధారించేందుకు అల్ట్రాయాన్ 2.0 ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించారు. ఈ టెక్నాలజీ రాష్ట్రంలో ఒక్క ఎన్నారైలో మాత్రమే ఉందని వైద్యులు తెలిపారు. క్లిష్టమైన ఈ కార్డియాక్ ఇంటర్వెన్షన్‌ను టీసీటీ ఇండియా-2025 కోసం ప్రత్యక్షంగా ప్రదర్శించినట్లు వివరించారు. ఈ అత్యాధునిక చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా నిర్వహించామని చెప్పారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు అభినందించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ సుభాష్, డాక్టర్ రఘునందన్, డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.

అంబటి మురళిని విచారించిన పోలీసులు



అంబటి మురళిని విచారిస్తున్న అర్బన్ సీఐ వీరా నాయక్

పొన్నూరుటౌన్, జులై26(ఆంధ్రజ్యోతి): వైసీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శనివారం పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరయ్యారు. ఇటీవల అంబడి మురళీకృష్ణ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ నరేంద్ర కుమార్‌పై మార్ఫింగ్ చేసిన వీడియోలు ప్రదర్శిస్తున్నారని, అసత్యాలను ప్రసారం చేయిస్తున్నారని ఆరోపిస్తూ టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్ అంబటి మురళీకృష్ణ తదితరులపై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అహ్మద్ ఖాన్ ఫిర్యాదు మేరకు అంబటి మురళీకృష్ణ పై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసుకు సంబంధించి మురళీకృష్ణ అర్బన్ సీఐ వీరా నాయక్ ముందుకు విచారణకు హాజరయ్యారు. విచారణలో పోలీసులు అంబటి మురళీకృష్ణ వినియోగించిన సెల్ ఫోను అప్పగించాలని కోరారు. తమ న్యాయవాదులను సంప్రదించి అప్పగిస్తానని అంబటి మురళీకృష్ణ పోలీసులకు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మినీ మహానాడు సందర్భంగా చింతలపూడిలో మాట్లాడినట్లుగా.. వీడియో మార్ఫింగ్ చేసి ప్రసారం చేస్తున్నారనే.. ఆరోపణలపై తప్పనిసరిగా ఫోన్ అప్పగించాల్సిందేనని పోలీసులు స్పష్టం చేసినట్లు సమాచారం. విచారణ రెండు గంటల పాటు జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ తనపై తప్పుడు కేసు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

జంట హత్యల కేసు..

నరసరావుపేటకు బదిలీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

బెంగళూరు రియల్టర్లు వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్ రెడ్డిల హత్య కేసుకు సంబంధించిన దర్యాప్తులో జాప్యంతో పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల సరిహద్దుల్లో ఈ నెల 23న జరిగిన ఈ ఘటన దర్యాప్తులో అనేక సాంకేతిక అంశాలు వారికి ప్రతిబంధకంగా మారాయి. సంతమాగులూరు మండలం పాతమాగులూరులో మృతదేహాలు లభ్యం కావడంతో హత్య కేసు ఇక్కడ నమోదు చేశారు. కిడ్నాప్ కేసు నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైంది. హత్య కేసు ఒక చోట, కిడ్నాప్ కేసు మరో చోట ఉండడంతో నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుందని అధికారులు తేల్చారు. ఈ కేసు దర్యాప్తు మొత్తం ఓ చోట జరిగితేనే మేలనే అభిప్రాయానికి ఇరు జిల్లాల పోలీసు అధికారులు వచ్చారు. దీంతో సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసును నరసరావు పేటకు బదిలీ చేసినట్లు సమాచారం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఆధ్యాత్మికం గరికపాటి ప్రవచనం

నరసరావుపేట టౌన్. జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక పట్టాభి రామస్వామి ఆలయంలో నాగసరపు రామారావు ట్రస్ట్, ఆధ్యాత్మిక తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో వేదాంత భేరి ప్రవచన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రముఖ ప్రవ చనకర్త గరికపాటి నరసింహారావు ప్రవచనం భక్తులు ఆధ్యాత్మిక భావనలోకి తీసుకెళ్లింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా కుటుంబ సభ్యులు పాల్గొని గరికపాటి నరసింహారావుకు సాదరంగా స్వాగతం పలికారు. వేదాంత సూత్రాలు, జీవన విలువలు, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని గరికపాటి బోధించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

బంగారు కుటుంబాల అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత

● మేయర్ కోవెలమూడి రవీంద్ర



ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని బంగారు కుటుంబాలను మార్గదర్శకుల ద్వారా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) పై శనివారం కాంట్రాక్టర్లతో నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ నసీర్‌తో కలిసి మేయర్ పాల్గొన్నారు. సమావేశంలో మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4 విధానాన్ని ప్రవేశ పెట్టారని, ఈ విధానంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న వారు (మార్గదర్శులు) పేదరికంలో ఉన్న (బంగారులు కుటుంబాలు) వారిని దత్తత తీసుకొని వారిని అన్ని విధాల అభివృద్ధి చేయటమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాలను దత్తతు తీసుకొనే మార్గదర్శులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. తూర్పు నియోజకవర్గ పరి ధిలో ఎక్కువగా పేదలు నివశిస్తుంటారని, వారిని నగర పాలక సంస్థ కాంట్రాక్టర్లు దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేయాలన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నగరంలో పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమం ఒక వారధిగా మారుతుందని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కాంట్రాక్టర్లు, నగర పాలక సంస్థ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంట, మేజర్ డ్రెయిన్లపైన ఆక్రమణలు ఉండడానికి వీలులేదని, పట్టణ ప్రణాళికాధికారులు ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టిసారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బస్టాండ్ రోడ్, నందివెలుగు రోడ్లను శనివారం ఆయన పరిశీలించి రోడ్లు, డ్రెయిన్‌లపై ఆక్రమణలు ఉండడంపై పట్టణ ప్రణాళిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఆక్రమణల తొలగింపు చేపట్టారు.

కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే శంకర్ విలాస్ వంతెన పనులు ప్రారంభం అయినందున నగరంలో ట్రాఫిక్ సమస్యలు వచ్చే అవకాశం ఉందని, రోడ్ ఆక్రమణలను ఉపేక్షించబోమన్నారు. ప్రస్తుతం వర్షాలకు ఆక్రమణల వలన డ్రెయిన్లు పొంగి ఇళ్లలోకి మురుగు వస్తుందని, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వ్యాపార వాణిజ్య సంస్థలు కూడా ఆక్రమణల తొలగింపునకు సహకరించాలని కోరారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు నాగభూషణం, హనీఫ్, ఎంహెచ్ఓ (ఇన్‌చార్జి) రామారావు, కార్పొరేటర్ మహమూద్, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

సీతమ్మ కాలనీ అభివృద్ధికి ప్రగతి బాటలు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

● రూ. 2.7 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీతమ్మ కాలనీలో అభివృద్ధికి ప్రగతి బాటలు పరుస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు 28వ డివిజన్ సీతమ్మ కాలనీలో రూ.2.8 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ సీతమ్మ కాలనీ, ఎన్జీఓస్ కాలనీలలో రూ.2.8 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ సీతమ్మ కాలనీ వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో కార్పొరేటర్ ఈ ప్రాంతంను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ఇక్కడ సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి కుళాయి కనెక్షన్లు, కల్వర్టుల నిర్మాణాలు చేశామన్నారు. సీతమ్మ కాలనీలో నాలుగు, ఐదు లైన్లలో 80 లక్షలతో సీసీ రోడ్లు, ఒకటి, రెండు లైన్లలో 49.9 సైడ్ డ్రెయిన్లు, నాలుగో లైన్లో రూ. 49.5 లక్షలతో సీసీ డ్రెయిన్లు, ఆర్‌సీసీ కల్వర్టుల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశామని, ఎన్జీవో కాలనీ ప్రధాన రోడ్డు వద్ద రూ.17 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం, వేణుగోపాల స్వామి ఆలయం వద్ద నుంచి రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం, మొత్తంగా రూ.2.8 కోట్ల రూపాయల విలువైన పనుల చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో తెల్లగోర్ల అప్పారావు, కసుకుర్తి హనుమంతరావు, శ్రీను, నాంచారమ్మ, సాంబశివరావు, మదమంచి శ్రీను, పీ.రాము, చిరంజీవి, శ్రావణి నాయక్, ఆంజనేయులు, వంశీ కృష్ణ, మల్లి, జీవన్, జక్కయ్య, భాను, ఆదాము, చిట్టమ్మ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యేలు నసీర్, నక్కా ఆనందబాబు

● తొమ్మిదో డివిజన్లో ఉత్సాహంగా 'సుపరిపాలన' కార్యక్రమం

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. నగరంలోని తొమ్మిదో డివిజన్లో శనివారం వారిరువురూ 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అందుబాటు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్ట్ సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గుంటూరు తూర్పులో డివిజన్ రూపురేఖలు మార్చేశామన్నారు. అధికారం చేపట్టిన వెంటనే ఈ డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, కేవలం ఏడాదిలోనే సుమారు రూ.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. గత ప్రభుత్వంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం విజన్‌తో ముందుకు వెళుతోందని చెప్పారు. కార్యక్రమంలో చిట్టాబత్తిని చిట్టిబాబు, కార్పొరేటర్ అశోక్, కన్నెబోయిన సాయి, పున్నయ్య, గురవారు వాసు, కండువారి వెంకట్, ప్రభాకర్, దాసరి గౌతమ్, నాగేశ్వరరావు, వీర్రాజు, పగడాల గోపి, పణి, నరసింహ, సునీత, చంద్రకాంత్, సాయి, గోవిందర్ తదితరులు పాల్గొన్నారు.



సుపరిపాలన కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న ఎమ్మెల్యేలు నసీర్, ఆనందబాబు, చిట్టిబాబు

పేదరిక నిర్మూలనకు పీ-4 వారధి

బంగారు కుటుంబాలకు సమాజంలో సరైన గౌరవం అందించే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో డీఎంహెచ్ఓ, ఇతర వైద్యులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 75 వేల బంగారు కుటుంబాలు గుర్తిస్తే అందులో 25 వేలు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఉన్నాయని తెలిపారు. తూర్పు నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, పీ-4 కార్యక్రమం ద్వారా ఆర్థిక ప్రగతి సాధిస్తామని వెల్లడించారు. దీనికి వైద్యులు పూర్తి సహకారం అందించాలని, మార్గదర్శకులుగా మారి బంగారు కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలవాలని పిలుపునిచ్చారు.

దేశ ఆర్థిక పరిపుష్టికి కామర్స్ విద్యార్థులు చేయూత ఇవ్వాలి

గుంటూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక పరిపుష్టికి కామర్స్ విద్యార్థులు చేయూత ఇవ్వాలని శ్రీ మేధా విద్యాసంస్థల చైర్మన్ అన్నా నందకిషోర్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని పద్మశ్రీ కల్యాణమండపంలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలేది విద్యాజ్యోతి మాత్రమేనని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి కామర్స్ కోర్సులు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్ హరనాథ్, శ్రీమేధ డైరెక్టర్ శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



జ్యోతి వెలిగించి వేడుకల్ని ప్రారంభిస్తున్న అన్నా నందకిషోర్

సత్యసాయిబాబా శత జయంతోత్సవాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయిబాబా శత జయంతోత్సవానికి వచ్చే దేశ, విదేశీయులకు సమర్థవంతంగా సేవలు అందించాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థ సమన్వయకర్త సిరివరపు కోటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీసాయి బొమ్మిడాలనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర శ్రీ సత్య సాయి సేవా సంస్థల పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ లక్షలు మంది భక్తులు వచ్చే ఈ కార్యక్రమానికి దాదాపు పది వేల మంది సభ్యులును సమాయత్తం చేయాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర మహిళా సేవాదళ్ సమన్వయకర్త ఎల్ శశిబాల, స్టేట్ ట్రస్ట్ మెంబర్ సెక్రటరీ ఎంబీఆర్ శేషసాయి ప్రసంగించారు. ఈ సందర్భంగా పుట్టపర్తిలో నవంబర్లో జరిగే జాతీయ నారాయణ సేవకు అవసరమైన బియ్యాన్ని సేవా పుష్పంగా అందిస్తామని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు అడబాల కొండబాబు ప్రకటించారు. అనంతరం బొమ్మిడాలనగర్ శ్రీ సత్య సాయి ఎడ్యుకేషన్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు, మేయర్ కోవెలమూడి రవీంద్ర, డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి తదితరులు పాల్గొని పదాధికారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని రాష్ట్ర సేవా సమన్వయకర్త కొమరగిరి శ్యాంప్రసాద్, డాక్టర్ పి.ఎల్. నరసింహారావు తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా జిల్లా పదాధికారుల బాధ్యతల స్వీకరణ

గుంటూరు(తూర్పు), జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక లాలుపురం, జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా నూతన పదాధికారుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, చిగురుపాటి కుమారస్వామి హాజరై నూతనంగా ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడమేగాక ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూపూడి రంగరాజు, మకుటం శివ, తమనంపూడి రామకృష్ణారెడ్డి, శనక్కాయల అరుణ, యడ్లపాటి స్వరూపరాణి పాల్గొన్నారు.



నియామక పత్రాలు పొందిన సభ్యులతో బీ జే పీ జిల్లా నాయకులు

విద్యుత్ రంగం ప్రైవేటీకరణలో భాగమే స్మార్ట్ మీటర్లు

● డి.రమాదేవి

గుంటూరు (తూర్పు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే కుట్రలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి ఆరోపించారు. బ్రాడీపేట, ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రమాదేవి ప్రసంగించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి చట్టబద్ధత కల్పించాలని కోరారు. జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ గుంటూరు ఛానల్, నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో ఈమని అప్పారావు, కె నళినీకాంత్, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసకుమారి, ఎల్.అరుణ పాల్గొన్నారు.

కంటి సంరక్షణ ముఖ్యం

గుంటూరు(తూర్పు), జూలై 26(ఆంధ్రజ్యోతి): సృష్టిని వీక్షించే నేత్రాల రక్షణకు శ్రద్ధ వహించాలని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు మన్నె అనూరాధ అన్నారు. స్థానిక ఎస్వీఎన్ కాలనీ, చిన్మయ విద్యాలయ ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో, సుదర్శిని కంటి ఆస్పత్రి సహకారంతో విద్యార్థులకు శనివారం ఉచిత మెగా 'ఐ' క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రోటరీ క్లబ్ ఆదర్శ్ కార్యదర్శి నందిపాటి వాణికుమారి, సుదర్శిని కంటి ఆస్పత్రి డైరెక్టర్, రోటేరియన్ డాక్టర్ దుర్గా చైతన్య, అశోకా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సాయి బాలాజీ స్వీట్స్ లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్

స్వీట్స్ తయారీలో గడువు ముగిసిన ఫుడ్ కలర్స్

● అక్కడ నుంచే కలెక్టర్ కార్యాలయానికి సరఫరా

● విజిలెన్స్ అధికారుల తనిఖీలలో ఆసక్తికర అంశాలు

గుంటూరు సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : స్వీట్స్‌లో కలర్స్ వాడటమే మంచిది కాదు. అవి కూడా గడువు ముగిసినవి వాడితే... అటువంటివి వినియోగించి తయారు చేసిన స్వీట్స్ తిన్న వారి ఆరోగ్యం గోవిందా. గుంటూరు కొత్తపేటలో ఉన్న సాయి బాలాజీ స్వీట్ షాపులో అటువంటి వాటినే విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గడువు ముగిసి రెండేళ్ల దాటిన కలర్స్‌ను స్వీట్స్ తయారీకి వినియోగిస్తుండటం చూసి బిత్తర పోయారు. అపరిశుభ్రమైన వాతావరణంలో.. కంపు కొడుతున్న పాత్రలను ఉపయోగించి ఎంతో మంది తింటున్న స్వీట్స్ తయారీ చేస్తున్నట్లు గుర్తించి బాధ్యులపై కేసు నమోదు చేశారు. శుక్రవారం రాత్రి గుంటూరు విజిలెన్స్ ఎస్‌పీ సూర్య శ్రవణ్ కుమార్ ఆదేశాల మేరకు సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్ కొత్తపేటలో ఉన్న సాయి బాలాజీ స్వీట్ తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్‌ను వ్యాపారం కోసం వాడుతున్నట్లు గమనించి సాయి బాలాజీ స్వీట్స్ యజమాని నాగార్జునపై 6ఏ కేసు నమోదు చేశారు. గడువు ముగిసిన ఫుడ్ కలర్స్‌ను విరివిగా వాడుతున్నట్లు గమనించి షాపును సీజ్ చేశారు. విచిత్రం ఏమిటంటే కొన్ని సంవత్సరాల నుంచి ఇదే షాపు నుంచి తీసుకువచ్చిన స్వీట్స్‌ను కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరుగుతున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొనే జిల్లా స్థాయి అధికారులకు పెడుతున్నారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని స్వీట్ షాపుల్లో త్వరలో తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), జూలై 26(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలాం యువ ఫౌండేషన్ ఛైర్మన్ పిడికిటి భూపాల్ అన్నారు. స్థానిక ఎన్టీవో కాలనీ, సుమేధా పాఠశాలలో శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు కల్లా శ్రీకాంత్ మాట్లాడుతూ కలాం స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్కూల్ డైరక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కలలు కనండి... వాటిని సాకారం చేసుకోండి అనే కలాం మాటలను గుర్తుంచుకోవాలని అన్నారు. అనంతర విద్యార్థులకు 200 ఔషధ మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగాలు నేటి యువతకు ఆదర్శం

గుంటూరు(తూర్పు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ అమరవీరుల త్యాగాలు నేటి యువతకు ఆదర్శం కావాలని జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి గుణశీల, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. స్థానిక హిందు కళాశాల వద్ద, అమర జవానుల స్మారక చిహ్నం వద్ద కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ భరత జాతి చరిత్రపుటల్లో సువర్ణాక్షరాలుతో లిఖించిన కార్గిల్ యుద్ధ విజయం దేశం యావత్తు జరుపుకునే ఒక పండుగ అని అన్నారు. కార్యక్ర మంలో సైనిక్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ ఆనందరావు, క్యాంటీన్ మేనేజర్ శంకరయ్య, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, మాజీ సైనికుడు తోట శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు శ్రీనివాసరావు, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ ఈదర శ్రీనివాసరెడ్డి, కుమార్ గౌడ్, సురేష్, సాధు రామకృష్ణ, జితేంద్ర గుప్తా, సురేష్ జైన్, కుద్దూస్, రఫీ, తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

జోయాలుక్కాస్‌లో 'బ్రిలియెన్స్ డైమండ్ జ్యూయలరీ షో'

గుంటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): జోయాలుక్కాస్ సంస్థ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన బ్రిలియెన్స్ డైమండ్ జ్యూయలరీ షో గుంటూరులో ప్రారంభమైంది. లాడ్జి సెంటర్ అమరావతి రోడ్డులోనున్న జోయాలుక్కాస్ షోరూంలో శనివారం పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి బ్రిలియెన్స్ డైమండ్ జ్యూయలరీ షోను లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో జోయాలుక్కాస్ సంస్థ జ్యూయలరీ, డైమండ్స్‌ను అందించటం అభినందనీయమన్నారు. ఈనెల 26 నుంచి ఆగస్టు 10 వరకు జరిగే ఈ డైమండ్ జ్యూయలరీ షోను ప్రజలు సద్వినియోగం చేసుకొని, ఆదరించాలని కోరారు. డీజీఎం (రిటైల్) రాజేష్‌కృష్ణన్, రీజనల్ మేనేజర్ రిజీష్ మాట్లాడుతూ ఈ డైమండ్, జ్యూయలరీ షో సందర్భంగా ఒక ప్రత్యేకమైన ఆఫర్ గా, కస్టమర్లు ప్రదర్శనలో రూ.లక్ష అంతకంటే ఎక్కువ విలువైన ప్రతి డైమండ్ జ్యూయలరీ కొనుగోలుతో ఉచితంగా 1 గ్రాము గోల్డ్ కాయిన్‌ను అందించటం జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో విభిన్న శ్రేణుల్లో బంగారు, డైమండ్ జ్యూయలరీ ఆభరణాలు అందుబాటులో ఉంటాయన్నారు. పలువురు ప్రముఖులు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

అలరించిన గాత్రకచేరి

గుంటూరు(తూర్పు), జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, అన్నమయ్య కళావేదికపై ప్రముఖ గాయకురాలు రాగమయూరి నిర్వహించిన గాత్రకచేరి అలరించింది. నాగార్జున సంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత కళాశాల సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాన్ని మాజీ హైకోర్టు న్యాయమూర్తి కేజీ శంకర్ ప్రారంభించారు. రాగమయూరి పలు త్యాగరాజ కీర్తనలను ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరికి మృదంగంపై రామకృష్ణ, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని సాంస్కృతిక కేంద్రం కార్యదర్శి కే.సూర్యనారాయణ పర్యవేక్షించారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో దూదేకుల ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీని నెరవేరుస్తూ జీవో జారీ చేసిన సీఎం చంద్రబాబుకు మైనార్టీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్పొరేషన్ వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది పేద మైనార్టీలకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ నేత లాల్ వజీర్ అన్నారు. కార్పొరేషన్ ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ చిన్న బాజి, గోళ్ళ ప్రభాకర్, పుల్లా సుందరంబాబు, బెల్లంకొండ సురేష్, నాగిరెడ్డి, వై.లోకేష్, వడ్డే శ్రీనివాస్, బొంతల సాయి, దగ్గు కిరణ్, చావల మన్నయ్య, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గుంటూరు(తూర్పు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారదా కాలనీలో రోటరీ క్లబ్ గుంటూరు వారి ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ పీడీ జ్ఞాన ప్రసూన హాజరై మహిళలకు కిట్లను అందజేశారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు నంబూరు కృష్ణమూర్తి, కే.శ్రీధర్ బాబు మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ కిట్లు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా నాయకులు పోలిశెట్టి ప్రేమ్ కుమార్, ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ మేకల నాగ సుధీర్‌కుమార్ రెడ్డి, కొల్లి అరవింద్, శోభానంద్, రమేష్, పబ్బిశెట్టి లక్ష్మీనారాయణ, యలమంచిలి వేణుగోపాల్, కనమర్లపూడి రవికిరణ్, చంద్రశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథం పనితీరు పరిశీలన

గుంటూరు(తూర్పు), జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా గుంటూరు రూరల్ మండలంలో ప్రారంభించిన పైలట్ ప్రాజెక్ట్ స్వచ్ఛరథం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జడ్పీ సీఈవోలు, జిల్లాల పంచాయతీ అధికారులు సందర్శించారు. తొలుత మండలం మల్లవరం గ్రామంలో శనివారం స్వచ్ఛ రథాన్ని అధికారులు ప్రారంభించారు. అధికారులు స్వచ్ఛ రథం వెంట ఉండి, ప్రజలు ఎటువంటి సామగ్రిని తీసుకొస్తున్నారు.. అక్కడ వారిచ్చిన సామగ్రిని సరిగ్గా తూకం వేస్తున్నారా లేదా.. సిబ్బంది ఇచ్చే నిత్యావసరాలేంటి.. వాటిని ఎం చేస్తున్నారు అనే అంశాలను పరిశీలించారు. స్థానిక గ్రామస్థులతో మాట్లాడి స్వచ్ఛరథంతో కలిగే లాభాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ సీఈవో జ్యోతిబసు, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, అన్ని జిల్లాల జడ్పీ సీఈఓలు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిల్కారి సేవలపై గర్భిణుల్లో అవగాహన పెంచాలి : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కిల్కారి కాల్స్ వచ్చినప్పుడు పూర్తిగా సమాచారం వినే గర్భిణులు, బాలింతల సంఖ్య పెరగాలని, దీనికోసం ఆరోగ్య పర్యవేక్షకులు తప్పనిసరిగా ఫాలోఅప్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఆశా నోడల్ అధికారుల సమావేశంలో కిల్కారీ సేవలపై ఆమె సమీక్ష జరిపారు. కిల్కారి కాల్స్ ప్రాముఖ్యతను గర్భిణులకు, బాలింతలకు తెలియజేసి వారిలో అవగాహన పెంచాలని డీఎంహెచ్‌వో సూచించారు. అనంతరం జిల్లాలో కిల్కారి ఫోన్ కాల్స్ అంశంలో చక్కటి సేవలు అందించిన ఆశాలకు ఆమె బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ ప్రియాంక, డీపీఎంఎన్ ఎన్.సురేష్, రీజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బీ రాజు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల తుది జాబితా విడుదల...

జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ పరిధిలో వివిధ ఉద్యోగాల కోసం గత ఏడాది డిసెంబర్‌లో ఇచ్చిన నోటిఫికేషన్‌పై ఎంపిక చేసిన తుది అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను తీసుకొని జూలై 28వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు గుంటూరులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయానికి హాజరుకావాలని ఆమె తెలిపారు.

జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ నిరసన

గుంటూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : బదిలీలు జరిగి రెండు నెలలు కావస్తున్నా బదిలీ అయిన టీచర్ల జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యు రాజశేఖరరావు, ఎం.కళాధర్ ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించాలని కోరుతూ శనివారం డీఈవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 జనవరి నుంచి మొత్తం 4 దఫాల డీఏలు, జూలై 2023 నుంచి ఇవ్వవలసిన పీఆర్‌సీపై ప్రభుత్వం నోరు మెదపటం లేదని అన్నారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ రకరకాల పనులు వెరి అర్జంట్ అంటూ ఉపాధ్యాయుల చేత చేయించుకుంటున్నారని, జీతాలు మాత్రం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు చెల్లింపునకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, గోవిందు, ప్రసాదు, ఆడిట్ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు దరఖాస్తుల విచారణ సేవల్లో జిల్లాకు ద్వితీయ స్థానం



ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి శివ హర్ష నుంచి అవార్డు అందుకుంటున్న స్పెషల్ బ్రాంచ్ సీఐ అళహరి శ్రీనివాస్

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పాస్‌పోర్ట్ దరఖాస్తుల విచారణ సేవల్లో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు విజయ వాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివ హర్ష చేతుల మీదుగా గుంటూరు జిల్లా పోలీస్ విభాగం తరపున జిల్లా ఎస్పీ సీఐ అళహరి శ్రీనివాస అవార్డును అందుకున్నారు. జిల్లా పోలీస్ విభాగం ఈ గుర్తింపుతో మరింత ప్రోత్సాహంతో ముందుకు సాగుతుందని జిల్లా ఎస్పీ అన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్న వైసీపీ నేతలు

● జనసేన నేతలు బోనబోయిన, గాదె ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న బోనబోయిన, గాదె

గుంటూరు మెడికల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అగ్రశేణి సినీ హీరోగా, కీలక రాజకీయ నేతగా జనసేనాని పవన్ కల్యాణ్ సాధిస్తున్న విజయాలు చూసి ఓర్వలేకపోతున్న వైసీపీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. అమరావతి రోడ్‌లోని పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాత విడుదలైన మొదటి సినిమా హరిహర వీరమల్లును ప్రజలు చక్కగా ఆదరిస్తున్నట్లు బోనబోయిన, గాదె తెలిపారు. తమపై తప్పుడు ఆరోపణలు చేసే ప్రత్యర్థి పార్టీల వారికి సరైన సమాధానం ఇవ్వమని మాత్రమే తమ అధినేత సూచించినట్లు వారు తెలిపారు. వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని బహిరంగంగానే రప్పా రప్పా నరికేద్దాం...రాత్రిపూట కాదు పగలే నరుకుదాం అని చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు నారాయణమూర్తికి కనిపించలేదా? అని వారు నిలదీశారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, ప్రత్తిపాడు ఏఎంసీ చైర్మన్ బొందలపాటి ఉమా, నేతలు చందు సాంబశివరావు, శిఖా బాలు, చట్టాల త్రినాథ్, యర్రంశెట్టి సూరి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విద్యాభవన్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోల్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ రోల్‌బాల్ పోటీల్లో స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని పాఠశాల కార్యదర్శి పి.రామ చంద్రరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న టీబీకే కైవల్య, 7వ తరగతి చదువుతున్న వై.జనీష్ విశ్వసాయి పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని వివరించారు.


వర్షానికి దోసకాయలు దెబ్బతింటున్నాయని తెలుపుతున్న రైతు వెంకటరెడ్డి

అకాల వర్షం.. మిగిల్చిన నష్టం

కొల్లిపర, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరపి లేని వర్షాలతో కూరగాయల పంటల రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. డెల్టా ప్రాంతమైనా కొల్లిపర మండలంలో దావులూరుపాలెం, హనుమాన్‌పాలెం, అన్నవరం, అన్నవరంగౌడ పాలెం, తూములూరు, మున్నంగి, వల్లభాపురం, పిడపర్రు, కొల్లిపర తదితర గ్రామల్లోని రైతులు తక్కువ కాలంలో చేతికి వచ్చే వివిధ రకాల కూరగాయల పంటలను మెట్ట, మాగాణి భూముల్లో సాగు చేశారు. పైర్లు కాపు, పిందె, పూత దశలో ఉన్న సమయంలో వానలు పడటంతో రైతులు లక్షలాది రూపాయల ఆదాయాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఒక విడత కూరగాయలు కోశారు. రెండో విడత కోత దశలో ఉన్న తరుణంలో వర్షాలు కురవడంతో పూత రాలిపోవడంతో పాటు తెగుళ్లు సోకి పురుగు ఆశించింది. పైర్లలో నీరు నిలిచి పోవడంతో కాయలు కుళ్లిపోయాయి. దోస, సొర, బీర, గుమ్మడి పైర్లు వర్షపు నీటిలో, బురదలో నిల్వ ఉండటంతో చేతికి వచ్చే పంట దెబ్బతిని రైతులు ఆవేదన చెందుతున్నారు. అదే విధంగా బెండ, వంగ, మిరప తోటల్లో వర్షానికి నీరు నిలబడటంతో తెగుళ్లు ఆశించి, పూత రాలిపోయినట్లు రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఎకరానికి ఖర్చులు పోను రూ.90 వేల నుంచి లక్ష రూపాయల వరకు వచ్చే ఆదాయాన్ని కోల్పోయినట్లు రైతులు బొమ్ము వెంకటరెడ్డి, భీమవరపు సాంబిరెడ్డి పేర్కొన్నారు.

ఎత్తులు వేస్తూ.. ఖాళీ చేస్తున్నారు

స్టాక్ పాయింట్ల నుంచి వినియోగదారుల భవన నిర్మాణ ప్రదేశానికి ఇసుకను చేర్చే టిప్పర్ల బాడీ ఎత్తు పెంచేశారు. టిప్పర్ తయారీ కంపెనీ నిర్మించిన బాడీకి అదనంగా చుట్టూత ఇనుప రేకుతో వెల్డింగ్ చేసి అదనంగా మరో ఐదు టన్నులకు పైగా ఇసుక లోడింగ్ చేసేలా ఏర్పాటు చేసుకొన్నారు. ట్రాక్టర్ల ట్రక్కు బాడీ మట్టానికి కాకుండా సార పోస్తున్నారు. దీని వల్ల దాదాపుగా 40 శాతం ఇసుక అదనంగా ట్రాక్టర్‌లో లోడింగ్ జరుగుతోంది. రేపటి రోజున ఎవరైనా ఎన్‌జీటీ, కోర్టుల్లో పిటీషన్లు వేస్తే అనుమతించిన మైనింగ్‌కు, జరిగిన దానికి భారీగా వ్యత్యాసాలు నమోదయ్యే అవకాశం ఉంది.

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో లింగాయపాలెం -1, 2, గుండిమెడ, బోరుపాలెంలో ఇసుక రీచ్‌లున్నాయి. ఇక్కడి ఇసుక మైనింగ్ చేసి స్టాక్ పాయింట్లకు చేరుస్తారు. అక్కడి నుంచి వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని అమరావతిలో అనధికారికంగా ట్రాక్టర్లతో నేరుగా నదీ తీరం వద్ద నుంచే ఇసుకని లోడింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కులో 4.5 మెట్రిక్ టన్నులకు మించి లోడింగ్ చేయకూడదు. అలానే 6 టైర్ల లారీలో 10 మెట్రిక్ టన్నులు, 10, 12, 14 టైర్ల టిప్పర్లలో వాటి సామర్థ్యం మేరకు 18 నుంచి 35 టన్నుల వరకు అనుమతిస్తారు. అయితే ట్రాక్టర్లలో దాదాపుగా ఆరు నుంచి ఏడు మెట్రిక్ టన్నులు లోడింగ్ చేస్తున్నారు. దానిపై ప్లాస్టిక్ పట్టా కప్పి రవాణ చేస్తున్నారు. అలానే టిప్పర్లలో అయితే అనుమతించిన దాని కంటే అదనంగా ఐదు మెట్రిక్ టన్నుల ఇసుకని లోడింగ్ చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాటా వే బిల్లులో మాత్రం లోడింగ్ జరిగిన దానికంటే ఐదు టన్నులు తక్కువగా ఎంట్రీ చేస్తున్నారు.

టిప్పర్ల బాడీ ఎత్తు పెంచిన యజమానులు

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అదనపు లోడింగ్

ట్రాక్టర్ ట్రక్కుకి సార పోస్తున్న వైనం

రీచ్‌లు, స్టాక్ పాయింట్లలో కరిగిపోతున్న నిల్వలు


ఐదు లోడులకు ఒక టిప్పర్ ఇసుక అదనం

ఇలా ఐదు, ఆరు వాహనాలకు అదనంగా లోడింగ్ చేస్తే దాదాపుగా ఒక టిప్పర్ ఇసుక స్టాక్‌పాయింట్ నుంచి కరిగిపోయినట్లే. దీని వల్ల ఎక్సకవేషన్, లోడింగ్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతోంది. అలానే వేగవంతంగా స్టాక్ పాయింట్లలో నిల్వ అయిపోతుండటంతో ఇసుకకు కొరత ఏర్పడుతోంది. ఇలా ఓవర్ లోడింగ్ జరుగుతుండటం వల్ల లారీ యజమాని/డ్రైవర్‌కు లబ్ధి చేకూరుతోంది. ఇందుకు సహకరించిన వారి జేబులూ నిండుతున్నాయి. వినియోగదారుడి వద్ద ఇసుక అదనంగా తీసుకొచ్చామని చెప్పి ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారు. 40 టన్నుల లారీకి రూ. 17వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు కృష్ణానదిలో వరద పెరగడంతో దానిని సాకుగా చూపిస్తూ ఇంకా అదనంగా డిమాండ్ చేస్తున్నారని భవన నిర్మాణదారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వారానికి ఒకసారి స్టాక్ పాయింట్లు, ఇసుక రీచ్‌ల వద్ద ఆడిట్ జరగకపోతే రేపటి రోజున భారీ మోతాదులో ఖనిజ నష్టం వాటిల్లుతుంది.

శాసన సభ, మండలి కమిటీల్లో గుంటూరు ప్రజాప్రతినిధులు

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసన మండలి, శాసనసభ కమిటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు సముచిత స్థానం లభించింది. శాసనమండలి సభా నియమాల కమిటీలో ఎమ్మెల్సీలు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మురుగుడు హనుమంతరావు, తెలుగు భాష, సంస్కృతి అభివృద్ధిపై కమిటీలో చంద్రగిరి ఏసురత్నం, టి.కల్పలత, అర్జీల కమిటీలో ఆలపాటి రాజేంద్రప్రసాదు, నైతిక విలువల కమిటీలో మురుగుడు హనుమంతరావు, ప్రభుత్వ హామీల కమిటీలో ఆలపాటి రాజేంద్రప్రసాదు, లేళ్ల అప్పిరెడ్డిని నియమిస్తూ సెక్రెటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఉత్తర్వులు జారీ చేశారు.

● శాసనసభ అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ కమిటీకి చైర్మన్‌గా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌ని నియమించారు. ఇదే కమిటీలో సభ్యుడిగా చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నియమితులయ్యారు. వెనకబడిన వర్గాల సంక్షేమ కమిటీలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, సదుపాయాల కమిటీలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం నియామకం పొందారు. వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు, మహిళ, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీలో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ టి.కల్పలత, అనుగత చట్ట నిర్మాణ కమిటీలో సత్తెనపల్లి, పొన్నూరు ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నియమితులయ్యారు.

ఏషియన్ స్కేటింగ్‌లో జెస్సీ రాజ్‌కు రజతం


దక్షిణ కొరియాలో రజత పతకం అందుకున్న జెస్సీరాజ్

మంగళగిరి సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ మాత్రపు జెస్సీరాజ్ ప్రపంచ వేదికపై మరోమారు సత్తా చాటింది. దక్షిణ కొరియాలో ఈ నెల 24 నుంచి జరుగుతున్న ఏషియన్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో అద్భుతంగా రాణించి రజత పతకం సొంతం చేసుకుంది. శనివారం జరిగిన రోలర్ స్కేటింగ్ సోలో డాన్స్ సబ్ జూనియర్ విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది. జెస్సీరాజ్, కోచ్ సింహాద్రిని భారత రోలర్ స్కే టింగ్ సమాఖ్య కార్యదర్శి భగీరథకుమార్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి థామస్ చౌదరి, ఏపీ ఆర్టిస్టిక్ స్కేటింగ్ చైర్మన్ పవన్‌కుమార్, అయాన్ టెక్నికల్ కమిటీ సభ్యుడు అలెక్స్ వాంగ్, ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు అభినందించారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు


పవర్‌లిఫ్టింగ్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ ఏపీపీ అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు

దుగ్గిరాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో దాగిన క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యమని అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోయేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి దినేష్‌బాబు అన్నారు. రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. దినేష్‌బాబు మాట్లాడుతూ ఖర్చుతో కూడిన పోటీలను పీడీ నాగశిరీష ఎంతో ఉత్సాహంతో నిర్వహిస్తున్నారని, సహకరిస్తున్న గ్రామపెద్దలకు, అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు దొడ్డ దినేష్‌బాబు, చెన్నంశెట్టి మహేష్‌బాబు పాల్గొన్నారు. రెండువందల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్న ఈ పోటీలు జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్, మాస్టర్స్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో రెండు రోజులపాటు జరుగనున్నాయి. 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆగస్టులో జార్ఖండ్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఎంపీటీసీ కొప్పుల మధు బాబు, ఎస్‌జీఎఫ్ జిల్లాకార్యదర్శి మెల్లెంపూడి రవి, కర్నూల్ జిల్లా సెక్రటరీ లోకేశ్, సంయుక్త కార్యదర్శి రేష్మ, పీడీలు దాసరి సరళాదేవి, రుద్రపాటి కుమారి, కాటూరి రాంబాబు, భాస్కరరావు, దాతులూరి సిద్దయ్య, హెచ్‌ఎం బీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



గుంటూరు సిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వాతావరణ సంక్షోభానికి సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టీ విజయ్ కుమార్ పేర్కొన్నారు. వివిధ రకాల పంటలతో ఏడాది పొడవునా నేలను పచ్చ దనంతో కప్పి ఉంచడం వల్ల వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకొంటాయన్నారు. నాలుగు రోజులపాటు కేరళ బృందానికి ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమం శనివారం గుంటూరులోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ప్రారం భమైంది. ఈ కార్యక్రమంలో కేరళ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రాల నిపుణులు, రైతు మెంటర్ ట్రైనర్లతో కూడిన 34 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా "సెంటర్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్"గా గుర్తించబడ్డ (ఇండో-జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్) ఆధ్వర్యంలో హైదరాబాద్ సహకారంతో నిర్వహిస్తు న్నారు. ఈ సందర్భంగా టి విజయ్‌కుమార్ మాట్లాడు తూ ప్రకృతి వ్యవసాయం బయాలజికల్ ప్రాసెస్‌లపై ఆధారపడి, పోషకాలు, నీటి చక్రం, మొక్కల శారీరక శా స్త్రం, కలుపు నియంత్రణలో శాస్త్రీయ పరిష్కారాలను అందిస్తుందని తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌ఎం విజయానంద్ వర్చువల్‌గా మాట్లాడుతూ రాష్ట్రాల మధ్య జ్ఞాన మార్పిడి ద్వారా స్థిరమైన, స్నేహపూర్వక వ్యవసాయ పద్ధతులను అవలంబించడంలో కేరళ నిబద్ధతను పునరుద్ఘాటించారు. రైతు సాధికార సంస్థ సలహాదారులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డీవీ రాయుడు మాట్లాడుతూ



శిక్షణా కార్యక్రమానికి హాజరైన కేరళ ప్రతినిధి బృందం

బహుళ పంటల సాగు వ్యవస్థలు కార్బన్ ఉద్గారాలను తగ్గించి, నేల నిర్మాణాన్ని మెరుగు పరచి, జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రకృతి వ్యవసాయ మోడళ్ల ప్రాముఖ్యతను విస్తరణ అవసరాన్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు సుధాకర్, జీఆర్ ధర్మేందర్, కె. రామచంద్రం తదితరులు పాల్గొన్నారు

ఇంజనీరింగ్ ప్రవేశాలకు నోటిఫికేషన్

● గుంటూరు నల్లపాడు ఎంబీటీఎస్‌లో హెల్ప్‌లైన్ ● తొలి విడత 18 వేలలోపే సీట్లు భర్తీ.. మూడో విడత లేనట్లే..!

గుంటూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కోసం చివరి విడత నోటిఫికేషన్‌ను సాంకేతిక విద్యాశాఖ జారీ చేసింది. దీంతో ఆదివారం నుంచి 30 వరకు అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. విద్యార్థులు 28 నుంచి 30 వరకు సర్టిఫికెట్లు అప్లోడ్ చేసు కుని, 31 వరకు ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం లభించింది. ఆప్షన్స్ మార్చు కునే అవకాశం ఆగస్టు 1 కల్పించారు. 4న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు 4 నుంచి 8వ తేదీలోగా కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఏటా మూడు విడతల్లో నోటిఫికేషన్ జారీ అవుతుండగా ఈ ఏడాది అది రెండు విడతలకే పరిమితం చేసింది. అడ్మిషన్ల ప్రక్రి య త్వరగా ముగించాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కళాశాలల యాజమాన్యాలు చెప్తున్నాయి. దీంతో ఈ విడతలో అడ్మిషన్ ప్రక్రియ వేగవంతం కానున్నది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకుని, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న వారు నేరుగా వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు మాత్రమే ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్‌లో సందేహాలు, సమస్యల నివృత్తి కోసం గుంటూరు నల్లపాడు ఎంబీటీఎస్ కళాశాలలో హెల్ప్‌డెస్క్(7995681678, 7995865456)ను ఏర్పాటు చేశారు.


సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విద్యార్థులు(పాత చిత్రం)

తొలి విడత భారీగా మిగిలిపోయిన సీట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు యూనివర్సిటీ కళాశాలలు, 36 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలకు తొలివిడతలో 18 వేల సీట్లు మాత్రమే భర్తీ అయినట్లు సమాచారం. అనేక కళాశాలల్లో భారీగా సీట్లు మిగిలిపోయినట్లు సమాచారం. పదిలోపు కళాశాలలో మాత్రమే కన్వీనర్ కోటాలో సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయినట్లు తెలుస్తుంది. ఈఏపీ సెట్లో అర్హత సాధించిన విద్యార్థులు 25 వేలలోపు ఉండగా 30వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఉమ్మడిగా జడ్పీ సీఈఓలు

గుంటూరు సిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల పరిషత్ సీఈఓలు శనివారం గుంటూరు జడ్పీ కార్యాలయాన్ని సందర్శిం చారు. గుంటూరు రూరల్ మండలంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథంను పరిశీలించారు. వారిని గుంటూరు సీఈఓ వీర్ల జ్యోతి బసు ప్రత్యేకంగా ఆహ్వానించారు.


గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో 13 జిల్లాల సీఈఓలు

ఆకాశ మార్గాన.. గంగా ప్రవాహం


విద్యుత్ తీగల తరహాలో తాగు నీటి పైపు లైన్లు


మోటారు ద్వారా పైపులైన్లకు నీటి సరఫరా

ఇవి విద్యుత్ తీగలు అనుకుంటే పొరపాటే. ఇవి తాగునీటి పైపు లైన్లు. భగీరథుడు తన తపస్సుతో ఆకాశ గంగను భువిపైకి పరుగులు పెట్టిస్తే.. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇలా పాతాళ గంగను..ఆకాశ మార్గాన ఇంటింటికీ సరఫరా చేస్తోంది. సహజంగా తాగు నీటి పైపులైన్లు భూమి లోపల ఏర్పాటు చేస్తారు. కానీ, విద్యుత్ తీగల మాదిరి ఇలా స్తంభాల పైనుంచి పైపు లైన్లను ఇళ్లకు అనుసంధానించి నీటిని సరఫరా చేయడం పల్నాడు ప్రత్యేకతగా చెప్పుకుంటున్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ బోర్ల ద్వారా గ్రామాలకు నీటిని సరఫరా చేస్తోంది. పైపులైన్లు భూమిలో కాకుండా పోల్స్ ఏర్పాటు చేసి, వాహనాలకు అడ్డులేనంత ఎత్తులో ఏర్పాటు చేసింది. ఈ చిత్రంలో కనిపిస్తున్న పైపు లైన్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహారెడ్డి స్వగ్రామం వెల్దుర్తిలో ఉన్నాయి. పల్నాడులోని చాలా పల్లెల్లో ఇదే తరహాలో నీటిని సరఫరా చేస్తున్నారు.

-నరసరావుపేట-ఆంధ్రజ్యోతి

'విశాఖ ఎక్స్‌ప్రెస్'లో పెరిగిన స్లీపర్ క్లాసులు

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదుగా సికింద్రాబాద్ - భువనేశ్వర్ మధ్యన రాకపోకలు సాగించే విశాఖ ఎక్స్‌ప్రెస్ బోగీల అమరికను రైల్వేశాఖ సవరించింది. ఎల్‌హెచ్‌బీ రేక్‌గా మారిన తర్వాత ఈ రైలు ఒక ఫస్టు ఏసీ, నాలుగు ఏసీ టూటైర్, ఎనిమిది ఏసీ త్రీటైర్, మూడు స్లీపర్, నాలుగు జనరల్, ఒక బ్రేక్ వ్యాన్, ఒక పవర్ కార్ మొత్తం 22 బోగీలతో ప్రయాణిస్తోంది. స్లీపర్ క్లాస్ బోగీల సంఖ్య తగ్గిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను రైల్వే వినియోగదారుల సంఘాల నాయకులు దక్షిణ మధ్య రైల్వేకు నివేదించారు. దీంతో సికింద్రాబాద్ వైపున సెప్టెంబరు 23, భువనేశ్వర్ వైపున 25వ తేదీ నుంచి బయలుదేరే రైళ్లకు సవరించిన కోచ్ అమరికని అమలు చేస్తారు. ఆయా తేదీల నుంచి విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఒక ఫస్టు ఏసీ, రెండు ఏసీ టూటైర్, ఏడు ఏసీ త్రీటైర్, ఆరు స్లీపర్, నాలుగు జనరల్, ఒక బ్రేక్‌వ్యాన్, మరో పవర్‌కార్‌తో ప్రయాణిస్తాయి. దీంతో మూడు స్లీపర్ క్లాస్ బోగీల సంఖ్య పెరిగింది. జనరల్ కోటాలో 159, పూల్డ్ కోటాలో 24, రిమోట్ లొకేషన్(గుంటూరు)కు 18, తత్కాల్‌లో 72, ప్రీమియం తత్కాల్‌లో 72 స్లీపర్ క్లాస్ బెర్తులు అందుబాటులోకి వస్తాయి.

షిర్డీ, తిరుపతికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో గుంటూరు మీదుగా తిరుపతి, షిర్డీలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. (07637) తిరుపతి - సాయినగర్ షిర్డీ స్పెషల్ తిరుపతిలో ప్రతి ఆదివారం వేకువ జామున 4 గంటలకు బయలుదేరి ఉదయం 8.23కి చీరాల, 9.48కి తెనాలి, 10.30కి గుంటూరు, 11.29కి సత్తెనపల్లి, 11.59కి పిడుగురాళ్ల, మధ్యాహ్నం 12.19కి నడికుడి.. మరుసటి రోజు ఉదయం 10.45 గంటలకు.. సాయినగర్ షిర్డీ చేరుకొంటుంది. నంబరు. (07638) సాయినగర్ షిర్డీ - తిరుపతి స్పెషల్ ప్రతి సోమవారం రాత్రి 7.35కి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.19కి నడికూడి, 2.39కి పిడుగురాళ్ల, 3.09కి సత్తెనపల్లి, సాయంత్రం 4 గంటలకు గుంటూరు, 5.44కి తెనాలి, 6.43కి చీరాల, రాత్రి 1.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.

విజయపథంలో కేజీబీవీలు

● ఉత్తీర్ణత పెంచేందుకు విద్యార్థినులకు స్లిప్ టెస్ట్‌లు ● ఈ నెల 15 నుంచి ప్రారంభం


కేజీబీవీలో పరీక్ష రాస్తున్న విద్యార్థినులు


పరీక్షా పత్రాలను పరిశీలిస్తున్న కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ దేవానందరెడ్డి(పాతచిత్రం)

సత్తెనపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో వినూత్న విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. పూర్తిగా రెసిడెన్సియల్ విధానంలో నడుస్తున్న కేజీబీవీల్లో స్టడీ అవర్స్ అమలు చేస్తున్నారు. అయితే 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థినులకు వారానికి ఐదు రోజులు స్లిప్ టెస్టులు నిర్వహించే ప్రక్రియ ఈ నెల 15 నుంచి ప్రారంభించారు. వచ్చే ఏడాది విద్యా సంవత్సరం వచ్చే వరకు ఈ షెడ్యూల్‌ను అమలు చేయాలని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ దేవానందరెడ్డి కేజీబీవీల ఎస్‌ఓలకు సూచించారు. దీనికి విజయపథం అనే పేరును పెట్టారు. కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి సెక్షన్‌కు 40 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. బాలికలు పూర్తిగా చదువుపై దృష్టి సారించే చర్యల్లో భాగంగా స్టడీ అవర్స్, స్లిప్ టెస్టుల నిర్వహణ చేపట్టాలని దేవానందరెడ్డి ఆదేశాల మేరకు రాత్రి 10గంటల వరకు స్టడీ అవర్సు అమలు చేస్తున్నారు. మరుసటి రోజు ఉదయం 5 గంటలకు తిరిగి స్టడీ అవర్సును ప్రారంభించి, 6గంటలకు స్లిప్ టెస్టు నిర్వహిస్తున్నారు. 6, 7 తరగతులకు రోజు మార్చి రోజు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. 8 నుంచి ఇంటర్మీడియెట్ వరకు మంగళవారం నుంచి శనివారం వరకు స్లిప్ టెస్టులను పెడుతున్నారు. ప్రతిరోజు తెల్లవారు జామున స్టడీ అవర్, స్లిప్ టెస్టులను విద్యాలయాల ఆవరణలోనే నిర్వహిస్తున్నారు. దీంతో బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలో 24 కస్తూర్బాగాంధీ విద్యాలయాలున్నాయి.






భలే భలే బుగాడి!

బుగాడి అనేది సంప్రదాయ చెవి ఆభరణం. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఈ బుగాడికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా దీన్ని స్త్రీత్వానికి, సౌందర్యానికి ప్రతీకగా భావిస్తుంటారు. రవివర్మ చిత్రాల్లో కూడా మహిళలు బుగాడిని అలంకరించుకుని ఉండడం కనిపిస్తుంది. ఇలా ఒకప్పుడు స్త్రీలు సంప్రదాయంగా ధరించిన బుగాడి నేడు సరికొత్త హంగులతో ట్రెండింగ్ లోకి వచ్చేసింది.



బుగాడి ప్రత్యేకత: చెవి పైన వెలుపలి భాగంలో అంచుకు పెట్టుకునే ఆభరణమే బుగాడి. ఇలా రెండు చెవులకూ పెట్టుకుంటారు. కొన్ని వర్గాలవారు అయిదారు బుగాడిలు అలంకరించుకుంటూ ఉంటారు. బుగాడిలు పెట్టుకోవడానికి వీలుగా చెవుల అంచుల మీద సన్నని తీగతో గుచ్చి రంధ్రాలు చేస్తారు. ఇలా చెవులు కుట్టడం వల్ల ముఖ్యమైన ఆక్యుపంక్చర్ పాయింట్లు ఉత్తేజితమై పలు అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయని అప్పటివారు నమ్మేవారు. అంతేకాదు బుగాడి.. ప్రతికూల శక్తులనుంచి కాపాడుతుందని మహిళలు విశ్వసించేవారు. బుగాడిని సాధారణంగా బంగారం లేదా వెండితో తయారు చేస్తారు. సన్నని బంగారు తీగలకు చిన్న ముత్యాలు లేదా ఎర్రని రాళ్లు ఎక్కించి చిన్న రింగుల మాదిరి చుట్టేవారు. కెంపులు, పచ్చలు లాంటి రత్నాలు పొదిగి చిన్న దిద్దుల లాంటివి కూడా తయారు చేసేవారు. మెరిసే రాయి, చిన్న స్క్రూతో ముక్కపుడకలా ఉండే బుగాడిలను మహిళలు ఎక్కువగా ధరించేవారు. క్రమంగా ఇవి రూపాంతరం చెంది సరికొత్త డిజైన్లలో విభిన్న రూపాల్లో అందుబాటులోకి వచ్చేశాయి.

అందమైన బుగాడిలు

లవంగ బుగాడి: ఇది ఎక్కువగా తమిళనాడు ప్రాంతాల్లో కనిపిస్తుంది. దీనికి లవంగం మాదిరి పుల్ల, మొగ్గ ఉంటాయి. మొగ్గ స్థానంలో అందమైన దిద్దులను జతచేస్తారు. వీటిమీద ముత్యాలు, రాళ్లు, రంగుల పూసలు, బంగారు గుళ్లు పొదుగుతారు. పుల్ల చివరలో చిన్న స్క్రూని ఏర్పాటు చేస్తారు.

కఫ్ బుగాడి: బంగారం లేదా వెండి తీగను చిన్న రింగులా చుట్టి దానికి చిన్న లాకెట్‌ను జతచేస్తారు. ఈ లాకెట్ మీద కుందనాలు, సీజెడ్‌లు, కెంపులు, పచ్చలు పొదుగుతారు. దీనికి చిన్న ముత్యాలను వేలాడదీస్తారు. ఈ రకం బుగాడి చూడడానికి గ్రాండ్‌గా కనిపిస్తుంది.

కలాషిన్ బుగాడి: దీనికి రెండు చివర్లలో అందమైన కలశం ఆకృతులు ఉంటాయి. వీటిని స్క్రూ పద్ధతి ద్వారా అమరుస్తారు. ఈ కలశాల మీద చక్కని డిజైన్లు రూపొందించి వాటి మధ్యలో ముత్యాలు, రత్నాలు పొదుగుతారు.

మోతీ బుగాడి: ఇది పూర్తిగా ముత్యాలతో నిండి ఉంటుంది. వివాహితలు, నాట్య కళాకారిణులు ఎక్కువగా ఈ రకం బుగాడిలను ధరిస్తుంటారు.

జుమ్కీ బుగాడి: దీనికి చివరన అందమైన జుమ్కీ లేదా డాంగ్లర్ వేలాడుతూ తళుక్కుమని మెరుస్తూ ఉంటుంది. మువ్వలతో కూడిన బుట్టలు, చాంద్‌బాలీలను కూడా జతచేస్తూ ఉంటారు.

డిస్క్ బుగాడి: దీనికి చివరలో గుండ్రని బిళ్ల ఉంటుంది. ఈ బిళ్ల మీద పువ్వులు, లతలు, హంసలు, నెమళ్లు, లక్ష్మీదేవి బొమ్మలు చెక్కుతారు. దీనిని ఎక్కువగా బ్లాక్ మెటల్‌తో తయారు చేస్తుంటారు.

ట్రెండింగ్‌లో ఇలా: ప్రస్తుతం బుగాడి.. సంప్రదాయ సరిహద్దులు దాటి ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. వారసత్వ విలువలను కాపాడుకుంటూనే యువతులు దీన్ని యాక్సెసరీగా ధరించడం మొదలు పెట్టారు. ఇప్పుడు బుగాడి ధరించాలంటే చెవులు కుట్టించుకోనక్కర్లేదు. క్లిప్ ఆన్, స్క్రూ బ్యాక్, కఫ్ స్టయిల్ రకాలు అందుబాటులోకి వచ్చేశాయి. దీంతో సందర్భానికి తగ్గట్టు రకరకాల బుగాడిలు పెట్టుకోవడానికి సౌలభ్యం ఏర్పడింది. చీరలు, లెహంగాలు లాంటి సంప్రదాయ దుస్తులతోపాటు జీన్స్, స్కర్ట్ లాంటి ఇండో వెస్ట్రన్ ఫ్యాషన్ వేర్ మీద కూడా బుగాడిలు పెళ్లికూతురి అలంకరణలో కూడా బుగాడి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ముక్కుపుడక, పాపిడి బిళ్ల, జుంకీలకు మ్యాచ్ అయ్యేలా వీటిని ఎంపిక చేసుకుంటున్నారు.

• ఖ్యాతి,
ఖ్యాతి డిజైనర్ స్టూడియో
హైదరాబాద్, 6300386749



శిల్పా శిరోద్కర్... ఈ పేరు జ్ఞాపకం వచ్చిందా? ఒకప్పటి బాలీవుడ్ హీరోయిన్‌గా కన్నా.. హీరో మహేష్ బాబు భార్య నమ్రతకు చెల్లెలుగానే తెలుగువారికి ఎక్కువగా తెలుసు. తెలుగులో మోహన్‌బాబుతో 'బ్రహ్మ' సినిమాలో కూడా నటించారు సుమారు రెండు దశాబ్దాల క్రితం వివాహం చేసుకొని విదేశాలకు వెళ్లిన శిల్ప... మళ్లీ స్వదేశానికి తిరిగి వచ్చేశారు. 'బిగ్ బాస్ హిందీ- సీజన్ 18'లో పాల్గొన్నారు. ఇప్పటివరకు మీడియాకు దూరంగా ఉన్న శిల్ప ఇటీవల ఒక ఆంగ్ల మ్యాగజైన్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. దానిలో తన జీవితానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన విశేషాలను వెల్లడించారు.

సినిమా కోసం నన్ను చంపేశారు!

ఎంతో తేడా...

"నేను 10వ తరగతి ఫెయిల్ అయ్యా. నా భర్త అపరేష్ రంజిత్ డబుల్ ఎంబీఏ. అయితే మా మధ్య చదువు విషయం ఏ రోజూ చర్చకు రాలేదు. ఆయన నన్ను ఎప్పుడూ చిన్నచూపు చూడలేదు. ఆయన నా వృత్తిని గౌరవిస్తారు. నేను ఆయన వృత్తిని గౌరవిస్తా. మా తల్లిదండ్రులు చనిపోయాక నా జీవితంలో ఒక శూన్యం ఏర్పడింది. ఏదో వెలితిగా ఉండేది. భారత్‌కు వచ్చేయాలని బలంగా అనిపించింది. నేను వచ్చేద్దామనుకొనే సమయానికి రంజిత్ కెరీర్ చాలా బావుంది. తను దాన్ని వదులుకొని రాలేని పరిస్థితి ఉంది. కానీ ఆయన నన్ను అర్థం చేసుకొన్నారు. నేను కొన్నేళ్లు నా సోదరి నమ్రత దగ్గర ఉంటే మానసికంగా బావుంటుందను కున్నాం. నేను భారత్ వచ్చేశా. వచ్చిన తర్వాత 'బిగ్ బాస్ హిందీ- సీజన్ 18'లో పాల్గొన్నా. ఈ సమయంలోనే నేను మినిమలిస్టిక్ లైఫ్ స్టైల్‌ను (పూర్తి నిడారంబరమైన జీవన విధానాన్ని) అనుసరించటం ప్రారంభించా. ఇంట్లో కూడా అతి తక్కువ వస్తువులు ఉండేవి. ఇంట్లోనే కాదు... వంటింట్లో కూడా అత్యవసరమైన మూడు పదార్థాలే ఉంచేదాన్ని. ఒకసారి రంజిత్ ముంబాయిలోని మా ఇంటికి వచ్చారు. నేను ఆ సమయంలో వేరే చోట ఉన్నా. ఆయనకు ఎందుకో సరదాగా వంట చేయాలని అనిపించింది. వంటింట్లోకి వెళ్లి చూశారు. గరం మసాలాతో సహా వంటకు అవసరమైన పదార్థాలేవీ లేవు. నాకు ఫోన్ చేసి... "ఇంట్లో ఏవీ లేవు. గరం మసాలా కూడా లేదు" అన్నారు. "నేను ఈ మధ్య వేటినీ వాడటం లేదు" అని సమాధానమిచ్చా. ఆయన "నీకు పిచ్చి పట్టింది" అన్నారు.



తమాషా సంఘటనలు అనేకం


నా వృత్తి జీవితంలో అనేక తమాషా సంఘటనలు ఉన్నాయి. 1995లో 'రఘువీర్' అనే సినిమా చేశాను. ఆ సినిమా షూటింగ్ కోసం కులుమనాలీ వెళ్లాం. ఈ లోపులో ముంబాయిలోని ఒక పత్రికలో నేను చనిపోయానని వార్త వచ్చిందిట. నేను ఆ వార్త చదవలేదు. నేను చనిపోయాననే వార్త చదివిన వారు... లోకేషన్‌లో నన్ను చూసి కంగారు పడ్డారు. నేను ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఆ వార్తను ముంబాయిలో అమ్మానాన్న చదివి చాలా ఆందోళన చెందారు. షూటింగ్ నుంచి హోటల్‌కు వెళ్లేసరికి వారి నుంచి 25 మిస్డ్ కాల్స్ ఉన్నాయి. అప్పుడు వాళ్లకు ఫోన్ చేసి... నేను క్షేమంగానే ఉన్నానని చెప్పాను. అయితే ఇక్కడ ఇంకో విషయాన్ని చెప్పాలి. ఈ పుకారును వ్యాప్తి చేసింది... నేను నటిస్తున్న సినిమా నిర్మాత గుల్షన్ కుమారే! సినిమా మీద ప్రేక్షకులకు ఆసక్తి రేకెత్తించటం కోసం ఈ పుకారు పుట్టించారు."




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
గ్లాస్‌హార్ట్	వెబ్‌సిరీస్	జూలై 31
తమ్ముడు	తెలుగు చిత్రం	ఆగస్టు 01
జియో హాట్‌స్టార్		
క్యుంకీ సాస్ భీ కభీ బహు థీ 2	హిందీ సిరీస్	జూలై 29
పతీ పత్నీ ఔర్ పంగా	హిందీ సిరీస్	ఆగస్టు 02
ఆపిల్ టీవీ ప్లస్		
చీఫ్ ఆఫ్ వార్	వెబ్‌సిరీస్	ఆగస్టు 01







వారు ఆలయాలను ఆస్తిగా భావిస్తారు

పురాతన ఆలయాల కోసం రెండు దేశాలు యుద్ధానికి దిగటం చరిత్రలో చాలా అరుదుగా జరుగుతుంది. థాయ్‌లాండ్, కంబోడియా శుక్రవారం పురాతన శివాలయాల కోసం దాడులకు తెగబడ్డాయి. ఈ శివాలయాలపై విస్తృతమైన పరిశోధనలు చేసిన లిడియా లక్ష్మీ ఈ దాడుల సమయంలో ఆ సమీప ప్రాంతంలోనే ఉన్నారు. ఉక్రెయిన్‌లో సైనికురాలిగా పని చేసి, ఆ తర్వాత ఆధ్యాత్మికవేత్తగా మారిన లిడియా మన దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు... థాయ్‌లాండ్, కంబోడియా, వియత్నాంలలో బ్రహ్మసూత్ర శివలింగాలపై పరిశోధనలు చేస్తున్నారు. ఆ శివాలయాల విశిష్టతను ఆమె 'నవ్య'కు వివరించారు.

శివాలయాల కోసం రెండు దేశాలు యుద్ధానికి దిగే పరిస్థితులు ఏర్పడటం అరుదుగా జరుగుతుంది. దీని వెనుక నేపథ్యమేమిటి?

ఈ ఆలయాలు థాయ్‌లాండ్‌లోని సురిన్ రాష్ట్రంలో ఉన్నాయి. ఈ రాష్ట్రం కంబోడియా-థాయ్‌లాండ్ సరిహద్దుల్లో ఉంటుంది. రెండు దేశాలకు చెందిన ప్రజలు ఈ ఆలయాలను తమ ఆస్తిగా భావిస్తారు. పరిరక్షించటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ ఆలయాల గురించి గతంలో కూడా ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి, చల్లారాయి. ఈ మధ్యనే పరిశోధనలు చేయటానికి నేను ఈ ఆలయాలకు వెళ్లాను. ఈ మూడు ఆలయాలు శైవ తంత్ర విద్యను అభ్యసించేవారికి చాలా ముఖ్యమైనవి. ఇక్కడ ఒక విషయాన్ని అందరికీ స్పష్టంగా చెప్పాలి. ఈ ఆధునిక యుగంలో 'తంత్ర' అంటే చాలా రకాల అపోహలు ఉన్నాయి. కానీ ఒకప్పుడు మన సంస్కృతిలో తంత్రశాస్త్రానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇదే విధంగా ఇప్పుడు భౌగోళిక విభజనల తర్వాత థాయ్‌లాండ్, కంబోడియా వేర్వేరు దేశాలుగా ఏర్పడ్డాయి కానీ ఒకప్పుడు ఈ ప్రాంతమంతా ఖమేర్ సామ్రాజ్యంలో భాగమే! ఒక విశేషమేమిటంటే - ఈ శాస్త్రాలన్నిటికీ పుట్టినిల్లు మన భారతదేశమే! ఇక్కడి నుంచి ఇతర దేశాలకు ఈ శాస్త్రాలను మన పూర్వీకులు తీసుకువెళ్లారు. అందుకే వీటన్నిటినీ కూడా మన సంస్కృతిలో భాగంగానే చూడాలి.



ఈ ఆలయాల ఆధ్యాత్మిక విశిష్టతను మరింతగా వివరిస్తారా?

ఈ మూడు ఆలయాలు ఆధ్యాత్మికంగా చాలా విశిష్టమైనవి. నేను వాటిని క్షుణ్ణంగా పరిశీలించాను. అక్కడ ధ్యానం చేశాను. ఈ ఆలయాలలో గొప్ప శక్తి ప్రసారం జరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం వీటిని కేవలం సరిహద్దుల వద్ద సైనికుల చెక్‌పోస్ట్‌లుగా కొందరు భావిస్తూ ఉండచ్చు. కానీ వీటి నిర్మాణం వెనుక నిగూఢమైన ఉద్దేశాలు ఉన్నాయి. ఉదాహరణకు... ప్రసాత్ టా మ్యుయెన్ థోమ్ దేవాలయాన్నే తీసుకుందాం. ఈ ఆలయ నిర్మాణం కౌల తంత్ర సంప్రదాయాల ప్రకారం జరిగింది. దీనిని కొండల మధ్య కొన్ని ప్రత్యేకమైన క్రతువుల నిర్వహణ కోసం ఉద్దేశించారు. సాధారణంగా అఘోర, భైరవ శక్తులు ఈ కొండలు, అడవులు ఉన్న చోట ఎక్కువగా ఉంటాయి. అందుకే ఈ తరహా ఆలయాలు కొండల అంచుల్లో, ఎక్కువ మంది చేరుకోవటానికి వీలు కాని అడవుల్లో ఉంటాయి. ఇలాంటి ఇంకో ఆలయం ప్రసాత్ తా క్రబే. ఇది స్వయంభూ శివాలయం. కుబ్జక తంత్ర, రుద్ర యమాల, మహానిర్వాణ తంత్ర అభ్యాసకులకు చాలా కీలకమైనది. ఒకప్పుడు ఈ ఆలయంలోకి అందరికీ ప్రవేశం ఉండేది కాదు. ఖమేర్ రాజపురోహితులు దీనిలో పూజలు నిర్వహించేవారు. ఇలా ఈ ఆలయాల గురించి అనేక విశేషాలు చెప్పవచ్చు.

మీరు ఈ ఆలయాలలోని శాసనాలను పరిశీలించారా? ఆ శాసనాలు ఏమి చెబుతున్నాయి?

సాధారణంగా శాసనాలలో దాతల గురించి, నిర్మాణం వెనుక ఉన్న ఉద్దేశం గురించి, నిర్మాణానికి అయిన ఖర్చు గురించి పేర్కొంటారు. కానీ ఖమేర్ శాసనాలలో వీటితో పాటుగా ఆలయానికి సంబంధించిన ఆధ్యాత్మిక విశేషాలు కూడా ఉంటాయి.
ఈ ఆలయాలలో అలాంటి కొన్ని శాసనాలు ఉన్నాయి. ఇవన్నీ ఖమేర్ భాషలో ఉన్నాయి. ఈ శాసనాలను పరిష్కరించేవారు కూడా చాలా తక్కువ మంది ఉన్నారు. వీటిని పరిష్కరించగలిగితే మనకు అనేక విషయాలు తెలుస్తాయి.

మీరు ఈ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు కదా... స్థానిక ప్రజల భావనలు ఎలా ఉన్నాయి?

ప్రపంచంలో ఎక్కడైనా ప్రజలు శాంతిని కోరుకుంటారు. ఇప్పుడు భౌగోళికంగా ఈ ప్రాంతం వేర్వేరు దేశాలలో ఉండవచ్చు. కానీ ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు ఒకటే! ఆచార, వ్యవహారాలు ఒకటే! ఈ ప్రాంతంలో ప్రజలకు ఈ దేవాలయాలంటే విపరీతమైన భక్తి శ్రద్ధలున్నాయి. వారు యుద్ధ వాతావరణాన్ని ఇష్టపడటం లేదు.



• సీవీఎల్ఎన్ ప్రసాద్

నోటి దుర్వాసన పోవాలంటే..

కొందరికి ఎప్పుడూ నోరు దుర్వాసన వస్తూ ఉంటుంది. దంతాలు, చిగుళ్ల సమస్యలు, సరిగ్గా బ్రష్ చేయకపోవడం, కొన్ని రకాల ఆహార పదార్థాలు తినడం.. వంటి కారణాలు కూడా దుర్వాసనకు కారణం. దీనివలన నలుగురిలో మాట్లాడడం చాలా ఇబ్బందికరంగా మారుతుంది. మరి ఈ దుర్వాసనను ఎలా తగ్గించుకోవచ్చో తెలుసుకుందాం..



- దంతాల మధ్యలో ఇరుక్కున్న ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- భోజనం తరువాత మర్చిపోకుండా నోటిని నీరుతో పుక్కిలించాలి. అలాగే రోజూ రెండుసార్లు పళ్లు తోముకోవాలి.
- నోటి దుర్వాసనకు ప్రధాన కారణం బ్యాక్టీరియా. ఉప్పు నీటితో నోటిని పుక్కిలిస్తే ఆ బ్యాక్టీరియాను నిర్మూలించవచ్చు.
- కొత్తిమీర, పుదీనా నమిలినా నోటి దుర్వాసన సమస్య తగ్గుతుంది.
- బేకింగ్‌సోడాలో యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు ఉన్నాయి. దీనిని మౌత్‌వాష్‌గా ఉపయోగించినా మంచి ఫలితాలు ఉంటాయి.
- యాపిల్, క్యారెట్, పుచ్చకాయ, పైనాపిల్ వంటి పళ్లు నోటి దుర్వాసన తగ్గించడంలో బాగా సహాయపడతాయి.
- నోరు పొడిబారడం కూడా దుర్వాసనకు కారణం. కాబట్టి తరచూ నీరు తాగుతూ నోరు ఆరిపోకుండా చూసుకోవాలి.




ఆ పూల అందాల వెనుక...

హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం... ఇలా ఏ నగరాన్నయినా తీసుకోండి. అక్కడ మార్కెట్లో మల్లెపూలు, కనకాంబరాలు కళకళలాడుతూ ఉంటాయి. ప్రతి రోజూ ఇళ్లలో పూజలు, శుభకార్యాల కోసం, అలాగే అందమైన జడల్లోకి అలంకరణల కోసం ఆ పూలు ఎక్కడి నుంచి వస్తున్నాయో, ఆ పూల సాగు వెనక ఎంత కష్టం ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించారా? ఒకప్పుడు ఎక్కడ పండిన పూలు ఆ ప్రాంతంలోనే లభించేవి. కానీ రవాణా వ్యవస్థ మెరుగుపడిన తర్వాత పూల సువాసనకు సరిహద్దులు చెరిగిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో... కొన్ని వందల ఎకరాల్లో మల్లె, కనకాంబరం పూలు సాగవుతున్నాయి. వాటి కథేమిటంటే...

బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల మండల ప్రాంతాలకు చెందిన మల్లె, కనకాంబరాల పూలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అక్కడ వందల ఎకరాల్లో పూల సాగు జరుగుతోంది. ఆ నేల ఆ పూల పెరుగుదలకు అనుకూలం. అందుకే ఆ ప్రాంతంలో వాటిని సాగుచేయటం సంప్రదాయంగా వస్తోంది. సాధారణంగా మల్లె, కనకాంబరాల మొక్కలు పదేళ్ల పాటు పువ్వులు పూస్తాయి. వీటి దిగుబడి వేసవిలో అధికంగా, శీతాకాలంలో ఒక మోస్తరుగా ఉంటుంది. వీటి డిమాండ్ కాలాలపై ఆధారపడి ఉంటుంది. వేసవిలో పూలు ఎక్కువగా అందుబాటులో ఉంటాయి కాబట్టి ధర తక్కువ ఉంటుంది. హోల్‌సేల్‌లో ఒక క్వింటాల్ పూల ధర 40 వేల రూపాయల దాకా ఉంటుంది. వర్షాకాలంలో ఈ ధర గణనీయంగా పెరుగుతుంది. శ్రావణ మాసం వచ్చేసరికి క్వింటాల్ రూ.75 వేల వరకూ చేరుతుంది.

మొక్క నుంచి కోసిన తర్వాత చల్లటి వాతావరణంలో ఉంచితే- మల్లె మొగ్గలు మూడు నుంచి నాలుగు రోజుల వరకు తాజాగా ఉంటాయి. కనకాంబరాలు అయితే ఒక రోజు మాత్రమే నిల్వ ఉంటాయి. కోసిన తర్వాత మల్లెపూలను మార్కెట్‌కు చేరుస్తారు. అక్కడి నుంచి అన్ని నగరాలకు చేరుకుంటాయి.



స్థానికంగా ఉపాధి...

ఒకసారి మొక్క బలంగా నాటుకున్న తర్వాత చీడ పీడలు రాకుండా మందులకు అయ్యే ఖర్చు మాత్రమే ఉంటుంది. దీనితో రైతుకు ఎక్కువ ఆదాయమే వస్తుంది. "ఈ పంట సాగు విషయంలో మాకు పెద్ద సమస్యలు ఉండవు. కానీ కొన్నిసార్లు ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి. ఉదాహరణకు ఎక్కువ వానలు పడినప్పుడు పూలను కోయటానికి వీలు కాదు. పండగలు, శ్రావణ మాసం లాంటి సమయాల్లో ఎక్కువ డిమాండ్ ఉంటుంది. కానీ అప్పుడు తగినన్ని పూలు అందుబాటులో ఉండవు. ఎక్కువ పూలు అందుబాటులోకి వచ్చే సమయానికి ధర పడిపోతుంది. అయితే ఏడాది మొత్తం సగటు ధర తీసుకుంటే లాభదాయకంగానే ఉంటుంది" అంటున్నారు ఈ పంటను సాగుచేస్తున్న కోట వెంకటలక్ష్మి. అయితే ఈ పూల సాగుదారులకు ప్రత్యేకంగా ప్రభుత్వ పథకాలేవీ లేవు. "మాకు ప్రత్యేక పథకాలు కల్పిస్తే అనేకమంది ఈ పూలను పండించటానికి ముందుకు వస్తారు. అప్పుడు ఇతర రాష్ట్రాలకు కూడా పూల ఎగుమతి పెంచవచ్చు" అని ఆమె చెబుతున్నారు. ఇక... సాధారణంగా పూలు కోసే పని స్థానిక మహిళలే చేస్తూ ఉంటారు. చూడటానికి ఈ పని తేలికగానే కనిపిస్తుంది. కానీ రోజంతా వంగి పూలు కోయటం వెనుక చాలా శ్రమ ఉంటుందంటారు వ్యవసాయ కూలీలు. "పూల దండలు కట్టడం ఒక కళ. అది చాలామందికి సహజంగానే వస్తుంది. అది పెద్ద శ్రమ అనిపించదు. కానీ ప్రతిరోజూ వేల పువ్వులను కోయటం అంత సులువు కాదు. కానీ ఇల్లు గడవాలంటే తప్పదు మరి" అంటున్నారు మరో సాగుదారైన చందన.



- తాళ్లూరి ప్రదీప్, చీరాల

స్పోర్ట్స్

గుంటూరు ● ఆదివారం 27 జూలై 2025



తన్వి, వెన్నెలకు కాంస్యాలే

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్



సోలో (ఇండోనేసియా): తెలుగు షట్లర్ వెన్నెల కలగొట్ల, తన్వీ శర్మ ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను కాంస్య పతకాలతో ముగించారు. శనివారం జరిగిన సెమీఫైనల్లో వెన్నెల 15-21, 18-21తో లూ సియా (చైనా) చేతిలో పోరాడి ఓడింది. మరో సెమీస్‌లో రెండో సీడ్ తన్వీ శర్మ 13-21, 14-21తో ఎనిమిదో సీడ్ యిన్ యీ కింగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూసింది. కాగా, ఒకే టోర్నీలో ఇలా మహిళల సింగిల్స్‌లో రెండు పతకాలు లభించడం భారత్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

సెప్టెంబరు 9 నుంచి ఆసియా కప్

14, 21న ఇండో-పాక్ మ్యాచ్‌లు



కరాచీ/న్యూఢిల్లీ: పురుషుల ఆసియా కప్ టీ20 టోర్నమెంట్ సెప్టెంబరు 9 నుంచి 28 వరకు యూఏఈ వేదికగా జరగనుంది. ఈ విషయాన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహిసిన్ నఖ్వీ శనివారం వెల్లడించాడు. ప్రధాన ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూపు నుంచి తలపడనున్నాయి. ఈ రెండు జట్ల మధ్య సెప్టెంబరు 14న దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో మ్యాచ్ జరగనుంది. ఆపై సూపర్ ఫోర్‌లో భాగంగా సెప్టెంబరు 21న భారత్-పాక్ మరోసారి ఢీకొంటాయి. ఇక..రెండు జట్లు కనుక ఫైనల్‌కు చేరితే ముచ్చటగా మూడోసారి తలపడతాయి. ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విడదీశారు. ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు సూపర్-4కి చేరతాయి. సూపర్-4లో ప్రతి జట్టు మిగిలిన మూడు జట్లతో తలపడుతుంది. సూపర్-4 నుంచి రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. సెప్టెంబరు 10న యూఏఈతో జరిగే మ్యాచ్‌తో టోర్నీని టీమిండియా ఆరంభిస్తుంది. 19న ఒమన్‌తో తలపడుతుంది. భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరిగే అవకాశముంది.

గ్రూప్ ఎ: భారత్, పాకిస్థాన్, ఒమన్, యూఏఈ.
గ్రూప్ బి: శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, హాంకాంగ్.



శ్రీజ..రన్నరప్‌తో సరి

లాగోస్ (నైజీరియా): తెలుగమ్మాయి ఆకుల శ్రీజ డబ్ల్యూటీటీ కంటెండర్ లాగోస్ టేబుల్ టెన్నిస్ ఈవెంట్‌లో రన్నరప్‌గా నిలిచింది. సింగిల్స్ ఫైనల్లో హషిమొటో (జపాన్) 4-1తో శ్రీజను ఓడించింది. కాగా, పురుషుల డబుల్స్ టైటిల్‌ను భారత జోడీ సాతియన్ గుణశేఖరన్/ఆకాశ్ పాల్ దక్కించు కుంది. ఫైనల్లో సాతియన్ ద్వయం 3-1తో ఫ్రాన్స్ జంట లియో డి/జులెస్‌పై నెగ్గింది.

సాత్విక్ జోడీ పరాజయం

చాంగ్జౌ: సాత్విక్ సాయి రాజ్/చిరాగ్ శెట్టి జోడీకి చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో చుక్కెదురైంది. ఈ భారత డబుల్స్ టాప్ జంట సెమీఫైనల్లో పరాజయం పాలైంది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్ ద్వయం 13-21, 17-21తో రెండోసీడ్ జంట ఆరోన్ చియా/సో వూయి యిక్ (మలేసియా) చేతిలో చిత్తయింది. ఈ జోడీ ఓటమితో టోర్నీలో భారత్ కథ పూర్తిగా ముగిసింది.

కివీస్‌దే 'ముక్కోణ'ం

హరారే: టీ20 ముక్కోణపు సిరీస్ టైటిల్‌ను న్యూజిలాండ్ సొంతం చేసుకొంది. చివరి ఓవర్‌లో దక్షిణాఫ్రికా విజయానికి 7 పరుగులు అవసరమవగా.. దూకుడు మీదున్న బ్రెవిస్ (31)ను అవుట్ చేసిన హెన్రీ (2/19) మూడు పరుగుల తేడాతో కివీస్‌ను గెలిపించాడు. ఫైనల్లో తొలుత కివీస్ 20 ఓవర్లలో 180/5 స్కోరు చేసింది. రచిన్ (47), కాన్వే (47), సీఫెర్ట్ (30) రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా ఓవర్లన్నీ ఆడి 177/6 స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్లు ప్రిటోరియస్ (51), హెండ్రిక్స్ (37) తొలి వికెట్‌కు 92 పరుగుల ధనాధన్ భాగస్వామ్యంతో గెలుపునకు బాటలు వేశారు. డెత్ ఓవర్లలో బ్రెవిస్ వేగంగా ఆడడంతో సౌతాఫ్రికా నెగ్గుతుందనిపించింది. కానీ, ఆఖర్లో హెన్రీ మాయాజాలంతో.. దక్షిణాఫ్రికా గెలుపు వాకిట బోల్తా పడింది.

నిలబెడతారా!

రాహుల్, గిల్ అజేయ అర్ధసెంచరీలు ● పోరాడుతున్న టీమిండియా

● రెండో ఇన్నింగ్స్ 174/2 ● ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 669

● బెన్ స్టోక్స్ సెంచరీ ● నాలుగో టెస్టు



కేఎల్ రాహుల్ (87 బ్యాటింగ్)

గిల్ (78 బ్యాటింగ్)

మాంచెస్టర్: నాలుగో టెస్టులో ఇంగ్లండ్‌కు దక్కిన ఆధిక్యం 311. అటు రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ సున్నాకే రెండు వికెట్లు కోల్పోవడంతో ఆఖరి సెషన్ వరకైనా నిలుస్తుందా? అనిపించింది. కానీ ఓపెనర్ కేఎల్ రాహుల్ (210 బంతుల్లో 8 ఫోర్లతో 87 బ్యాటింగ్), కెప్టెన్ గిల్ (167 బంతుల్లో 10 ఫోర్లతో 78 బ్యాటింగ్) మాత్రం పట్టువదలని పోరాటంతో అబ్బుర పరిచారు. రెండు సెషన్లపాటు ఓపిగ్గా క్రీజులో నిలిచి భారత్ డ్రాపై ఆశలను సజీవంగా నిలిపారు. దీంతో శనివారం నాలుగో రోజు ఆట ముగిసేసరికి భారత్ 63 ఓవర్లలో 174/2 స్కోరు చేసింది. ఇంకా జట్టు 137 రన్స్ వెనుకబడి ఉండగా.. చేతిలో ఎనిమిది వికెట్లున్నాయి. గెలుపు అసాధ్యమే కనుక చివరి రోజు మూడు సెషన్లపాటు ఆతిథ్య జట్టు బౌలర్లను భారత్ సమర్థవంతంగా ఎదుర్కొంటుందా? అనేది ఆసక్తికరంగా మారింది. అటు పంత్ బ్యాటింగ్‌పైనా స్పష్టత రావాల్సి ఉంది. అంతకుముందు బెన్ స్టోక్స్ (141) శతక సహాయంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులు చేసింది. కార్స్ (47) రాణించాడు. జడేజాకు నాలుగు.. సుందర్, బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి.

అద్భుత భాగస్వామ్యం: 544/7 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజును ఆరంభించిన ఇంగ్లండ్ దాదాపు సెషన్ పూర్తిగా ఆడి మిగిలిన మూడు వికెట్లను కోల్పోయింది. కానీ ఆలోపే కెప్టెన్ స్టోక్స్ శతకంతో పాటు కార్స్ ధాటికి మరో 125 పరుగులు జత చేరాయి. ఈ జోడీ మధ్య తొమ్మిదో వికెట్‌కు 95 పరుగులు జత చేరడం విశేషం. దీంతో స్కోరు 600 దాటడంతో పాటు ఆధిక్యం 311కి చేరి భారత్ ముందు కఠిన సవాల్‌ను ఉంచింది. పేసర్లు బుమ్రా, సిరాజ్ ఈసారి కాస్త మెరుగ్గానే బౌలింగ్ చేసినా ఇంగ్లండ్ జోరును కట్టడి చేయలేకపోయారు. డాసన్ (26) నిష్క్రమించాక కార్స్ అండతో స్టోక్స్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. సిరాజ్ ఓవర్‌లో ఫోర్‌తో అతడు రెండేళ్ల తర్వాత శతకం అందుకున్నాడు. స్పిన్నర్లు సుందర్, జడేజా ఓవర్లలో ఒక్కో ఫోర్, సిక్సర్‌తో ధాటిని కనబర్చాడు. అటు కార్స్ కూడా వేగంగా ఆడి తన వంతు సహకారం అందించాడు. చివరకు జడేజా తన వరుస ఓవర్లలో స్టోక్స్, కార్స్‌లను అవుట్ చేసి ఇంగ్లండ్ అద్భుత ఇన్నింగ్స్‌ను ముగించాడు.



స్టోక్స్ (141)

0/2 నుంచి కోలుకుని..: లంచ్ విరామానికి 15 నిమిషాల ముందు భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. కానీ తొలి ఓవర్‌లోనే పేసర్ వోక్స్ వరుస బంతుల్లో ఓపెనర్ జైస్వాల్, సుదర్శన్‌లను డకౌట్ చేసి గట్టి షాక్ ఇచ్చాడు. అప్పటికి జట్టు పరుగుల ఖాతా కూడా తెరువలేదు. కానీ ఆ తర్వాత ఓపెనర్ రాహుల్, కెప్టెన్ గిల్ నిలకడైన ఆటతీరుతో అండగా నిలిచారు. దీంతో వేగంగా వికెట్లు తీద్దామనుకున్న ఇంగ్లండ్ బౌలర్ల ఆశలు ఆవిరయ్యాయి. స్టోక్స్ బౌలింగ్‌కు దూరంగా ఉండడం కూడా లాభించింది. కానీ లంచ్ బ్రేక్ తర్వాత ఆరంభంలో పేసర్లు వోక్స్, ఆర్చర్ తమ పదునైన బంతులతో వణికించారు. ముఖ్యంగా ఆర్చర్‌ను ఎదుర్కొనేందుకు గిల్ ఇబ్బందిపడ్డాడు. అతడి ఇన్‌స్వింగర్‌కు అంపైర్ కాల్‌తో బతికిపోయాడు. కానీ ఆ తర్వాత నిలదొక్కుకుని చక్కటి డ్రైవ్ షాట్లతో ఆకట్టుకున్నాడు. 46 పరుగుల వద్ద స్లిప్‌లో డాసన్ క్యాచ్ వదిలేయడం గిల్‌కు కలిసివచ్చింది. దీంతో అతను హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. మరో ఎండ్‌లో రాహుల్ అభేద్య డిఫెన్స్‌తో సహకరించాడు. రెండో సెషన్‌లో జట్టు 85 పరుగులు చేసింది. ఇక ఆఖరి సెషన్‌లో గిల్ కాస్త నెమ్మదించినా, రాహుల్ సాధికారికంగా ఆడి అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆర్చర్‌ను లక్ష్యంగా చేసుకుని తను బౌండరీలు రాబట్టాడు. చివరకు తమ వికెట్లను కాపాడుకుంటూ రోజును ముగించారు.

1

ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్‌లో ఎక్కువ పరుగులు (697*) సాధించిన ఆసియా బ్యాటర్‌గా గిల్. మహ్మద్ యూసుఫ్ (2006లో 631)ను అధిగమించాడు.

● ఓ ఇన్నింగ్స్‌లో వందకు పైగా పరుగులు సమర్పించుకోవడం బుమ్రాకిదే తొలిసారి.

● టెస్టుల్లో ఓ జట్టు సున్నాకే రెండు వికెట్లు కోల్పోయినా మూడో వికెట్‌కు అధిక భాగస్వామ్యం (174*) నమోదు చేసిన జోడీగా గిల్-రాహుల్.

● ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో అత్యధిక స్కోరు (669) సాధించిన జట్టుగా ఇంగ్లండ్.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 358; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రాహుల్ (బి) జడేజా 84, డకెట్ (సి/సబ్) జురెల్ (బి) అన్షుల్ 94, పోప్ (సి) రాహుల్ (బి) సుందర్ 71, రూట్ (స్టంప్ సబ్) జురెల్ (బి) జడేజా 150, బ్రూక్ (స్టంప్ సబ్) జురెల్ (బి) సుందర్ 3, స్టోక్స్ (సి) సుదర్శన్ (బి) జడేజా 141, స్మిత్ (సి సబ్) జురెల్ (బి) బుమ్రా 9, డాసన్ (బి) బుమ్రా 26, వోక్స్ (బి) సిరాజ్ 4, కార్స్ (సి) సిరాజ్ (బి) జడేజా 47, ఆర్చర్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 38; మొత్తం: 157.1 ఓవర్లలో 669 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-166, 2-197, 3-341, 4-349, 5-499, 6-515, 7-528, 8-563, 9-658, 10-669; **బౌలింగ్:** బుమ్రా 33-5-112-2, అన్షుల్ 18-1-89-1, సిరాజ్ 30-4-140-1, శార్దూల్ 11-0-55-0, జడేజా 37.1-0-143-4, సుందర్ 28-4-107-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) వోక్స్ 0, రాహుల్ (బ్యాటింగ్) 87, సుదర్శన్ (సి) బ్రూక్ (బి) వోక్స్ 0, గిల్ (బ్యాటింగ్) 78, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 63 ఓవర్లలో 174/2; వికెట్ల పతనం:** 1-0, 2-0; **బౌలింగ్:** వోక్స్ 15-3-48-2, ఆర్చర్ 11-2-40-0, కార్స్ 10-2-29-0, డాసన్ 22-8-36-0, రూట్ 5-1-17-0.



హోరాహోరీ

హంపి - దివ్య తొలి గేమ్ డ్రా

మహిళల చెస్ ప్రపంచ కప్ ఫైనల్

బటూమి (జార్జియా): మహిళల ప్రపంచ చెస్ ఫైనల్ తొలి గేమ్ ఊహించినట్టుగానే హోరాహోరీగా సాగింది. వెటరన్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి-యువ సంచలనం దివ్యా దేశ్‌ముఖ్ నడుమ శనివారం మూడు గంటలపాటు జరిగిన క్లాసికల్ మొదటి గేమ్ 41 ఎత్తుల తర్వాత డ్రాగా ముగిసింది. ఫలితంగా హంపి, దివ్య చెరో అర పాయింట్‌తో సమంగా నిలిచారు. ఆదివారం రెండో గేమ్ జరగనుంది. ఈ గేమ్‌లో ఫలితం వస్తే సరి..లేదంటే విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేకర్ నిర్వహిస్తారు. ఇక మూడో స్థానం కోసం తలపడుతున్న చైనా గ్రాండ్‌మాస్టర్లు లీ టింగ్జి-టాన్ జోంగ్యి కూడా తొలి గేమ్‌ను డ్రాగా ముగించి చెరో అర పాయింటు పంచుకున్నారు. వీరిద్దరి రెండో గేమ్‌కూడా ఆదివారం జరుగుతుంది. రెండుసార్లు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్ హంపి నల్లపావులతో డ్రా చేసుకోవడంతో రెండో గేమ్‌లో ఆమె తెల్లపావులతో ఆడనుంది. ఇది..38 ఏళ్ల తెలుగు గ్రాండ్‌మాస్టర్‌కు అనుకూలించనుంది. ఇక..హంపితో మొదటి గేమ్‌లో తెల్లపావులతో క్వీన్స్ గాంబిట్ ఓపెనింగ్‌తో దివ్య పోటీని ప్రారంభించింది. వినూత్నమైన ఎత్తులతో ఆరంభంలో పైచేయి సాధించింది. అయితే క్వీన్, రూక్‌తో హంపి ఎదురు దాడికి దిగింది. తొలి గంటలో..ఎత్తులు వేసేందుకు 19 ఏళ్ల ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య సుదీర్ఘ సమయం తీసుకుంది. దాంతో సమయభావంతో ఆమె ఒత్తిడికి లోనైంది.. మరోవైపు హంపి ప్రశాంతంగా..వ్యూహాత్మక ఎత్తులతో పట్టుబిగించింది. ఇద్దరూ ఎత్తులకు పైఎత్తులు వేయడంతో మిడిల్ గేమ్‌కొచ్చే సరికి పోరు రసవత్తరంగా మారింది. ఇక..ఎండ్ గేమ్‌లో అటు హంపి, ఇటు దివ్యకు గెలుపు అవకాశాలు కనిపించాయి. కానీ ఎవరూ రిస్క్ తీసుకొనేందుకు ప్రయత్నించలేదు. దాంతో ఇద్దరూ డ్రాగా ముగించేందుకు మొగ్గు చూపారు.

టిమ్ డేవిడ్ మెరుపు శతకం

టీ20 సిరీస్ ఆసీస్ వశం



బస్సెటెర్రీ (సెయింట్ కిట్స్): ఆస్ట్రేలియా తరపున టిమ్ డేవిడ్ (37 బంతుల్లో 6 ఫోర్లు, 11 సిక్సర్లతో 102 నాటౌట్) వేగవంతమైన శతకం నమోదు చేశాడు. దీంతో వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను ఆసీస్ మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో సొంతం చేసుకొంది. శుక్రవారం జరిగిన మూడో టీ20లో కంగారూలు 6 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేశారు. తొలుత విండీస్ 20 ఓవర్లలో 214/4 స్కోరు చేసింది. కెప్టెన్ షాయ్ హోప్ (102 నాటౌట్) అజేయ సెంచరీతో, బ్రెండన్ కింగ్ (62) అర్ధ శతకంతో రాణించారు. కాగా, ఛేదనలో టిమ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆసీస్ 16.1 ఓవర్లలోనే 4 వికెట్లకు 215 పరుగులు చేసి గెలిచింది. టిమ్ డేవిడ్‌కిది పొట్టి ఫార్మాట్‌లో తొలి సెంచరీ కావడం విశేషం.

ఎరువులు, పురుగు మందుల వ్యాపారాల్లో

జీఎస్‌టీ ఎలా?

ఇదీ GST



రాంబాబు గొండాల

మన దేశంలో ఇతర వ్యాపారాలతో పోల్చితే ఎరువులు, పురుగు మందుల వ్యాపారం కొంత భిన్నమైంది. మిగతా వ్యాపారాల్లో వినియోగదారులు అన్ని రకాల వారు ఉండగా ఈ వ్యాపారంలో అంతిమ వినియోగదారులు రైతులు మాత్రమే. అంతేకాకుండా ఇది సీజనల్ వ్యాపారం. అంటే సంవత్సరం మొత్తం నడవదు. ఎక్కువగా అరువు మీద వ్యాపారం నడుస్తుంది. అంటే రైతులు తాము కొన్న ఎరువులు లేదా పురుగు మందులకు సంబంధించిన డబ్బులు పంట వచ్చిన తర్వాత ఇస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఈ వ్యాపారానికి సంబంధించి జీఎస్‌టీ గురించిన జాగ్రత్తలు ఏమిటి? పద్దు పుస్తకాలు ఎలా నిర్వహించలి? మొదలైన విషయాలు మీకోసం..

ఒకప్పుడు జిల్లా, మండల కేంద్రాల్లోనే ఈ దుకాణాలు ఉండగా ఇప్పుడు చిన్న గ్రామాల్లో కూడా ఉంటున్నాయి. రైతులు.. ముఖ్యంగా చిన్న,సన్నకారు రైతులు సీజన్ ప్రారంభంలో అరువు మీద ఎరువులు తెచ్చుకుని పంట వచ్చిన తర్వాత దుకాణదారులకు చెల్లిస్తారు. అంటే దుకాణదారులకు ఆ పైకం ఆలస్యంగా అందుతుంది. కాబట్టి ఈ దుకాణదారులు కూడా హోల్‌సేల్ వ్యాపారులకు, అలాగే హోల్‌సేల్ వ్యాపారులు కంపెనీలకు ఆలస్యంగా డబ్బులు చెల్లిస్తుంటారు. ఇంకా వివరంగా చెప్పాలంటే, కంపెనీలు సీజన్ ప్రారంభంలో ఎక్కువ సరుకును హోల్‌సేల్ వ్యాపారులకు పంపిస్తారు. సదరు సరుకును అమ్ముకోవటానికి హోల్‌సేల్ వ్యాపారులకు సాధ్యమైనంత మేర గడువు ఇస్తుంది. అంటే ఈ సరుకుకు సంబంధించిన మొత్తాన్ని ఆలస్యంగా చెల్లించే వెసులుబాటు ఈ వ్యాపారులకు ఉంటుంది. కాబట్టి వీరు కూడా ఇదే పద్ధతిలో రిటైల్ వ్యాపారులకు సరుకును ఇస్తుంటారు.

ఈ వ్యాపారంలో ఉన్న మరొక ముఖ్య విషయం ఏమిటంటే కంపెనీలు ఎక్కువగా సరుకును హోల్‌సేల్ వ్యాపారులకు పంపిస్తుందని చెప్పుకున్నాం కదా. మరి అంత సరుకు అమ్ముడు పోక పోతే ఏమి చేయాలి? అందుకే అమ్ముడుపోని సరుకుని కొంత కాలం తర్వాత వెనక్కు తీసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఇదే పద్ధతిలో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య కూడా ఉంటుంది. అంటే, మిగతా వ్యాపారులతో పోలిస్తే ఇక్కడ రెండు రకాల సమస్యలు ఉన్నాయి. ఒకటి సరుకు వెనక్కి పంపించటం, అలాగే కొనుగోలుకు సంబంధించిన సొమ్ము ఆలస్యంగా చెల్లించటం.

మరి ఈ విధానంలో జీఎస్‌టీకి సంబంధించి సమస్యలు ఏమిటంటే, ఒక వ్యాపారి తాను పొందిన సరుకు మీద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందినప్పుడు ఇన్వాయిస్ తేదీ నుంచి 180 రోజుల లోపు అమ్మకందారునికి ఆ సరుకు తాలుకూ మొత్తం పన్నుతో సహా కలిపి చెల్లించాలి. అలా చెల్లించని పక్షంలో తీసుకున్న ఐటీసీ చెల్లుబాటు కాదు. కాబట్టి దాన్ని రివర్స్ చేసి తిరిగి ఎప్పుడైతే ఆ మొత్తం చెల్లిస్తాడో అప్పుడు ఆ క్రెడిట్ తిరిగి తీసుకోవాలి. ముందు చెప్పినట్లుగా ఈ వ్యాపారంలో ఎక్కువ సందర్భాల్లో 6 నెలలకు మించి గడువు ఇస్తుంటారు.

అలాంటప్పుడు సంబంధిత నిబంధనల ప్రకారం ఐటీసీ మొత్తం రివర్స్ చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇన్వాయిస్ తేదీ నుంచి రివర్స్ చేయాల్సిన తేదీ వరకు తీసుకున్న ఐటీసీ మొత్తం వడ్డీ చెల్లించాలి. ఉదాహరణకు సరుకు తీసుకున్న ఇన్వాయిస్ తేదీ జనవరి 1 అనుకుంటే గరిష్ఠంగా జూన్ 29 లేదా 30 వరకు ఈ 180 రోజుల గడువు పూర్తవుతుంది. ఇన్వాయిస్ విలువ మొత్తం మీద రూ.లక్ష. దానిమీద ఐటీసీ రూ.18,000 అనుకుంటే మొత్తం రూ.1,18,000 ఈ తేదీ లోపులో చెల్లించి ఉండాలి. లేని పక్షంలో ఐటీసీ కింద తీసుకున్న రూ.18,000 దాంతో పాటుగా జనవరి 1 నుంచి వడ్డీ (18 శాతం) చొప్పున చెల్లించాలి. ఒకవేళ 180 రోజుల లోపు కొంత మొత్తం చెల్లించి ఉంటే, చెల్లించని భాగానికి సంబంధించిన ఐటీసీపై లెక్క ప్రకారం రివర్స్ చేయాల్సి ఉంటుంది వడ్డీతో సహా.

ఇక సరుకు వెనక్కి పంపేటప్పుడు అంటే ఒక హోల్‌సేల్ వ్యాపారి నుంచి పొందిన సరుకును రిటైల్ వ్యాపారి వెనక్కు పంపుతుంటే కొన్ని సందర్భాల్లో రిటైల్ వ్యాపారి డెబిట్ నోట్ జారీ చేస్తుంటాడు. ఇది తప్పు. క్రెడిట్ నోట్ లేదా డెబిట్ నోట్‌ను వాస్తవంగా సరుకు ఎవరైతే పంపారో వారే ఇవ్వాలి. అంటే ఈ సందర్భంలో సరుకు పంపింది హోల్‌సేల్ వ్యాపారి కాబట్టి ఇలా వెనక్కు వచ్చే సరుకు మేరకు ఒక క్రెడిట్ నోట్ రిటైల్ వ్యాపారికి తనే జారీ చేయాలి. క్రెడిట్ నోట్‌లో ఉన్న మొత్తం ఆ హోల్‌సేల్ వ్యాపారి తదుపరి రిటర్న్‌లో తగ్గించుకోవచ్చు. ఇలా చేయాలంటే రెండు నిబంధనలు ఉన్నాయి.

మొదటిది.. సదరు రిటైల్ వ్యాపారి తాను వెనక్కు పంపే సరుకుకు సంబంధించిన ఐటీసీ రివర్స్ చేయాలి. అలాగే హోల్‌సేల్ వ్యాపారి తగ్గింపు చేసుకోవటం అనేది ఇన్వాయిస్ ఇచ్చిన తదుపరి ఆర్థిక సంవత్సరం నవంబరు 30 లోపులోనే చేసుకోవాలి. ఉదాహరణకు 2024 జనవరి 1న ఇన్వాయిస్ జారీ చేసి ఉంటే గరిష్ఠంగా 2024 నవంబరు 30 లోపు మాత్రమే క్రెడిట్ నోట్ మీద తగ్గింపు సాధ్యమవుతుంది.

ఇందులో ఇంకొక పద్ధతి ఏమిటంటే సరుకు వెనక్కు పంపే వ్యక్తి అంటే రిటైల్ వ్యాపారి తాను వెనక్కు పంపే సరుకును అమ్మకం కింద చూపిస్తూ హోల్‌సేల్ వ్యాపారి పేరు మీద ఒక ఇన్వాయిస్ జారీ చేయవచ్చు. అప్పుడు ఆ ఇన్వాయిస్‌కు సంబంధించిన ట్యాక్స్ రిటైల్ వ్యాపారి తాను రిటర్న్‌లో చూపిస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా.. హోల్‌సేల్ వ్యాపారి ఆ మొత్తానికి సంబంధించిన ఐటీసీ తీసుకోవచ్చు. అంటే ఇక్కడ రిటైల్ వ్యాపారి అమ్మకందారుడు, హోల్‌సేల్ వ్యాపారి కొనుగోలుదారుడిగా భావించాలి. సంబంధిత నియమ నిబంధనలను ఇద్దరూ పాటించాలి. అలాగే ఇవే నిబంధనలు హోల్‌సేల్ వ్యాపారి నుంచి కొనుగోలు చేసేటప్పుడు, తిరిగి వెనక్కు పంపేటప్పుడు వర్తిస్తాయి.

ఇంకొక సాధారణ విషయం, సాధారణంగా రిటైల్ వ్యాపారులు.. రైతుల నుంచి సరుకుకు సంబంధించి ఆలస్యాన్ని బట్టి వడ్డీ వసూలు చేస్తుంటారు. ఇలాంటప్పుడు ఆ వడ్డీ మీద కూడా పన్ను చెల్లించాలి. అంటే ఆ సరుకుకు ఎంత శాతం పన్ను వర్తిస్తుందో అంత శాతం ఈ వడ్డీ మీద కూడా చెల్లించాలి. ఈ నిబంధన కూడా కేవలం రిటైల్ వ్యాపారులకే కాకుండా అమ్మిన సరుకుకు సంబంధించి వడ్డీ, పెనాల్టీ ఎవరైతే వసూలు చేస్తారో వారందరికి వర్తిస్తుంది.

ముందుగా చెప్పినట్లు ఈ వ్యాపారంలో ఉండే వారు జీఎస్‌టీ మీద సరైన అవగాహన పెంపొందించుకోవాలి. ముఖ్యంగా హోల్‌సేల్ వ్యాపారులు.. మండల, గ్రామీణ స్థాయిలో ఉండే వ్యాపారులకు సరైన అవగాహన కల్పిస్తే ఇద్దరికీ ఇబ్బంది లేకుండా ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్



దేశంలో వడ్డీ రేట్లు పడిపోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు ఒక శాతం తగ్గించింది. దీంతో బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై వడ్డీ రేట్లు కుదిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీనియర్ సిటిజన్ల పరిస్థితి ఏంటి? స్థిర ఆదాయం కోసం వారు వేటిని ఆశ్రయిస్తే మంచిది. ఆ వివరాలు మీకోసం..

స్థిర ఆదాయానికి భరోసా..

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్

జూన్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీంతో వచ్చే నెలలో జరిగే ద్రవ్య పరపతి విధాన సమీక్ష (ఎంపీసీ) భేటీలో ఆర్‌బీఐ కీలక రెపో వడ్డీ రేటును మరింత తగ్గించే సూచనలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే బ్యాంకులు ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు మరింత తగ్గించడం ఖాయం. ఇప్పటికే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు తప్ప ఏ బ్యాంక్ కూడా సీనియర్ సిటిజన్లతో పాటు ఎవరికీ వారి ఎఫ్‌డీలపై 8 శాతానికి మించి వడ్డీ చెల్లించడం లేదు.

ఏమిటి మార్గం?

వడ్డీ రేట్లు తగ్గుతున్న ఈ పరిస్థితుల్లో సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్) ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఈ పథకం కింద చేసిన డిపాజిట్లపై 8.2 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నారు. పోస్టాఫీసుల్లో పొదుపు ఖాతా ఉన్న వారికి ఈ ఎస్‌సీఎస్ఎస్ అందుబాటులో ఉంటుంది. లేదంటే కొత్తగా ఖాతా తెరవవచ్చు. అయితే ఈ వడ్డీ రేటును ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి సవరించే అవకాశం ఉంది. అయినా బ్యాంక్ ఎఫ్‌డీలతో పోలిస్తే ఎస్‌సీఎస్ఎస్ సురక్షితమైన, స్థిర ఆదాయ పెట్టుబడి అని చెప్పవచ్చు.

అర్హతలు

ఎస్‌సీఎస్ఎస్ అందరికీ వర్తించదు. 60 సంవత్సరాలు నిండిన భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుంది. ప్రత్యేక లేదా సాధారణ వీఆర్ఎస్ తీసుకున్న వ్యక్తులు, రిటైర్ అయిన సైనిక సిబ్బంది వయస్సు 60 ఏళ్ల కంటే తక్కువ ఉన్నా.. ఈ పథకానికి అర్హులే.

పెట్టుబడుల పరిమితి

ఈ పథకంలో ఏటా కనీసం రూ.1,000, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు మదుపు చేయవచ్చు. అదే పదవీ విరమణ చేసిన వారయితే తమ రిటైర్మెంట్ మొత్తం లేదా రూ.30 లక్షలు.. ఇందులో ఏది తక్కువైతే దాన్ని పెట్టుబడిగా ఆమోదిస్తారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు అందిన నెల రోజుల్లోపే ఈ పెట్టుబడి పూర్తి చేయాలి.

పన్ను ప్రయోజనాలు

ఎస్‌సీఎస్ఎస్ డిపాజిట్లపై ఆదాయ పన్ను (ఐటీ) చట్టం కింద పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ఈ పథకంలో ఏటా చేసే డిపాజిట్లలో రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీ కింద ఆదాయ మినహాయింపు లభిస్తుంది. వడ్డీ ఆదాయానికి మాత్రం ఎలాంటి పన్ను మినహాయింపు ఉండదు. అయితే సెక్షన్ 80 టీటీబీ కింద సీనియర్ సిటిజన్లు వడ్డీ ఆదాయంలోనూ రూ.50,000 వరకు పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

వడ్డీ చెల్లింపు

ఎస్‌సీఎస్ఎస్ డిపాజిట్లపై వడ్డీని మూడు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తారు. దీనివల్ల సీనియర్ సిటిజన్లకు మార్కెట్ ఆటుపోట్లతో సంబంధం లేకుండా స్థిరమైన ఆదాయం అందుతుంది.

భద్రత

ఎస్‌సీఎస్ఎస్.. బ్యాంక్ ఎఫ్‌డీల కంటే సురక్షితమైనది. ఎందుకంటే ఈ పథకం అసలు, వడ్డీ చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అందుకే జీవిత చరమాంకంలో ఉన్న పండుటాకులకు, ఇది అత్యంత భద్రతతో కూడిన పెట్టుబడిగా చెబుతారు.

అకౌంట్ క్లోజింగ్

ఈ పథకం కాలపరిమితి ఐదేళ్లు. కావాలంటే మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. పాస్‌బుక్, అప్లికేషన్ ఫారం పూర్తి చేసి పోస్టాఫీస్‌లో ఇస్తే.. అప్పటి వరకు మన ఖాతాలో జమ అయిన మొత్తాన్ని ఖాతాదారుడికి చెల్లిస్తారు.

ముందే మరణిస్తే?

ఒకవేళ ఖాతాదారుడు మెచ్యూరిటీకి ముందే మరణిస్తే.. చనిపోయిన తేదీ నుంచి పోస్టాఫీస్ పొదుపు ఖాతాపై చెల్లించే వడ్డీ రేటు చెల్లిస్తారు. చనిపోయిన వ్యక్తి ఎస్‌సీఎస్ఎస్ ఖాతా తెరిచేటప్పుడే జీవిత భాగస్వామిని జాయింట్ హోల్డర్ లేదా నామినీగా పేర్కొంటే పథకం మెచ్యూరిటీ వరకు అదే వడ్డీ రేటు కొనసాగుతుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,930 ▼	91,600 ▼	1,26,000 ▼
విజయవాడ	1,01,250 ▼	96,000 ▼	1,16,500 ▼
విశాఖపట్నం	99, 930 ▼	91,600 ▼	1,26,000 ▼
రాజమండ్రి	99, 930 ▼	91,600 ▼	1,18,000 ▼
ప్రొద్దుటూరు	98,600 ▼	90,710 ▼	1,15,800 ▼
ముంబై	98,390 ▼	90,120 ▼	1,14,340 ▼

పబ్లిక్ ఇష్యూకు నెఫ్రోప్లస్

హైదరాబాద్ కేంద్రంగా నెఫ్రోప్లస్ పేరుతో డయాలసిస్ సేవలందిస్తోన్న నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఐపీఓలో భాగంగా రూ.353.4 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.27 కోట్ల ఈక్విటీ షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనుంది. మొత్తంగా ఐపీఓ ద్వారా రూ.2,000 కోట్లకు పైగా సమీకరించనున్నట్లు తెలిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	475
వరంగల్	427	గోదావరి	455
చిత్తూరు	503	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	


ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	113
కర్నూలు	115	నెల్లూరు	118
విశాఖపట్నం	97	అనంతపురం	118
గోదావరి	114		







సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న చిత్రం 'స్పిరిట్'. త్రిప్తి దిమ్రీ కథానాయిక. సెప్టెంబరు చివరి వారం నుంచి 'స్పిరిట్' రెగ్యులర్ షూట్‌ను ప్రారంభించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. భారతీయ సినీ చరిత్రలోనే ఈ చిత్రం ఓ మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. ఈ సినిమాను భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. ఇందులో శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో ప్రభాస్ కనిపించనున్నారు.

అందరికీ కనెక్ట్ అయ్యే పాత్ర



'గబ్బర్‌సింగ్, 'రేసుగుర్రం', 'ఎవడు', 'వాల్తేరు వీరయ్య' వంటి చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు శ్రుతి హాసన్. ఆమె కీలక పాత్రలో నటించిన చిత్రం 'కూలీ'. రజనీకాంత్, నాగార్జున, ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్రధారులుగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించారు. ఆగస్టు 14న ఈ సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రుతీహాసన్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. "ఓ ఆల్బమ్ కోసం లోకేశ్‌ను కలసినప్పుడు 'కూలీ'లో నా పాత్ర గురించి చెప్పారు. వినగానే నచ్చేసింది. అందరూ కనెక్ట్ అయ్యే పాత్ర ఇది. మంచి భావోద్వేగాలతో నిండిన ఈ రోల్ నా కెరీర్‌లోనే ప్రత్యేకమైనది. రజనీ సార్‌తో కలసి నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన పోషించిన దేవ పాత్ర సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది. నాగార్జున విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు. లోకేశ్ విజన్, టేకింగ్ ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. 'కూలీ' ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది" అని చెప్పారు.

నటుడిగా 50 ఏళ్లు



హీరోగా, విలన్‌గా, డబ్బింగ్ ఆర్టిస్టుగా దక్షిణాది సినీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న విలక్షణ నటుడు సాయి కుమార్. ఆయన పేరు వింటే ఎన్నో అద్భుతమైన డైలాగులు కళ్ల ముందు మెదులుతాయి. నేడు(జూలై 27) ఆయన 65వ పుట్టిన రోజు. అంతేకాదు ఈ ఏడాదితో సాయి కుమార్ నట జీవితానికి 50 ఏళ్లు నిండాయి. ఇన్నేళ్ల ప్రస్థానంలో ఎన్నో గొప్ప చిత్రాలతో మెప్పించిన సాయి కుమార్ 1975 జనవరి 9న 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో నటుడిగా ఆరంగేట్రం చేశారు. సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ ఏడాది ఆయన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం', 'కోర్ట్' చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. కొత్తతరం ఆర్టిస్టులు వస్తున్నా, గట్టి పోటీ ఉన్నా సాయి కుమార్ ఇప్పటికీ చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ.. ప్రతీ సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సాయిధరమ్ తేజ్ 'సంబరాల ఏటిగట్టు', నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తిక్', కిరణ్ అబ్బవరం 'కే ర్యాంప్', అల్లరి నరేశ్ '12ఏ రైల్వే కాలనీ', 'ధర్మస్థల నియోజకవర్గం', 'రాజాధి రాజా', కోన వెంకట్‌తో ఓ సినిమా, ఎస్వీ కృష్ణారెడ్డితో మరో చిత్రం ఇలా..ఫుల్ బిజీగా ఉన్నారు. కన్నడ, తమిళ చిత్రాలలోనూ నటిస్తున్నారు.

విడుదలే పెద్ద విజయం



నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ సంస్థ నిర్మిస్తోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కథానాయకుడు సందీప్ కిషన్ ఈ చిత్రం టీజర్‌ని లాంచ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఒక సినిమాను నిర్మించి రిలీజ్ చేయడమే పెద్ద సక్సెస్, ప్రేక్షకులకు సినిమా నచ్చితే బోనస్‌గా భావించాలి. ఇది ఒక స్పై ఫిల్మే కాదు..స్పై కామెడీ కథ కూడా. టీజర్ చాలా బాగుంది. సినిమా కూడా బాగుంటుందని అనుకుంటున్నా' అని అన్నారు. చిత్ర దర్శకుడు విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ 'ఒక దేశభక్తి సినిమా తీస్తూ 'చైనా పీస్' అనే పేరు పెట్టడం సాహసమే. అన్ని విభాగాల్లోనూ జాగ్రత్తలు తీసుకొని చాలా చక్కగా ఈ సినిమాని తీర్చిదిద్దాం' అని చెప్పారు. కార్యక్రమంలో హీరోలు నిహాల్, సూర్య శ్రీనివాస్, నటులు కమల్ కామరాజు, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

యూత్‌కి కనెక్ట్ అవుతుంది



డార్లింగ్ కృష్ణ, మనీషా జంటగా శశాంక్ దర్శకత్వంలో రూపొందుతున్న బహు భాషా చిత్రం 'బ్రాట్'. డాల్ఫిన్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై మంజునాథ్ కంద్కూర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా నుంచి 'యుద్ధమే రాని...' అంటూ సాగే పాటను సీనియర్ నటుడు నరేశ్ వీకే విడుదల చేశారు. ఈ పాటను సనారె రాయగా, అర్జున్ జన్య సంగీతం సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ కార్యక్రమంలో నరేశ్ వీకే మాట్లాడుతూ 'మంజునాథ్ చాలా రోజుల తరవాత అద్భుతమైన సినిమా 'బ్రాట్'తో వస్తున్నారు. శశాంక్ చాలా నైపుణ్యమున్న దర్శకుడు. మనీషా అద్భుతమైన నటి. యువతకు ఈ చిత్రం బాగా కనెక్ట్ అవుతుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు శశాంక్ మాట్లాడుతూ 'అందరినీ మెప్పించే కథ ఇది' అని అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★




మీ అండ ఉంటే.. ఆపేవారే లేరు

- విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన చిత్రం 'కింగ్‌డమ్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ రాయలసీమ యాసలో మాట్లాడి అభిమానులను అలరించారు. ఆయన మాట్లాడుతూ "ప్రతీ సినిమాకు ప్రాణం పెట్టి పనిచేసినట్టే ఈ ప్రాజెక్ట్‌కూ పనిచేశా. గౌతమ్ తిన్ననూరి, నాగవంశీ, అనిరుధ్, భాగ్యశ్రీ బోర్సే చాలా కష్టపడ్డారు. ఇక మిగిలింది ఒక్కటే ఆ వెంకన్న స్వామి దయ, మీ ఆశీస్సులు. అవి నాతో ఉంటే, ఎవరూ మనల్ని ఆపలేరు" అని అన్నారు. నాగవంశీ మాట్లాడుతూ "ఐదేళ్లు కష్టపడి గౌతమ్ తిన్ననూరి ఈ కథను రాశారు. ఓ సరికొత్త యాక్షన్ గ్యాంగ్‌స్టర్ సినిమా చూస్తారు. 'అర్జున్ రెడ్డి'లో విజయ్‌ను ఎలా చూశారో, ఇందులో రెండున్నర గంటలపాటూ అలానే చూస్తారు. ఇండస్ట్రీ పరిస్థితి బాగాలేదు. ఈ సినిమాను మంచి హిట్ చేసి పరిశ్రమకు ఊపునివ్వండి" అని చెప్పారు. భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన సినిమా. ఇందులో నేను పోషించిన పాత్ర చాలా కీలకంగా ఉండనుంది" అని తెలిపారు.

'అతడు' సీక్వెల్‌కు సిద్ధం

- మురళీ మోహన్



"జయభేరి' బేనర్‌లో మేం తీసిన చిత్రాలు మొత్తం ఒకెత్తు..'అతడు' ఒక్కటీ ఒకెత్తు. అప్పట్లో అధునాతన సాంకేతికతతో ఈ మూవీని నిర్మించాం. అద్భుతమైన డైలాగ్స్‌తో త్రివిక్రమ్ అందరినీ మెప్పించారు. అందుకే త్రివిక్రమ్ మాటల మాంత్రికుడు అయ్యారు' అని అన్నారు సీనియర్ నటుడు, నిర్మాత మురళీమోహన్. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో మురళీ మోహన్ నిర్మించిన 'అతడు' సినిమా 2005 ఆగస్టు 10న విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని ఆగస్టు 9న మహేశ్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో మురళీ మోహన్ మాట్లాడుతూ 'ఈ మూవీ కోసం మహేశ్ బాబు చాలా సహకరించారు. ఈ రీ రిలీజ్ ద్వారా వచ్చిన డబ్బులను మహేశ్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తాం. మహేశ్ బాబు, త్రివిక్రమ్ డేట్స్ ఇస్తే 'అతడు' సీక్వెల్‌ను మా బేనర్ నిర్మిస్తుంది' అని అన్నారు. జయభేరి ప్రతినిధి ప్రియాంక దుగ్గిరాల మాట్లాడుతూ 'ఈ సినిమాను ఇప్పుడున్న టెక్నాలజీతో 8కె, 4కెలోకి మార్చాం' అని చెప్పారు.

ప్రేక్షకులను మెప్పించే కథలతో



విభిన్నమైన కథలతో పలు విజయవంతమైన చిత్రాలను అందించిన నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ. తన సొంత బేనర్ భీమవరం టాకీస్ పతాకంపై నిర్మిస్తున్న కొత్త చిత్రాల విశేషాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. 'మా బేనర్‌పై విభిన్నమైన కథాంశాలతో పలు చిత్రాలను రూపొందిస్తున్నాం. సస్పెన్స్ థ్రిల్లర్, అవుట్ అండ్ అవుట్ కామెడీ, లవ్ స్టోరీ... ఇలా ప్రేక్షకులను మెప్పించే విభిన్న కథాంశాలతో మొత్తం పదిహేను వరకూ స్క్రిప్టులు సిద్ధం చేశాం. ఈ చిత్రాలను ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒకేసారి సెట్స్‌పైకి తీసుకువెళతాము. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని రామసత్యనారాయణ తెలిపారు.



ఏఐ భామ.. బూతుల బొమ్మ!

(మొదటి పేజీ తరువాయి)



ఏఐ మాయ.. అది బూతుల బొమ్మ! కృత్రిమ మేధతో రూపొందించిన ఈ వీడియోలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో వైరల్ అవుతున్నాయి. ఎక్కడో స్టాండప్ కామెడీ తరహాలో నిలబడి జోకులు చెబుతున్నట్టుగా కనిపించేలా రూపొందిస్తున్నవి కొన్ని అయితే... కేవలం బికినీ వేసుకుని రోడ్లపై తిరుగుతూ ఇంటర్వ్యూలు చేస్తున్నట్టుగా తయారు చేస్తున్నవి మరి కొన్ని. మహిళలు, యువతుల పాత్రల (క్యారెక్టర్ల)తో మహిళలను కించపర్చేలా, పురుషులపై ద్వంద అర్థాలతో సెటైర్లు వేస్తూ ఈ వీడియోలు సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి కృత్రిమ మేధను సరిగ్గా వినియోగించుకుంటే వచ్చే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. కానీ సరదాకో, వైరల్ కావాలనో, కాసుల కక్కుర్తితోనో ఇలాంటి అశ్లీల వీడియోలను ఏఐతో రూపొందిస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. వీటిని నియంత్రించేలా ప్రభుత్వం, సామాజిక మాధ్యమాలు దృష్టిపెట్టాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

రీల్స్ మోజులో అశ్లీలం వైపు..

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటివాటిలో ఆదాయం పొందే అవకాశం ఉండటంతో చాలా మంది సృజనాత్మక వీడియోలు చేస్తున్నారు. కొందరు ప్రత్యేక నైపుణ్యాలతో లక్షలకొద్దీ సబ్‌స్క్రైబర్లను, ఫాలోవర్లను సంపాదించుకుంటున్నారు. ఇది కాస్త శ్రమ, ఖర్చుతో కూడిన వ్యవహారం కూడా. తామూ ఫేమస్ కావాలని సామాజిక మాధ్యమాల్లోకి వస్తున్న మరికొందరు సబ్‌స్క్రైబర్లు, వ్యూస్ పెద్దగా రావడం లేదన్న నిరాశతో హద్దులు దాటుతున్నారు. ఏఐ సాయంతో స్టాండప్ కామెడీ పేరుతో బూతు వీడియోలు రూపొందిస్తున్నారు. అందంగా, ఆకట్టుకునేలా ఉండే యువతులు, మహిళల రూపాన్ని ఏఐతో సిద్ధం చేస్తున్నారు. ఎత్తు, రంగు, వస్త్రధారణ, భాష, మాట్లాడాల్సిన పదాలు, ఇతర వివరాలను పేర్కొంటే చాలు.. ఏమాత్రం అనుమానం రానంత పకడ్బందీగా కృత్రిమ వీడియోలను సిద్ధం చేసే ఏఐ వెబ్‌సైట్లు ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. ఐటీ రంగంలో పని చేస్తున్న కొందరు ఏఐ నిపుణులు, ఉద్యోగులు కాసుల కోసం ఇలాంటి ఏఐ వీడియోలు రూపొందిస్తూ జనం మీదికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలను పట్టించుకునేవారెవరు?

సామాజిక మాధ్యమాల్లో పెట్టే వీడియోలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. అసభ్యత, అశ్లీలం, బాలికలపై నేరాలు, మహిళలను కించపరిచేలా వీడియోలు రూపొందించడం కేంద్ర ఐటీ చట్టం ప్రకారం నేరం. యూట్యూబ్, ఇన్‌స్టా వంటి పెద్ద సామాజిక మాధ్యమ కంపెనీలు ఏఐ వీడియోలకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు రూపొందించాయి. ముఖ్యంగా పూర్తిగా కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలకు 'ఇది ఏఐతో రూపొందించినది' అని స్పష్టంగా తెలిసేలా పేర్కొనాలి. అడల్ట్ కామెడీ అయితే.. ఆ వీడియోలపై '18+, పెద్దలకు మాత్రమే' అని పేర్కొనాలి. కానీ చాలా మంది వీటిని పాటించడం లేదు.

జస్టిస్ వర్మ అభిశంసనపై కేంద్రం 'నియంత్రణ'!

ధన్‌ఖడ్ స్వతంత్రంగా వ్యవహరించడమే నేరమైంది: సింఘ్వీ

న్యూఢిల్లీ, జూలై 26: ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాకు గల కారణాలపై వివాదం కొనసాగుతూనే ఉంది. రాజ్యసభ చైర్మన్ హోదాలో ధన్‌ఖడ్ స్వతంత్రంగా వ్యవహరించడమే ఆయన చేసిన పెద్ద నేరంగా కనిపిస్తోందని కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ వ్యాఖ్యానించారు. జస్టిస్ వర్మ అభిశంసన తీర్మానం విషయంలో రాజ్యసభ చైర్మన్‌గా ధన్‌ఖడ్ వ్యవహరించిన తీరు కేంద్రంలోని పెద్దలకు కొరుకుడు పడలేదని, అందుకే ఆయనను రాజీనామా చేసేలా వ్యవహరించారని ఆరోపించారు. జస్టిస్ వర్మ అభిశంసనపై నియంత్రణను కేంద్రం తన చేతిలోకి తెచ్చుకోవాలని భావించిందన్నారు. దీనికి ధన్‌ఖడ్ ఒప్పుకోకపోవడం, స్వతంత్రంగా వ్యవహరించడంతో.. "ముందు లోక్‌సభలోనే మా తీర్మానం. రాజ్యసభలో కాదు. నీతో పనిలేదు పో!." అన్నట్టుగా కేంద్రం వ్యవహరించిందని సింఘ్వీ వ్యాఖ్యానించారు.

బిహార్‌లో జర్నలిస్టుల పెన్షన్ 15 వేలకు పెంపు

పట్నా, జూలై 26: అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్ ప్రభుత్వం జర్నలిస్టులకు శుభవార్త తెలిపింది. వారికి అందిస్తున్న నెలవారీ పించనును రూ.9వేల మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. 'బిహార్ పత్రికార్ సమ్మాన్' పింఛన్ పథకం కింద ఇప్పటివరకు రూ.6 వేలు పొందుతున్న జర్నలిస్టులకు ఇకపై రూ.15 వేల పింఛను లభించనుంది. పింఛను తీసుకుంటున్న జర్నలిస్టు మరణించిన సందర్భంలో జీవిత భాగస్వామికి లేదా ఆ జర్నలిస్టుపై ఆధారపడిన వ్యక్తికి ఇప్పటివరకు ఇస్తున్న రూ.3 వేల పెన్షన్ కూడా రూ.10వేలకు పెంచుతున్నట్లు సీఎం నితీశ్ ప్రకటించారు.

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్..ముగ్గురు నక్సలైట్ల మృతి

గుమ్లా, జూలై 26: ఝార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు. వారిని సీపీఎం(మావోయిస్టులు) నుంచి విడిపోయిన ఝార్ఖండ్ జన ముక్తి పరిషత్ (జేజేఎంపీ) సభ్యులుగా పోలీసులు గుర్తించారు. ఘాగ్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో నక్సలైట్లు తలదాచుకున్నట్లు తమకు ఇంటెలిజెన్స్ సమాచారం అందిందని గుమ్లా ఎస్పీ హారిస్ తెలిపారు. ఝార్ఖండ్ జాగ్వర్ బలగాలు, గుమ్లా పోలీసుల సిబ్బంది సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయన్నారు. బలగాల రాకను గుర్తించిన నక్సలైట్లు.. కాల్పులు జరిపి తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. ఈ క్రమంలో ముగ్గురు నక్సలైట్లు మృతి చెందగా, మరో ఇద్దరు పరారయ్యారని చెప్పారు.

రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వ పదవులు చేపట్టను

- మధ్యవర్తిత్వం చేస్తా.. సీజేఐ గవాయ్ స్పష్టీకరణ

అమరావతి (మహారాష్ట్ర), జూలై 26: పదవీ విరమణ తర్వాత తాను ఎలాంటి ప్రభుత్వ పదవులు చేపట్టబోనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీ.ఆర్.గవాయ్ చెప్పారు. సలహా సంప్రదింపులు, మధ్యవర్తిత్వం వంటి సేవలు అందిస్తానని తెలిపారు. శనివారం అమరావతి జిల్లా, సెషన్స్ కోర్టు ఆవరణలో టి.ఆర్.గిల్డా స్మారక ఈ-గ్రంథాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. నవంబరు 23న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. నవంబరు 24 తర్వాత ఎలాంటి ప్రభుత్వ పదవిని అంగీకరించబోనని తెలిపారు.

మళ్లీ ముంచిన గూగుల్ మ్యాప్స్

- ముంబైలో నీటి ప్రవాహంలోకి దూసుకెళ్లిన కారు
- క్షేమంగా బయటపడ్డ డ్రైవర్



ముంబై, జూలై 26: గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుని మరో కారు డ్రైవర్ నీట మునిగారు. ముంబైలో గూగుల్ మ్యాప్స్ చూపిన తప్పుదారిలో కారు నడుపుకొంటూ వెళ్లిన ఓ మహిళ చివరకు సముద్రం బ్యాక్ వాటర్ ప్రవహించే బేలో పడిపోయారు. అక్కడ ఉన్న జెట్టీ సెక్యూరిటీ సిబ్బంది తక్షణం స్పందించడంతో ఆమె క్షేమంగా బయటపడ్డారు. శుక్రవారం నవీ ముంబైలోని బేలాపూర్ మీదుగా ఉల్వే వెళ్లడానికి ఆమె గూగుల్ మ్యాప్స్‌ను అనుసరించినపుడు ఈ ఘటన జరిగింది. బేలాపూర్ వద్ద బే బ్రిడ్జిపై నుంచి చూపించాల్సిన దారిని గూగుల్ మ్యాప్స్ బ్రిడ్జి కింద నుంచి చూపింది. ఆ దారి ధ్రువతార జెట్టీ వద్దకు వెళ్తుంది. ఇది తెలియని ఆమె ముందుకే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. కొద్దిసేపటికే జెట్టీ నుంచి నీటిలో పడిపోయారు. ఇది చూసిన మెరైన్ సెక్యూరిటీ అధికారులు వెంటనే స్పందించారు. నీటిపై తేలుతున్న ఆమెను నిమిషాల వ్యవధిలోనే రక్షించారు. ఆమె కారును కూడా బయటకు తీశారు. గాయాలేవీ లేకుండానే ప్రమాదం నుంచి ఆ మహిళ బయటపడ్డారు.

మానసిక సమస్యలతో.. విద్యార్థుల ఆత్మహత్యలు!



- ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 26: విద్యార్థుల ఆత్మహత్యలపై శుక్రవారం సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బావిపౌరుల మరణాలు వ్యవస్థాపక వైఫల్యాలుగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం అభివర్ణించింది. ఆత్మహత్యల నిరోధానికి పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్‌సీఆర్‌బీ 2022లో ప్రచురించి 'యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా' నివేదికను ఉటంకిస్తూ.. చాలా దారుణమైన పరిస్థితులను గమనిస్తున్నామని వ్యాఖ్యానించింది. "మానసిక ఒత్తిడి, విద్యాభారం, సామాజిక వివక్ష, విద్యాసంస్థల తీరు వంటి కారణాలతో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇది వ్యవస్థాపక వైఫల్యాన్ని సూచిస్తోంది" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. విశాఖపట్నంలో నీట్ అభ్యర్థి అయిన ఓ 17 ఏళ్ల యువతి ఆత్మహత్య కేసును సీబీఐకి బదలాయించాలన్న అభ్యర్థనను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. దీనిపై దాఖలైన అప్పీల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని.. కోటా, జైపూర్, సీకార్, విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీ లాంటి నగరాల్లో ఇవి మరీ తీవ్రస్థాయిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆత్మహత్యల నివారణకు పలు సూచనలు చేసింది. ఆయా అంశాలను 90 రోజుల్లో అమలు చేసేలా అఫిడవిట్ సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.


సుప్రీంకోర్టు సూచనలు

- ప్రతి విద్యాసంస్థలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కౌన్సెలర్లను నియమించుకోవాలి
- టెలీ-మానస్ టోల్‌ఫ్రీ సహా.. ఆత్మహత్యల నివారణకు హాస్టళ్లు, తరగతి గదుల వద్ద హెల్ప్‌లైన్ నంబర్లను ప్రదర్శించాలి
- బోధన, బోధనేతర సిబ్బందికి కౌన్సెలింగ్‌లో శిక్షణనివ్వాలి. ఏటా రెండుసార్లు ఈ శిక్షణ ఉండాలి
- విద్యార్థుల మానసిక స్థితిని ఎప్పటికప్పుడు గమనించాలి. ఆత్మహత్య సంకేతాల(సూసైడల్ ఇంటెన్షన్)ను గుర్తించాలి
- ర్యాగింగ్, లైంగిక వేధింపులపై తక్షణ చర్యలు తీసుకునేలా విద్యాసంస్థల్లో అంతర్గత కమిటీలు ఉండాలి
- గురుకులాలు, హాస్టళ్ల వద్ద డ్రగ్స్ వినియోగం, వేధింపులపై నిఘా పెట్టాలి.

అంగుళం తేడానూ పట్టేసే నిసార్

భూమిపై అడవులు, పంటలు, మంచు అన్నీ జల్లెడ పట్టేసే ఉపగ్రహం.. 12 రోజులకోసారి భూమంతా స్కాన్

- భూకంపాలు, కొండ చరియలు విరిగిపడే ముప్పును ముందే గుర్తించే అవకాశం
- నాసా, ఇస్రో ఉమ్మడి ప్రాజెక్టు ప్రత్యేకతలు
- 30న శ్రీహరికోట నుంచి నింగిలోకి



న్యూఢిల్లీ, జూలై 26: భూమి అణువణువును 12 రోజులకోసారి స్కాన్ చేసేస్తుంది. అడవులు, మైదానాలు, కొండలు, పర్వతాలు, పంటలు, జల వనరులు, మంచు ప్రాంతాలు.. ఇలా అన్నింటినీ జల్లెడ పడుతుంది. భూమి పొరల్లో ఒక్క అంగుళం మార్పు వచ్చినా గుర్తించేస్తుంది. కొండచరియలు విరిగిపడటాన్ని, భూకంపాలను, అగ్నిపర్వతాలు బద్దలవడాన్ని ముందే గుర్తించేందుకు అవకాశం ఇస్తుంది. ఇది అమెరికా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థలు నాసా, ఇస్రో సంయుక్తంగా చేపట్టిన 'నిసార్ (నాసా ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్)' ఉపగ్రహం ప్రత్యేకత ఇది. ఒక ట్రక్కు పరిమాణంలో, 2,393 కిలోల బరువున్న నిసార్ ఉపగ్రహాన్ని ఈ నెల 30న సాయంత్రం 5.40 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్16 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ ఉపగ్రహం భూమికి 743 కిలోమీటర్ల ఎత్తున సూర్యానువర్తన కక్ష్యలో పరిభ్రమిస్తూ పరిశీలిస్తుంది. దీనిలో నాసాకు చెందిన ఎల్-బ్యాండ్, ఇస్రోకు చెందిన ఎస్-బ్యాండ్ రాడార్లు, రెండింటి డేటాను సమ్మిళితం చేసే డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపార్చర్ రాడార్ (సార్), 12 మీటర్ల వ్యాసం ఉండే జల్లెడ వంటి ప్రత్యేక రాడార్ యాంటెన్నా ఉంటాయి. ఇలాంటి ఉపగ్రహం ప్రపంచంలో ఇదే మొదటిది కావడం గమనార్హం.

భారత్‌కు వాటా సగం.. ఖర్చు స్వల్పం

నిసార్ ప్రాజెక్టులో నాసా, ఇస్రోలకు చెరో సగం సమాన వాటా ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా శాటిలైట్ డిజైన్, తయారీ, పరికరాలు, గ్రౌండ్ స్టేషన్లు, రాకెట్, ప్రయోగం బాధ్యతలను ఇరు దేశాల మధ్య విభజించుకున్నాయి. ప్రాజెక్టుకు మొత్తం రూ.11,200 కోట్లు (1.3 బిలియన్ డాలర్లు) వ్యయం అవుతుండగా.. అందులో ఇస్రోకు అవుతున్నది సుమారు రూ. వెయ్యి నుంచి 1,200 కోట్లేనని అంచనా. ఇస్రో రాకెట్ ప్రయోగాలు, నిర్వహణ ఖర్చులు చాలా తక్కువ కావడంతో మన దేశం భరించాల్సిన వ్యయం స్వల్పంగా ఉందని.. ప్రాజెక్టులో వాటా మాత్రం సగం ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు.

నిసార్ ప్రత్యేకతలన్నో..

- భూమి పైపొరలో ఒక్క సెంటీమీటరు మార్పులు వచ్చినా గుర్తిస్తుంది. దీనితో భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లు, కొండ చరియలు విరిగిపడటం, పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడే పరిస్థితులను ముందే గుర్తించవచ్చు.
- భూమిపై, సముద్రాల్లో మంచు పరిస్థితిని, ఎంతెంత మందంతో ఉంది? కరిగి నీరుగా మారే తీరును కచ్చితత్వంతో గుర్తిస్తుంది. పర్యావరణ ప్రభావాలను గుర్తించడానికి తోడ్పడుతుంది.
- భూమిపై అడవులు, పంటల విస్తీర్ణం, అభివృద్ధి, పచ్చదనంలో తేడాలను.. నేల తేమను, నీటి వనరులను గుర్తిస్తుంది. వాటిలో ఎప్పటికప్పుడు వచ్చే తేడాలను గమనిస్తుంది. తగిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుంది.
- తుపానులు, వరదలు, సునామీలు, కార్చిచ్చులు వంటివాటి రియల్ టైమ్ డేటా (ఆ సమయంలో నెలకొన్న పరిస్థితి)ని అందించి.. సహాయక చర్యలకు తోడ్పడుతుంది.
- భూమి పరిశీలనకు సంబంధించి నిసార్ ఉపగ్రహం నుంచి రోజుకు 4,300 గిగాబైట్ల (సుమారు వెయ్యి నుంచి 1,500 సినిమాల అంత) డేటా అందుతుందని నాసా తెలిపింది. ఈ డేటాను ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా వినియోగించుకోవడానికి అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించింది. ఇప్పటికే 80 సంస్థలు నిసార్ డేటా కోసం ఒప్పందం చేసుకున్నాయని వివరించింది.

లోకం తీరు



సిద్దరామయ్య, శివకుమార్ ప్రత్యేకాధికారుల మధ్య గొడవ!

బెంగళూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశంపై చర్చ కొనసాగుతూనే ఉన్న వేళ మరో వివాదం చర్చనీయాంశంగా మారింది. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రత్యేక అధికారుల (ఎస్‌డీవో) మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. ఇందుకు ఈనెల 22న ఢిల్లీలోని కర్ణాటక భవన్ వేదికైంది. సీఎం ఎస్‌డీవో మోహన్‌కుమార్ సిబ్బంది ఎదుటే తనను బూటుతో కొడతానని బెదిరించారని డీసీఎం ఎస్‌డీవో ఆంజనేయ ఆరోపించారు. ఆయన తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, అన్ని విషయాల్లో కలగజేసుకుంటున్నారని పేర్కొన్నారు. తన గౌరవానికి భంగం కలిగిందని పేర్కొంటూ ఆయన సీఎస్ శాలిని రజనీశ్ ఫిర్యాదు చేశారు. కుమార్ గతంలో కూడా పలువురు సీనియర్ అధికారులతో దురుసుగా ప్రవర్తించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఆంజనేయ ఫిర్యాదుపై విచారణకు సీఎస్ రెసిడెంట్ కమిషనర్ ఇంకాంగ్లో జమీర్‌ను ఆదేశించారు.

అహ్మదాబాద్ బాధిత కుటుంబాలకు తాత్కాలిక పరిహారం చెల్లింపు

న్యూఢిల్లీ, జూలై 26: అహ్మదాబాద్ విమాన ప్రమాద బాధితుల కుటుంబాలకు ఎయిర్ ఇండియా తాత్కాలిక పరిహారం చెల్లించింది. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాల తక్షణ ఆర్థిక అవసరాల నిమిత్తం రూ.25 లక్షల తాత్కాలిక పరిహారాన్ని అందజేసినట్లు శనివారం ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. గత నెల 12న జరిగిన విమాన ప్రమాదంలో మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 166 మంది బాధిత కుటుంబాలకు తాత్కాలిక పరిహారం చెల్లించామని, మిగతా వారికి త్వరలో చెల్లింపులు జరుపుతామని పేర్కొంది. అహ్మదాబాద్ విమాన ప్రమాద బాధిత కుటుంబాలకు రూ. కోటి చెల్లిస్తామని ఎయిరిండియా ప్రకటించిన సంగతి తెలిసిందే.

ప్రియుడి కోసం భర్తకు 2సార్లు విషం పెట్టి హత్య

ఫిరోజాబాద్, జూలై 26: ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తకు చంపాలనుకుందా భార్య! భోజనంలో విషం పెడితే.. తిని అస్వస్థతకు గురై ఆస్పత్రిలో ఆ భర్త కోలుకుంటే రెండోసారి విషం పెట్టి చంపేసింది. యూపీలో ఫిరోజాబాద్ సమీపంలోని ఉలావు అనే గ్రామంలో ఈ ఘోరం జరిగింది. హతుడి పేరు సునీల్. అతడి భార్య గ్రామంలోనే మరో యువకుడితో చనువుగా ఉంటోంది. మే 13న భోజనం చేశాక సునీల్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స చేసిన వైద్యులు మర్నాడు అతడిని డిశ్చార్జి చేశారు. కొన్నిరోజుల తర్వాత సునీల్ భార్య అతడికి పెరుగులో విషం కలిపి భోజనం పెట్టింది. ఈసారి తిన్నాక అతడు ప్రాణాలు విడిచాడు. సునీల్ మృతిపై అనుమానంతో అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల దర్యాప్తులో.. సునీల్‌ను చంపేందుకు అతడి భార్య ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి విషాన్ని తెప్పించుకుందని తేలింది. దీంతో, సునీల్ భార్యను, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

మహారాష్ట్రలో హెచ్ఐవీ బాధితురాలిపై రేప్

లాతూర్, జూలై 26: మహారాష్ట్రలోని లాతూర్‌లో హెచ్ఐవీ బాధితుల సంరక్షణ కేంద్రంలో తల దాచుకున్న బాలిక(16)పై అందులోని ఓ ఉద్యోగి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల అనారోగ్యంతో పడిపోతే సంరక్షణ కేంద్రం నిర్వాహకులు ఆస్పత్రికి తరలించి, వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆమె 4 నెలల గర్భవతి అని నిర్ధారించిన వైద్యులు.. తన సమ్మతి తీసుకోకుండానే గర్భస్రావం చేశారు. దీనిపై ఆ బాలిక సంరక్షణ కేంద్రం ఫిర్యాదుల పెట్టెలో చేసిన ఫిర్యాదు ప్రతినీ కేంద్రం యాజమాన్య ప్రతినిధులు చింపేశారు. అయితే, బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంస్థ వ్యవస్థాపకులు రవి బాపట్లే, సూపరింటెండెంట్ రచ్నా బాపట్లే, ఉద్యోగులు అమిత్ మహాముని, పూజలను శనివారం పోలీసులు అరెస్టు చేశారు.

బిహార్‌లో అంబులెన్స్‌లో యువతిపై అత్యాచారం

పట్నా, జూలై 26: బిహార్‌లో అంబులెన్స్‌లో ఓ మహిళపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గయా జిల్లాలోని బోధ్ గయాలో ఈ నెల 24న నిర్వహించిన హోంగార్డ్ నియామక పరీక్షకు 26 ఏళ్ల మహిళ హాజరైంది. దేహదారుఢ్య పరీక్ష నిర్వహిస్తుండగా ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు అధికారులు అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే అపస్మారక స్థితిలో ఉన్న తనపై అంబులెన్స్‌లో కొందరు అత్యాచారానికి పాల్పడినట్టు ఆమె ఆరోపించింది. పోలీసులు అంబులెన్స్ డ్రైవర్ వినయ్, టెక్నీషియన్ అజిత్‌లను అరెస్ట్ చేశారు.

ఆర్మీలో సరికొత్త దళం.. 'రుద్ర'

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 'ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్' ఏర్పాటు

- ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది వెల్లడి
- సైనికుల కుటుంబాలకు న్యాయ సహాయానికి కేంద్రం కొత్త పథకం
- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరులకు రాష్ట్రపతి, ప్రధాని నివాళి



లద్దాఖ్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద ఉపేంద్రకు రాఖీ కడుతున్న ఓ విద్యార్థిని

న్యూఢిల్లీ, జూలై 26: కాలానుగుణంగా మారుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో సరిహద్దుల వద్ద శత్రుమూకల ఆటకట్టించేలా భారత ఆర్మీలో ఓ శక్తిమంతమైన దళం ఏర్పాటైంది. ఈ దళం పేరు 'రుద్ర'. ఇందులో పదాతి దళం, యుద్ధ వాహనాలు, సాయుధ యూనిట్లు, డ్రోన్లు, ఫిరంగి దళం, ప్రత్యేక శిక్షణ పొందిన సైనికులు... ఇలా విభిన్న రకమైన దళాలు ఒక గ్రూప్‌గా ఉంటాయని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది శనివారం వెల్లడించారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్(జూలై 26)ను పురస్కరించుకొని ఆయన ఈ ప్రకటన చేశారు. భారత సైన్యం ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవడంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ 'ఆల్ ఆర్మ్ బ్రిగేడ్'ను రూపొందించినట్లు ఆయన వివరించారు. దీంతో పాటు, సరిహద్దుల్లో మెరుపు ఆపరేషన్ల కోసం 'భైరవ్' పేరుతో లైట్ కమాండో బెటాలియన్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు ద్వివేది తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. కార్గిల్ అమర వీరులకు నివాళి అర్పించేందుకు 'ఈ-శ్రద్ధాంజలి' పేరుతో కొత్తగా యాప్‌ను విడుదల చేశారు. ఈ యాప్‌లో కార్గిల్ యుద్ధం, సైనికుల వీర గాథలు ఉంటాయన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని శనివారం రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్.. కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. "భారత సైనికుల అసాధారణమైన శౌర్యానికి కార్గిల్ విజయం ప్రతీక" అని ముర్ము అన్నారు. సైనికుల త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని మోదీ కొనియాడారు.

సిందూర్ తర్వాతనే రూపకల్పన

భారతీయ సైనికుల కుటుంబాలకు చెందిన న్యాయ వివాదాల్లో సాయం కోసం కేంద్రం కొత్తగా 'నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన'ను తీసుకువచ్చింది. ఈ పథకం కింద కేంద్రప్రభుత్వం సైనికుల కుటుంబాలకు న్యాయ సాయం అందించనుంది. సైనికులు సరిహద్దుల్లో విధులు నిర్వహించడం, తరచూ ఇళ్లకు వెళ్లడానికి వీలు కాని నేపథ్యంలో కేంద్రం ఈ కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దీన్ని ప్రకటించారు. శనివారం శ్రీనగర్‌లో జరిగిన ఓ సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ ఈ పథకాన్ని ప్రారంభించారు.

ప్రత్యేక పాఠ్యాంశంగా ఆపరేషన్ సిందూర్

ఆపరేషన్ సిందూర్‌ను ప్రత్యేక పాఠ్యాంశంగా పెట్టాలని ఎన్‌సీఈఆర్‌టీ యోచిస్తోంది. పాఠ్య పుస్తకాల్లో భాగంగా కాకుండా విడిగా 8 నుంచి 10 పేజీలతో రెండు మాడ్యూల్స్‌లో విద్యార్థులకు అందించనుంది. మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఒకటి, 9 నుంచి 12వ తరగతి వరకు మరొక మాడ్యూల్‌ను అందిస్తారు. అత్యంత విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రత్యేక పాఠ్యాంశంగా పెట్టడం ద్వారా విద్యార్థులకు భారత సైనిక శక్తి గురించి పూర్తి స్థాయిలో తెలిసి వస్తుందని ఎన్‌సీఈఆర్‌టీ భావిస్తోంది. దీంతో పాటు శుభాంశు శుక్లా రోదసి యాత్ర, చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-వన్, కోవిడ్-19, జీ-20 సదస్సు, డిజిటల్ ఇండియా తదితర అంశాలను కూడా ప్రత్యేక పాఠ్యాంశాలుగా పెట్టాలని యోచిస్తోంది.


బానిసల్లా జిల్లా జడ్జీలు

- తీర్పులో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీధరన్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 26: జిల్లా జడ్జీలకు స్వేచ్ఛ లేదని, వారు హైకోర్టు న్యాయమూర్తులను చూసి భయపడుతున్నారని మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీధరన్ తన తీర్పులో తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటారేమోనన్న భయంతో అర్హమైన కేసుల్లోనూ బెయిల్ ఇవ్వలేకపోతున్నారని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు 'ఫ్యూడల్ లార్డ్'లుగా వ్యవహరిస్తూ జిల్లా స్థాయి జడ్జీలను 'బానిసలు'గా చూస్తున్నారని ఆక్షేపించారు. మధ్యప్రదేశ్‌లోని ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జిని ఉద్యోగం నుంచి తొలగించడాన్ని కొట్టివేస్తూ జస్టిస్ శ్రీధరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తగిన ఆధారాల్లేకుండానే జడ్జిని ఉద్యోగం నుంచి తొలగించారంటూ తప్పుపట్టారు. హైకోర్టు జడ్జిలు 'సవర్ణులు'గా భావిస్తూ, జిల్లా స్థాయి న్యాయాధికారులను 'శూద్రులు'గా చూస్తున్నారు" అని ఉపమానంగా చూపించారు.

నాసాలో 4 వేల మందికి వీఆర్ఎస్!

- ప్రభుత్వ వ్యయం తగ్గింపు కోసం ట్రంప్ యంత్రాంగం చర్యల ఫలితం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న శాస్త్రవేత్తలు



వాషింగ్టన్, జూలై 26: సూర్యుడికి అతి దగ్గరగా వెళ్లి పరిశోధనలు చేస్తున్న పార్కర్ సోలార్ ప్రోబ్ నుంచి 25వేల కోట్ల కిలోమీటర్లు ప్రయాణించి సౌర కుటుంబం అంచులనూ దాటి ముందుకెళ్తున్న వోయేజర్-1 వ్యోమనౌక దాకా అద్భుత పరిశోధనలకు నాసా (అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ) పెట్టింది పేరు. అలాంటి నాసా ఇప్పుడు వట్టిపోతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ వ్యయం తగ్గించడం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం చేపట్టిన చర్యలు నాసాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. బడ్జెట్‌లో నాసాకు 24 శాతం నిధులు తగ్గించడం, దానికితోడు సైంటిఫిక్ రీసెర్చ్ విభాగానికి నిధులు సగానికి సగం కోసేయడం నేపథ్యంలో.. కొందరు ఉద్యోగులను స్వచ్ఛంద పదవీ విరమణ కోసం ఒత్తిడి చేయడం మొదలైంది. 'వాలంటరీ ఎర్లీ రిటైర్మెంట్ అథారిటీ' కింద 870 మంది. 'వాలంటరీ సెపరేషన్ ఇన్సెంటివ్ ప్రోగ్రామ్' కింద 3 వేల మందికిపైగా నాసా ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్టు నాసా న్యూస్ విభాగం చీఫ్ చెరీల్ వార్నర్ తాజాగా వెల్లడించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన జనవరి నుంచి జూన్ చివరి వరకు సుమారు 500 మంది ఉద్యోగులు నాసాను వీడారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నాటికి నాసా ఉద్యోగుల సంఖ్య 20శాతం మేర తగ్గి 14 వేల లోపునకు తగ్గిపోతుందని అంచనా వేశారు. ట్రంప్ యంత్రాంగం చర్యలతో నాసా శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2003లో కొలంబియా స్పేస్ షటిల్ పేలిపోయిన ఘటనను గుర్తుచేస్తూ.. వ్యయం తగ్గింపుతో భద్రతా ప్రమాణాలపై రాజీ పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వ చర్యలతో పరిశోధనలకు విఘాతం కలగడం నుంచి వ్యోమగాముల భద్రత ప్రమాదంలో పడటం వరకు జరగబోయే పరిణామాలను ప్రస్తావిస్తూ రూపొందించిన 'వోయేజర్ డిక్లరేషన్'పై 362 మంది నాసా ప్రస్తుత, పూర్వ శాస్త్రవేత్తలు సంతకాలు చేసి.. నాసా చీఫ్‌కు పంపారు.

ఉభయ సభల మౌలిక సదుపాయాల కమిటీ చైర్మన్‌గా స్పీకర్ అయ్యన్న

- మండలి, ఉభయసభలకు కమిటీల నియామకం

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన మండలికి, ఉభయసభలకు సంయుక్త కమిటీలను నియమించారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజ్ సంయుక్త కమిటీలను, మండలి చైర్మన్ శాసన మండలి కమిటీలను నియమించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన వ్యవహారాలను ఈ కమిటీలు పర్యవేక్షించనున్నాయి.

శాసనమండలి కమిటీ సభ్యుల వివరాలు నెట్ ఎడిషన్‌లో..

గాజాలో అమానుషాన్ని అడ్డుకోండి

- కేంద్రానికి ముస్లిం సంస్థలు, మేధావుల వినతి

న్యూఢిల్లీ, జూలై 26: గాజాలో ఇజ్రాయెల్ అమానుష చర్యలను అడ్డుకోవాలని భారత్‌లోని ముస్లిం సంస్థలు, ముస్లిం మేధావులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనాదిగా పీడితుల పక్షాన నిలిచే దేశ వారసత్వాన్ని కొనసాగించాలని సూచించారు.


అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, కుటుంబ సభ్యులు

రాజ్‌భవన్‌కు రాజు

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి ప్రమాణం

- ఏపీ నుంచి తరలివెళ్లిన టీడీపీ నాయకులు
- అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు


గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న అశోక్ గజపతిరాజు

అమరావతి/విజయనగరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదె ప్రమాణం చేయించారు. అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తూ, భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తానన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీకి చెందిన కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు లోకేశ్, గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అశోక్ గజపతిరాజు సతీమణి సునీల, ఎమ్మెల్యే అదితి గజపతి రాజు హాజరయ్యారు. లోకేశ్, రామ్మోహన్ నాయుడును ఆప్యాయంగా పలకరించిన అశోక్.. యువ నాయకత్వం ఏపీని నడిపిస్తోందని గోవా రాష్ట్ర అధికారులకు తెలిపారు. అశోక్ గజపతి రాజుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'ఏ పదవి చేపట్టినా హుందాగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించే అశోక్ గజపతిరాజు ఈ నూతన బాధ్యతలను కూడా అంకితభావంతో నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలవాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు. కాగా, అశోక్ గజపతి రాజు ప్రమాణ స్వీకారం అనంతరం గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో లోకేశ్ మాట్లాడారు. అశోక్‌ను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ.. 'సీఎం సార్.. మా పెద్దాయనను మీ చేతుల్లో పెడుతున్నాం. ఆయన మాకు తండ్రితో సమానం. జాగ్రత్తగా చూసుకోండి' అని కోరారు.

కేటీఆర్‌కు మతిభ్రమించింది!

- తెలంగాణలో కాంట్రాక్టులు కొట్టేశానా?
- రూ.1660 కోట్ల కాంట్రాక్టు నామినేషన్‌పై ఎవరైనా ఇస్తారా?.. గతంలో మీరిచ్చారా?
- బీజేపీ నేత, ఎంపీ సీఎం రమేశ్ ధ్వజం
- రండి.. చర్చిద్దాం: కేటీఆర్




అనకాపల్లి/హైదరాబాద్ సిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రతిపక్షం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌పై బీజేపీ నేత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా సహా ఇతర వేదికలపై తనను ఉద్దేశించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్‌కు మతిభ్రమించిందని విమర్శలు గుప్పించారు. చట్ట బద్ధంగా, నిబంధనల మేరకు తమ 'రిత్విక్ సంస్థ' తెలంగాణలో పనులు దక్కించుకుందని రమేశ్ తెలిపారు. ముఖ్యంగా రూ.1,660 కోట్ల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో తాను దక్కించుకున్నట్టు కేటీఆర్ ప్రచారం చేస్తున్నారని, కానీ.. ఇది ఎక్కడైనా సాధ్యమేనా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి తాను రుణాలు ఇప్పించినందుకే.. నామినేషన్ పద్ధతిలో పనులు ఇచ్చారన్న కేటీఆర్ వ్యాఖ్యలను రమేశ్ తిప్పికొట్టారు. సీఎం రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై కాంట్రాక్టు పొందానని చెప్పడం అవాస్తవమన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టు పనులు అప్పగించే సమయంలో ఎటువంటి నిబంధనలు పాటిస్తుందో పదేళ్లు మంత్రిగా చేసిన కేటీఆర్‌కు తెలియదా?. అని సీఎం రమేశ్ ప్రశ్నించారు. కవిత జైల్లో ఉన్నప్పుడు ఢిల్లీలో తన ఇంటికి వచ్చిన కేటీఆర్ ఏం మాట్లాడారో గుర్తుచేసుకోవాలని సీఎం రమేశ్ అన్నారు. సీబీఐ, ఈడీ దాడులు తమ వరకు రాకుండా చూడాలని, కవితను బయటకు తీసురావాలని కోరలేదా? అని ప్రశ్నించారు. ఈ పనిచేస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కూడా వ్యాఖ్యానించారన్నారు. ఆ మాటలు మరిచిపోయారా? అని రమేశ్ నిలదీశారు. అన్ని విషయాలపైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

రిటర్న్ గిఫ్ట్‌గా కాంట్రాక్ట్: కేటీఆర్

"సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ సీఎం రమేశ్ ఇద్దరూ కలిసి వస్తే.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి సంబంధించిన రూ.10 వేల కోట్ల కుంభకోణం, రూ.1660 కోట్ల రోడ్డు కాంట్రాక్టు కుంభకోణంపై చర్చకు సిద్ధం." అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తాము ఇరకాటంలో పడిన ప్రతిసారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు 'విలీనం' అనే పనికిరాని, పసలేని చెత్త అంశాన్ని తెరపైకి తెస్తున్నాయని విమర్శించారు. "కుంభకోణాల నుంచి దృష్టి మరల్చేందుకు, తెలంగాణ ప్రజలను అయోమయానికి గురి చేసేందుకు 'విలీనం' ఆరోపణలు చేస్తున్నారు. నీ దోస్త్ రూ.10 వేల కోట్లు దోచుకునేందుకు సహకరించిన నీకు... రిటర్న్ గిఫ్ట్‌గా రూ.1,660 కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చాడని తేలిపోయింది. రూల్స్ బ్రేక్ చేయడం, కాంట్రాక్టులను అనుకున్న వాళ్లకు కట్టబెట్టడం రేవంత్‌కు వెన్నతో పెట్టిన విద్య." అని మండిపడ్డారు.

పెట్టుబడుల సాధనే లక్ష్యం

సింగపూర్‌లో సీఎం చంద్రబాబు బిజీ షెడ్యూల్.. 5 రోజులు.. 29 కార్యక్రమాలు



(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలు, సంస్థల ప్రతినిధులుతో భేటీ అవుతారు. ఈ పర్యటనలో సీఎం మొత్తం 29 కార్యక్రమాల్లో పాల్గొంటారు. అందులో 6 ప్రభుత్వ భేటీలు, 14 వన్ టు వన్ సమావేశాలు, 4 సందర్శనలు, మూడు రౌండ్ టేబుల్ సమావేశాలు, ఒక డయాస్పోరా సమావేశం, ఒక రోడ్‌షో కార్యక్రమం ఉన్నాయి. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ఐటీ, పరిశ్రమలు, అర్బన్ డెవలప్‌మెంట్, క్రీడలు, నౌకాశ్రయాలు, ఫిన్‌టెక్ రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్య అవకాశాలపై పారిశ్రామికవేత్తలతో సీఎం చర్చలు జరపనున్నారు. ఈ పర్యటనతో అంతర్జాతీయ పెట్టుబడుల రాకకు గేట్‌వేగా ఏపీ మారనుంది. క్రీడారంగం అభివృద్ధితోపాటు పోర్టు ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ముందడుగుగా నిలవనుంది.

తొలి రోజు నుంచే బిజీ.. బిజీ..

సింగపూర్ చాంఘీ విమానాశ్రయం నుంచి హోటల్‌కు చేరుకున్న వెంటనే చంద్రబాబు షెడ్యూల్ మొదలవుతుంది. తొలుత సింగపూర్‌లోని భారత్ హైకమిషనర్ శిల్పక్ అంబులేతో భేటీ అవుతారు. ఉదయం 11.30కు నిర్మాణ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన సింగపూర్‌కు చెందిన కన్సల్టెన్సీ సంస్థ సుర్బనా జురాంగ్ ప్రతినిధులతో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఎవర్‌సెండాయ్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ తన్‌శ్రీ డాటో నాథన్‌ను కలిసి మాట్లాడతారు. ప్రపంచస్థాయి స్ట్రక్చరల్ స్టీల్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీగా ఎవర్‌సెండాయ్‌కి గుర్తింపు ఉంది.

తెలుగువారితో సమావేశం

ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఓవిస్ ఆడిటోరియంలో జరిగే 'తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా' కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. ఈ సమావేశానికి సింగపూర్‌తోపాటు మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ తదితర దేశాలకు చెందిన తెలుగు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరుకానున్నారు. ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి సుమారు 1,500 మంది ప్రతినిధులు రానున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిరుద్యోగ యువతకు దేశంలోనే కాకుండా విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులను ఏపీ అభివృద్ధిలో భాగస్వామ్యం వహించేలా చేయటం, ఏపీ నుంచి ఎగుమతులు పెంచడానికి ఎన్నారైల ద్వారా అవసరమైన ప్రణాళికలు అమలు, నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి అంశాలపై తెలుగు డయాస్పోరా సమావేశం దృష్టి సారించనుంది. అలాగే జీరో పావర్టీ మిషన్‌లో భాగమైన పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తెలుగు పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలను సీఎం కోరనున్నారు.

తెలుగు డయాస్పోరా కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

హోం, విదేశాంగ మంత్రులతో భేటీ

నాలుగో రోజు పర్యటనలో భాగంగా కేపిటాల్యాండ్, సుమితోమో మిట్సుయి బ్యాంక్, టెమసెక్ సంస్థలతో సీఎం సమావేశం అవుతారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ కానున్నారు. చివరి రోజైన 31వ తేదీన సింగపూర్ హోం మంత్రి కె.షణ్ముగంతోపాటు స్థానిక ప్రతినిధులతో సమావేశం అవుతారు. అదే రోజు రాత్రి హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు. సీఎం చంద్రబాబుతోపాటు మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్, పలువురు ఐఏఎస్ అధికారులు సింగపూర్ పర్యటనలో పాల్గొంటున్నారు.

పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అధ్యయనం

పర్యటనలో రెండో రోజైన సోమవారం సింగపూర్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ మంత్రి గన్ కిమ్ యాంగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ అవుతారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో సుస్థిరాభివృద్ధి ప్రణాళికలపై అధ్యయనం కోసం సింగపూర్‌లోని బిడదారి ఎస్టేట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అనంతరం సస్టెయినబుల్ అర్బన్ డెవలప్‌మెంట్‌పై నిర్వహించే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులో సీఎం బృందం పాల్గొంటుంది. యువతకు క్రీడలపై ఆసక్తి కలిగించేలా సింగపూర్ నిర్మించిన స్పోర్ట్స్ స్కూల్‌ను కూడా సీఎం బృందం సందర్శిస్తుంది. పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పోర్టు ఆధారిత ఎకో సిస్టమ్ తదితర అంశాలను పరిశీలించేందుకు సీఎం బృందం టువాస్ పోర్టులో పర్యటిస్తుంది. అనంతరం పెట్టుబడిదారులతో నెట్‌వర్కింగ్ కోసం ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం నిర్వహించే రోడ్‌షో కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు.

సింగపూర్ బిజినెస్ లీడర్లతో సమావేశం

సీఎం పర్యటనలో మూడో రోజు ఏఐ సింగపూర్, ఎస్ఐఏ ఇంజినీరింగ్, కెప్పెల్, జీఐసీ లాంటి ప్రముఖ సంస్థలతో వరుస భేటీలు జరుగుతాయి. ఐటీ, ఫిన్‌టెక్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో 10కిపైగా అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమై చర్చలు జరుపుతారు. అనంతరం సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో సీఎం చంద్రబాబు సమావేశమవుతారు. సింగపూర్ మాజీ ప్రధాని లీ హ్సియన్ లూంగ్‌తో కూడా భేటీ అవుతారు. సింగపూర్‌లోని జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్‌ను సందర్శించి పారిశ్రామిక అభివృద్ధి మోడల్‌పై అధ్యయనం చేస్తారు. సింగపూర్‌లోని ప్రముఖ కంపెనీల సీఈవోల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని పోర్టులు, మౌలిక సదుపాయాలపై సీఎం చర్చించనున్నారు.



విశ్వసనీయ భాగస్వామ్యం పునరుద్ధరణకు అవకాశం

- సీఎం చంద్రబాబు

సింగపూర్‌తో విశ్వసనీయ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు తన సింగపూర్ పర్యటన దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు. తన పర్యటనపై సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'సింగపూర్.. ఏపీకి అత్యంత విలువైన భాగస్వాముల్లో ఒకటి.. ఉత్సాహవంతమైన తెలుగు సమాజానికి నిలయం. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ ముఖ్యమైన భాగస్వామిగా ఉంది. ఆసియాలో అత్యంత అభివృద్ధి చెందిన, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ఆర్థిక వ్యవస్థల్లో సింగపూర్ ఒకటి. సింగపూర్ పర్యటన.. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచవేదికపై ప్రచారం చేయడంతోపాటు ఏపీ కొత్తగా తీసుకొచ్చిన ప్రగతిశీల పారిశ్రామిక విధానాలను వివరించడానికి ఉపయోపడుతుందని ఆశిస్తున్నా.' అని ఆ పోస్టులో తెలిపారు.

2034 ఎన్నికల్లోనే!

(మొదటి పేజీ తరువాయి)

జన గణన చేపట్టాలని కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ప్రకారం తొలి దశలో జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జనాభా లెక్కల సేకరణ జరగనుంది. రెండో విడత... 2027 మార్చి ఒకటి నుంచి దేశమంతా చేపడతారు. ఈలెక్కన 2029 ఎన్నికల్లోనే నియోజకవర్గాల సంఖ్య పెంచేయవచ్చు కదా అనే సందేహం రావొచ్చు. కానీ... అది జరగదు! జనాభా లెక్కలు సేకరించి, వాటిని క్రోడీకరించి, పూర్తిస్థాయిలో గణాంకాలు ఖరారు చేసేందుకు కనీసం మూడేళ్లు పడుతుంది. ఈసారి డిజిటల్ ఫార్మాట్‌లో, మొబైల్ అప్లికేషన్‌ల ద్వారా జనగణన చేస్తున్నందున... కొంత తక్కువగా రెండేళ్లలోనే లెక్కలు తేలవచ్చు. అంటే... 2029 లేదా 2030లో కొత్త జనాభా గణన వివరాలు ప్రచురితమైన తర్వాత వాటి ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజవకవర్గాల పునర్విభజన జరగనుంది. అయితే... జనగణన తేలగానే నియోజకవర్గాలను పెంచేయడం కుదరదు. దానికి ఒక కమిషన్‌ను నియమించాలి. ఆ కమిషన్ సమగ్రంగా అధ్యయనం చేయాలి. కొత్త నియోజకవర్గాలతో ఒక ముసాయిదా నోటిఫికేషన్ ఇవ్వాలి. ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలి. దాని ఆధారంగా ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలి. అప్పటికి గానీ కొత్త నియోజకవర్గాలు అందుబాటులోకి రావు. ఇందుకు కనీసం ఏడాది సమయం పడుతుంది. అయితే... 2029 తొలి ఆరునెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు జరపక తప్పదు. వెరసి... వచ్చే ఎన్నికల్లో కొత్త నియోజకవర్గాలను ప్రకటించే అవకాశమే లేదు. అంటే... 2034 ఎన్నికల్లోనే కొత్త నియోజకవర్గాలు అందుబాటులోకి వస్తాయని ఎన్నికల కమిషన్ వర్గాలు సైతం స్పష్టం చేస్తున్నాయి.

ససేమిరా అన్న సుప్రీం...

నిజానికి 2021లో జన గణన మొదలై సకాలంలో పూర్తయి ఉంటే 2029 ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ జరిగేది. కొత్త జనాభా లెక్కల ఆధారంగా మాత్రమే డీలిమిటేషన్ జరగాలని తాజాగా సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం ఆంధ్రా, తెలంగాణల్లో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచాలని ప్రొఫెసర్ పురుషోత్తం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. వెరసి... కొత్త నియోజకవర్గాలపై రాష్ట్ర విభజన చట్టంలో వెసులుబాటు కల్పించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్న మాట! 2014లో అమలులోకి వచ్చిన చట్టంలో పేర్కొన్న హామీ అమలులోకి రావడానికి 20 ఏళ్లు పడుతుండటమే ఒక విచిత్రం! అప్పుడు... మనతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించే అవకాశముంది. అధిక జనాభా కారణంగా ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిలో నియోజకవర్గాల సంఖ్య తక్కువ స్థాయిలోనే పెరిగే అవకాశముందని తమిళనాడు సీఎం స్టాలిన్ కొన్నాళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే... సీమాంధ్రలో మాత్రం రాష్ట్ర విభజన చట్టం ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గాలను కనీసం 225 స్థానాలు చేయాల్సిందే!

దాత వీర్యంతో.. దంపతులకు సంతానం

హైదరాబాద్ సిటీ/విశాఖపట్నం/విజయవాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ఓ సంతాన సాఫల్య కేంద్రంలో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. సంతానార్థులై వచ్చే దంపతుల వీర్యం, అండాలను కాకుండా.. దాతల నుంచి సేకరించిన వీర్యంతో సంతానం కలిగిస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. పోలీసుల కథనం ప్రకారం.. సంతానం లేని ఓ జంట రెండేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌ను ఆశ్రయించింది. పరీక్షించిన వైద్యులు.. భర్త వీర్యకణాలతో ఐవీఎఫ్ విధానం ద్వారా మహిళ గర్భం దాల్చేలా చేశారు. ఆ తర్వాత ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో.. పరీక్షలు చేయించగా బాబుకు క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. తమ కుటుంబంలో ఎవరికీ లేని వ్యాధి బాబుకు ఎందుకు వచ్చిందో అర్థం కాని ఆ దంపతులు.. అనుమానంతో సృష్టి సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకులను నిలదీశారు. వారు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎన్ఏ పరీక్షల్లో ఆ బిడ్డ వీర్యదాత ద్వారా జన్మించినట్లు తేలింది. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.


వైద్యురాలు నమ్రత


సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్

గుట్టుగా దందా

గోపాలపురం పోలీసుల బృందం.. శనివారం సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఏడేళ్ల క్రితమే ఈ కేంద్రాన్ని సీజ్ చేసినా నిర్వాహకులు రహస్యంగా దందాను నిర్వహిస్తున్నట్లు తేలింది. కేంద్రంపై కేసు నమోదవ్వగానే డాక్టర్ నమ్రత విజయవాడలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు విజయవాడలోని గురునానక్ కాలనీకి చేరుకుని, నమ్రతను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఆమెకు నెల్లూరు, విజయవాడ, విశాఖల్లో ఫర్టిలిటీ సెంటర్లు ఉన్నట్లు గుర్తించి, అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. అక్కడా తనిఖీలు నిర్వహించారు. విశాఖలోని జిల్లాపరిషత్ జంక్షన్‌లో ఉన్న సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌పై జరిపిన దాడుల్లో కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. సెంటర్ ఇన్‌చార్జి సీహెచ్ కల్యాణితోపాటు.. మరికొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సృష్టి సంతాన సాఫల్య కేంద్రంలోని కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌ను సీజ్ చేసి, మరింత సమాచారాన్ని సేకరించడానికి అందులోని డాటాను విశ్లేషిస్తున్నారు. విశాఖపట్నం సెంటర్‌లో కూడా భారీగా వీర్యం నిల్వలు లభ్యమైనట్లు సమాచారం. కాగా.. పోలీసులు, వైద్యులు, రెవెన్యూ అధికారుల సంయుక్త తనిఖీల వివరాలను ఆదివారం వెల్లడిస్తామని డీసీపీ రష్మీ వెల్లడించారు.

సంతాన సాఫల్యం మాటున.. గలీజ్ దందా

- వీర్యకణాలు, అండాలతో వ్యాపారం
- దంపతులను మోసం చేస్తున్న కేంద్రాలు

హైదరాబాద్ సిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): పిల్లలు పుట్టని దంపతులు సంతాన సాఫల్య కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు కనీసం 200 మంది వరకు దంపతులు పిల్లల కోసం సంతాన సాఫల్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారని అంచనా. ఈ సెంటర్లకు వచ్చే కొందరు మగవారిలో వీర్యకణాల సంఖ్య(కౌంట్) తగ్గడం.. ఆడవారిలో అండాల ఉత్పత్తి కాకపోవడం ప్రధాన సమస్యలని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి దంపతుల బలహీనతలను అసరా చేసుకుంటున్న కొన్ని సంతాన సాఫల్య కేంద్రాలు.. ఫర్టిలిటీని వ్యాపారంగా మలచుకుంటున్నాయి.

దాతల నుంచి సేకరణ..

కొన్ని కేంద్రాలు ఐయూఐ, ఐవీఎఫ్ పేరుతో దందా చేస్తున్నాయి. సంతాన సాఫల్య కేంద్రాలు మహిళల అండాలు, పురుషుల వీర్యకణాల దానంతో చాటుమాటుగా వ్యాపారం చేస్తున్నాయి. యువత నుంచి వీర్యకణాలు, అండాలు సేకరించి.. వాటి సాయంతో దంపతులకు సంతానం కలిగేలా చేసి, సొమ్ము చేసుకుంటున్నాయి. సంతానం కోసం వచ్చిన దంపతుల నుంచి వీర్యకణాలు, అండాలను సేకరించి ఐయూఐ, ఐవీఎఫ్ ద్వారా సంతానం పొందే అవకాశం కల్పిస్తామని తొలుత నమ్మబలుకుతాయి. ఒకటి, రెండుసార్లు ప్రయత్నం చేస్తాయి. మూడోసారి మాత్రం వారికి తెలియకుండా.. దాత నుంచి సేకరించిన వీర్యకణాలు, అండాలను ప్రవేశపెట్టి సంతానం కలిగిస్తుంటాయి. డీఎన్ఏ పరీక్ష చేస్తే కానీ అసలు గుట్టు రట్టు కాదు. సికింద్రాబాద్‌లో సృష్టి సంతాన సాఫల్య కేంద్రంపై ఇలాంటి కేసే ఇప్పుడు నమోదైంది.

టార్గెట్ యువత?

చాలా మంది ఆర్థిక అవసరాల కోసం వీర్యం, అండాలు దానం చేయడానికి ముందుకు వస్తుంటారు. ఇందుకోసం సంతాన సాఫల్య కేంద్రాలు ఏజెంట్లను నియమించుకుంటాయి. మంచి శరీరపుష్టి ఉండి.. క్రీడాకారుల్లా కనిపించే యువకులను వీర్య దానానికి.. మేలిమిరంగు శరీరచ్ఛాయతో.. ఆకర్షణీయమైన కళ్లు, ఎత్తు ఉండే యువతులను అండ దానానికి ఎంచుకుంటాయి. ఫర్టిలిటీ కేంద్రాల నిర్వాహకులు వీరి నుంచి ఎక్కువ అండాలు, వీర్యకణాలు ఉత్పత్తి అయ్యేలా హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తుంటారు. ఉదాహరణకు.. యువతుల్లో నెలకు ఒకటి లేదా చాలా అరుదైన సందర్భాల్లో 2 అండాలు మాత్రమే విడుదలవుతాయి. కానీ, హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వడం వల్ల ఒకటి కంటే ఎక్కువ అండాలు విడుదలవుతాయి. ఇలా ఇంజెక్షన్లు తీసుకోవడం వల్ల అండ దాతలు భవిష్యత్‌లో సంతానానికి దూరం అయ్యే ప్రమాదాలుంటాయని గైనకాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైపర్ స్టిమ్యులేషన్ సిండ్రోమ్, ఇన్ఫెక్షన్లు, ఇతర రుగ్మతల బారిన పడే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు.

పిల్లల కోసం వచ్చే దంపతులకు సంతాన సాఫల్య కేంద్రాల్లో రెండు పద్ధతులను అవలంబిస్తున్నారు. అవి.. ఇంట్రా యుటిరైన్ ఇన్‌సెమినేషన్(ఐయూఐ), ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్). గర్భాశయ ముఖద్వారం వద్ద పొర మందంగా ఉండడం, భర్త వీర్యకణాల్లో చురుకుదనం లేకపోతే ఇదే విధానాన్ని అనుసరిస్తామని వైద్యులు పేర్కొన్నారు. ఐవీఎఫ్, ఐయూఐ ద్వారా అండాలను అవసరమైన వీర్యకణాలతో సంయోగం చేసి.. మహిళ గర్భంలో ప్రవేశపెడతారు. ఇలా చేయడం వల్ల చాలా మంది దంపతులకు సంతానం కలుగుతుందని వైద్యులు వివరించారు. ఈ ప్రక్రియను నాలుగైదుసార్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

లక్షల రూపాయల్లో ఫీజు

"సంతానం లేని దంపతులకు పిల్లలు కలిగించే పూచీ మాది" అని చెప్పుకొనే సాఫల్య కేంద్రాలు రూ.5 లక్షలకు మించి ఫీజులు వసూలు చేస్తుంటాయనే ఆరోపణలున్నాయి. మరికొన్ని కేంద్రాలైతే.. లక్షలు వసూలు చేసి, చేతులెత్తేస్తుంటాయి. ఇంకొన్ని ఏకంగా అనైతిక వ్యాపారానికి పాల్పడుతుంటాయి.

మహారాష్ట్రకు చెందిన ఓ మహిళతో అండం ఇవ్వడానికి నగరంలోని ఓ సంతాన సాఫల్య కేంద్రం ఒప్పించింది. భారీగా డబ్బులిస్తామని ఆశ చూపడంతో ఆ మహిళ ఒప్పుకొంది. అయితే.. ఎక్కువ అండాలు విడుదలయ్యేందుకు పలుమార్లు హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చారు. కొన్నాళ్ల తర్వాత ఆ మహిళ ఆరోగ్యం దెబ్బతినడంతో.. ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు.

బంజారాహిల్స్‌లోని ఓ సంతాన సాఫల్య కేంద్ర నిర్వాహకులు ఓ దంపతుల వద్ద భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారు. ఆ దంపతులకు సంతానం కల్గించడంలో విఫలం కావడంతో వారి ఫిర్యాదు మేరకు వైద్యాధికారులు విచారణ జరిపారు. అవాక్కయ్యే విషయం బయటపడింది. ఆ సెంటర్ నిర్వాహకురాలు కాలేజీ విద్యార్థినుల నుంచి అండాలు సేకరిస్తున్నట్లు తేలింది. అక్కడ ఏకంగా జెనిటిక్ ల్యాబ్‌ను అనుమతి లేకుండా ఏర్పాటు చేసి.. వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. దీంతో అధికారులు ఆ సమయంలో ఆ సెంటర్‌ను సీజ్‌చేశారు.


మద్రాస్ హైకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ దేవానంద్ శుక్రవారం తన సతీమణి పద్మకుమారి, కుమార్తెలు మౌని, కీర్తిలతో కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బనకచర్లకు 'పరిపాలనా ఆమోదం'పై ఆర్థిక శాఖ ప్రశ్నలు

- అది వచ్చాకే డీపీఆర్ తయారీ ప్రక్రియ

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'గోదావరి-బనకచర్ల'కు నిధులపై రాష్ట్ర ఆర్థిక శాఖ పలు సందేహాలు లేవనెత్తింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతులు కోరుతూ ఆర్థిక శాఖకు జలవనరుల శాఖ ఫైలు పంపింది. దీనిని పరిశీలించిన ఆర్థిక శాఖ నిధులు సమకూర్చుకోవడంపై సందేహాలు లేవనెత్తింది. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియేనని, బనకచర్ల విషయంలోనూ అదే జరిగిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి ఇచ్చిన వెంటనే నిధులు మంజూరు చేయాల్సిన అవసరం లేదు. కానీ.. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తయారు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. బనకచర్ల ప్రాజెక్టుపై ఆర్థిక శాఖకు పూర్తి అవగాహన ఉంది. ఈ ప్రాజెక్టు ప్రీఫీజుబిలిటీ రిపోర్టును ఆ శాఖ అధికారులే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు గతంలో అందజేశారు. ఈ పథకం పూర్తి చేయడం వల్ల ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. రూ.81,900 కోట్లతో చేపట్టే ఈ పథకానికి సహకరించాలని.. 50 శాతం నిధులైనా భరించాలని, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందేందుకు వెసులుబాటు కల్పించాలని కూడా కోరారు. ఆర్థిక శాఖ అడిగిన ప్రశ్నలకు జలవనరుల శాఖ నుంచి సమాధానాలు వెళ్లగానే.. పాలనా అనుమతులు లభించే అవకాశమున్నట్లు చెబుతున్నారు.

'గులకరాయి' నిందితుడు అదృశ్యం

- వారం రోజులుగా కనిపించని సతీష్.. కేసు నమోదు
- ప్రేమ వ్యవహారమే కారణం?

విజయవాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): జగన్ సీఎంగా ఉన్నప్పుడు, ఆయపై గులకరాయితో జరిగిన దాడి కేసులో నిందితుడిగా ఉన్న విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన వేముల సతీష్ అదృశ్యమయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచారం చేస్తుండగా జగన్‌కు, పక్కనే ఉన్న అప్పటి సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాసరావుకు ఓ చిన్న రాయి తగిలింది. ఈ కేసులో వేముల సతీష్‌ను ఏ2గా నిర్ధారించి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్దిరోజుల క్రితం వరకు ఇంటి వద్ద ఉన్న సతీష్ వారం రోజులుగా కనిపించడం లేదు. ఓ బాలికతో ఉన్న ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు చెబుతున్నారు. సతీష్ స్థానికంగా ఓ బాలికను ప్రేమించాడు. తల్లిదండ్రులు లేని బాలిక మేనత్త వద్ద ఉంటోంది. సతీష్ ప్రేమ వ్యవహారం తెలిసిన బాలిక మేనత్త, ఈ నెల 20వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సతీష్‌ను, అతడి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించారు. దీంతో అతడి ప్రేమ విషయం ఇంట్లో తెలిసిపోయింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. దీనిపై కుటుంబ సభ్యులు సతీష్‌ను మందలించారు. అప్పటి నుంచి అతడు కనిపించడం లేదు. ఇంట్లోనే ఫోన్ వదిలిపెట్టి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడేమోనని అక్కడ గాలించినా సతీష్ ఆచూకీ లభించలేదు. పోలీసులు అతడి కోసం పది మంది సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సతీష్ అదృశ్యమైన విషయం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది.

భారత్-యూకే వాణిజ్య ఒప్పందంతో

ఏపీకి మేలు

» ఎగుమతులు ఊపందుకుంటాయి: ఏపీ చాంబర్స్

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): భారత్-యూకేల మధ్య వాణిజ్య ఒప్పందంతో ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల నుంచి ఎగుమతులు ఊపందుకుంటాయని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) తెలిపింది. చరిత్రాత్మకమైన ఆ ఒప్పందంతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతమై దీర్ఘకాలంలో ఎగుమతుల వృద్ధిని, ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వాన్ని మెరుగుపరుస్తుందని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 99 శాతం భారతీయ ఎగుమతులకు యూకే సుంకం రహిత ప్రవేశాన్ని కల్పించడంతో రాష్ట్రం నుంచి వ్యవసాయ, వస్త్ర, తోలు, సముద్ర ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఇంజినీరింగ్ తదితర వస్తువుల ఎగుమతులకు అవకాశాలున్నాయని వారు వివరించారు.

4.50 కిలోల బాలభీముడు



సాధారణంగా పిల్లలు 2.5 నుంచి 3.5 కిలోల బరువుతో జన్మిస్తారు. అటువంటిది కర్నూలు జిల్లా కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో 4.50 కిలోల బరువుతో బాలుడు జన్మించి, అందరినీ ఆశ్చర్యపరిచాడు. గోనెగండ్ల మండలం వేముగోడుకు చెందిన భారతికి పురిటి నొప్పులు రావడంతో భర్త నల్లన్న ఆస్పత్రిలో చేర్చారు. వైద్యాధికారి నాగరాజు పర్యవేక్షణలో డాక్టర్ పుష్పలత ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

- కోడుమూరు, ఆంధ్రజ్యోతి

ఖరీఫ్ కళకళ!

వర్షాలతో జీవం పోసుకున్న పైర్లు.. ఊపందుకున్న వరి నాట్లు.. పుంజుకున్న పత్తి సాగు

» 10 లక్షలకు పైగా హెక్టార్లలో పంటలు

» 17 జిల్లాల్లో మెరుగైన వర్షపాతం

» సీమలో 22% నుంచి 48% లోటు

» నెలాఖరుకు కరువు మండలాల ప్రకటన?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో ఖరీఫ్ పంటలు కళకళలాడుతున్నాయి. నైరుతి రుతుపవనాల్లో కదలికతో అనేకచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఉపరితల ఆవర్తనాలు, ద్రోణులు వరుసగా ఏర్పడడంతో పాటు బంగాళాఖాతంలో వాయుగుండంతో కోస్తా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడా వానలు పడుతున్నాయి. దీంతో 17 జిల్లాల్లో వర్షపాతం మెరుగైంది. ఈనెల 17కు ముందు 37.5 శాతంగా ఉన్న వాన లోటు శనివారానికి 19.8 శాతానికి తగ్గింది. వాయుగుండం ప్రభావంతో మరో రెండు, మూడు రోజుల పాటు కోస్తాలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో సగటు వాన లోటు మరింత తీరనున్నది. విశాఖ, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో లోటు ఉన్నప్పటికీ వరి సాగుకు కాలువల ద్వారా నీరు సరఫరా అవుతోంది. అనంతపురం, అన్నమయ్య, శ్రీసత్యసాయి, కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 22-48% వాన లోటు కొనసాగుతోంది. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 31.16 లక్షల హెక్టార్లలో వరి, పత్తి, మిర్చి, చిరుధాన్యాలు సహా వివిధ పంటలు సాగవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 10 లక్షలకు పైగా హెక్టార్లలో రైతులు పైర్లు వేశారు. ప్రస్తుత వర్షాలతో ఖరీఫ్ పైర్లన్నీ జీవం పోసుకున్నాయి. జలాశయాలకు భారీగా వరద నీరు రావడంతో కృష్ణా, గోదావరి, వంశధార ఆయకట్టుల్లో వరి సాగుకు ప్రభుత్వం కాలువల ద్వారా నీటిని విడుదల చేసింది. ఆయా ప్రాంతాల్లో వరి సాగు ముమ్మరంగా సాగుతోంది. కోస్తా, రాయలసీమలో పత్తి సాగు పుంజుకుంది. అయితే వర్షాలు ఆలస్యంగా పడటంతో అపరాల సాగు తగ్గింది. ప్రస్తుత వర్షాలు ఖరీఫ్ సాగుకు ఊతమిచ్చాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే రాయలసీమలోని కొన్ని మండలాల్లో సగటు వర్షపాతం తక్కువగా ఉండటంతో ఈ నెలాఖరు వరకూ చూసి, తర్వాత కరువు మండలాలను ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు: సీఎస్

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఎక్కడా యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులను సీఎస్ విజయానంద్ ఆదేశించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. శనివారం కలెక్టర్లు, వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే డీఏపీ విక్రయిస్తామంటూ పలుచోట్ల వ్యాపారులు రైతుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అలాంటి వారిపై ఈసీ, పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఎరువుల విషయంలో అనుమానాలు రేకెత్తేలా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం జరుగుతోందని, దీనిపై కలెక్టర్లు వాస్తవాలు తెలియజేయాలన్నారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజూ నిల్వలు, సరఫరా వివరాలను మీడియా ద్వారా వివరించాలని, గోడౌన్లు, ఎరువుల దుకాణాలను కలెక్టర్లు తనిఖీ చేసి, రైతులతో మాట్లాడాలని సూచించారు. రైతుసేవా కేంద్రాల్లో అవసరమైన మేరకు స్టాక్ ఉంచాలన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 'వరద నీటిని ముందుగా సాగునీటి కాలువలకు మళ్లించాలి. సముద్రంలోకి వృధాగా పోకుండా సాధ్యమైనంత వరకు అన్ని ప్రాజెక్టులు నింపాలి. అన్ని సమ్మర్ స్టోరేజ్ చెరువులను నింపాలి. చెరువు గట్లు, కాలువల గట్లకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి' అని సీఎస్ ఆదేశించారు.

పోలీస్ విచారణకు అనిల్ డుమ్మా

కోవూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యల కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత అనిల్‌కుమార్ యాదవ్ పోలీసుల విచారణకు డుమ్మా కొట్టారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను శనివారం విచారణకు హాజరుకాలేకపోతున్నానంటూ తన న్యాయవాది ద్వారా కోవూరు సీఐ సుధాకరరెడ్డికి సమాచారం అందించారు. ఈనెల 30, 31 తేదీల్లో హాజరవ్వడానికి అనుమతించాలని పోలీసులను కోరినట్లు సమాచారం. కాగా, ఈకేసు విషయమై హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసినందున విచారణకు ఆయన హాజరుకాలేదని వైసీపీ నాయకులు చెప్పారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు కూడా విచారణకు గైర్హాజరయ్యారు. కాగా, ఈ కేసులో వైసీపీ నేతలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరిప్రసాదరెడ్డి, అత్తిపల్లి అనూప్ రెడ్డి విచారణకు హాజరయ్యారు. సీఐ ప్రశ్నలకు వారు రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పిలిచినప్పుడు రావాలంటూ ఆ నాయకులకు పోలీసులు నోటీసులిచ్చారు. జామీనుదార్లను ప్రవేశపెట్టేందుకు సోమవారం వరకు గడవు కావాలని వైసీపీ నాయకులు కోరినట్టు తెలిసింది. విచారణకు హాజరైన నేతలకు సంఘీభావంగా పలువురు వైసీపీ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మిథున్‌రెడ్డితో భార్య, కుమారుడు ములాఖత్



జైల్లో మిథున్‌రెడ్డిని కలిసి బయటకు వస్తున్న భార్య లక్ష్మీ దివ్య, కుమారుడు జశ్విన్ రెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డితో భార్య లక్ష్మీదివ్య, కుమారుడు జశ్విన్ రెడ్డి ములాఖత్ అయ్యారు. శనివారం ఉదయం 11 గంటలకు వారిద్దరూ లాయర్‌తో కలిసి జైలు వద్దకు వచ్చారు. అనంతరం మిథున్‌రెడ్డితో ములాఖత్ అయ్యారు. తిరిగి 11.35 గంటలకు బయటకు వచ్చి వెంటనే కారు ఎక్కి వెళ్లిపోయారు. మీడియా ప్రతినిధులు మిథున్‌రెడ్డి భార్యతో మాట్లాడేందుకు ప్రయత్నించినా ఆమె మాట్లాడకుండా కారెక్కి వెళ్లిపోయారు. మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులు ములాఖత్‌కు వస్తున్నారని తెలుసుకున్న మాజీ ఎంపీ భరత్‌రామ్, కొంతమంది వైసీపీ నాయకులు సెంట్రల్ జైలు వద్దకు చేరుకున్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలతో పోస్టులు

» వ్యక్తిపై కేసు నమోదు

చాట్రాయి, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టిన ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలోని చిన్నంపేటకు చెందిన వెదుళ్ల ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.రామకృష్ణ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 24వ తేదీ గురువారం వెదుళ్ల ప్రసాద్ తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో, అనుచిత వ్యాఖ్యలతో సీఎం చంద్రబాబుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు పోస్టు పెట్టాడన్నారు. దీనిపై టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు తదితరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.





మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

లొంగిపోండి.. లేదంటే లొంగదీస్తాం!

» మావోయిస్టులకు ఏడు నెలలే గడువు

» హింస వీడి జనంలోకి రండి: డీజీపీ

» ఇటీవల ఏపీలో ఆరుగురు మృతి

» ఏడుగురు అరెస్ట్, 40 మంది లొంగుబాటు

» డీజీపీ గుప్తా ముందు లొంగిపోయిన తూర్పు బస్తర్ ఇన్‌చార్జి కమలేశ్

» లొంగిపోయిన 13 మంది మావోయిస్టులకు మొత్తం రూ.22 లక్షల చెక్కులు పంపిణీ



లొంగిపోయిన మావోయిస్టులు

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'ప్రజల్లో మావోయిస్టు పార్టీ ఆదరణ కోల్పోయింది. వారి సిద్ధాంతాలకు కాలం చెల్లింది. రిక్రూట్‌మెంట్లు ఆగిపోయాయి. హింసతో ప్రగతి సాధ్యం కాదు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు అవ్వండి. దీనిని ఏడు మాసాల సమయం మాత్రమే ఉంది. అలా కాదని, హింసను కొనసాగిస్తే లొంగదీసుకుంటాం.' అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మావోయిస్టులను హెచ్చరించారు. మూడున్నర దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీలో పనిచేసి తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు కమలేశ్, ఆయన జీవిత భాగస్వామి అరుణ(డివిజనల్ కమిటీ సభ్యురాలు) డీజీపీ సమక్షంలో శనివారం విజయవాడలో లొంగిపోయారు. ఈ సందర్భంగా విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో డీజీపీ మాట్లాడారు. "రాష్ట్రంలో ఇటీవలి కాలంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల ఉదయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణ, జగన్.. డివిజనల్ కమిటీ కార్యదర్శి రమేశ్ ఉన్నారు. మరో ఏడుగురిని అరెస్టు చేశాం. 40 మంది లొంగిపోయారు. భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. ఏపీకి చెందిన మరో 20 మంది మావోయిస్టులు బస్తర్‌లో ఉన్నారు. వారంతా లొంగిపోవాలి' అని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో లొంగిపోయిన 13 మందికి రూ.22 లక్షల చెక్కులు అందజేశారు. ఏడాదిలో 48 మంది లొంగిపోయారని, రూ.64 లక్షలు అందజేశామని చెప్పారు. విశాఖపట్నం జిల్లాలో త్వరలో గ్రేహౌండ్స్ కార్యాలయ నిర్మాణానికి రూ.294 కోట్లతో భూమి పూజ చేయబోతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీజీ మధుసూదన్ రెడ్డి, ఐజీలు సీహెచ్ శ్రీకాంత్, పీహెచ్‌డీ రామక్రిష్ణ, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టి, పలువురు ఎస్పీలు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం..



ఆయుధాలను పరిశీలిస్తున్న డీజీపీ

గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతున్నామని డీజీపీ తెలిపారు. ఏడాది క్రితం వరకు 10 వేల ఎకరాల్లో సాగైన గంజాయి.. ఇప్పుడు 100 ఎకరాలకు పరిమితమైందన్నారు. అది కూడా అత్యంత మారుమూల అటవీ ప్రాంతంలోనే సాగుతోందని గుర్తించినట్టు చెప్పారు. స్థానిక గిరిజనులను మభ్యపెట్టి గంజాయి సాగుకు ప్రోత్సహించే స్మగ్లర్లపై నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ రవాణా నిరోధక చట్టం(పిట్ ఎన్‌డీపీఎస్) ప్రయోగించి జైలుకు పంపుతున్నామని చెప్పారు. మరోవైపు గిరిజన రైతులకు ప్రభుత్వం ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహకాలు ఇప్పించడం మంచి ఫలితాన్నిస్తోందని తెలిపారు. అక్కడి యువతకు విశాఖ పోర్టు సహకారంతో స్కిల్ డెవలప్మెంట్‌లో శిక్షణ ఇస్తున్నట్లు డీజీపీ తెలిపారు. శిక్షణ పొందిన 1,700 మంది యువకుల్లో 1,042మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని చెప్పారు.

నిండుకుండలా సాగర్





నాగార్జున సాగర్‌లో జలకళ.. విద్యుత్ దీపాల వెలుగులో తుంగభద్ర డ్యాం గేట్ల నుంచి వరద ప్రవాహం

» 29న తెరుచుకోనున్న క్రస్ట్ గేట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అన్ని ప్రాజెక్టులను నిండుగా నింపిన కృష్ణమ్మ, నాగార్జునసాగర్‌కూ పూర్తి జలకళ తెచ్చేసింది. ప్రాజెక్టు దాదాపుగా నిండిపోయింది. గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులకు ప్రస్తుతం 581.30 అడుగులకు నీరు చేరింది. 312 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 286.76 టీఎంసీల నీరు ఉంది. మరో రెండు రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందని.. 29న గేట్లను ఎత్తి దిగువకు నీరు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జునరావు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా, రాష్ట్రానికి దూరంగా మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లలో వాయుగుండం కొనసాగుతుంది. ఇది ఆదివారం కల్లా పశ్చిమంగా పయనించి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడనున్నది. వాయుగుండం పూర్తిగా బలహీనపడిన తర్వాతే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే వాతావరణం నెలకొంటుంది. అప్పటివరకూ రాష్ట్రంలో వర్షాలు తగ్గుతాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కర్ణాటకలోని హోస్పేట్ సమీపంలో ఉన్న తుంగభద్ర జలాశయానికి ఎగువ నుంచి 90 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ఇది లక్ష క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. తుంగభద్ర జలాశయానికి ఉన్న 33 క్రస్ట్‌గేట్లలో 26 గేట్లను మూడడుగుల మేరకు ఎత్తి 84 వేల క్యూసెక్కులను దిగువనున్న నదిలోకి వదులుతున్నారు.

గోదావరికి భారీగా వరద..

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలోనూ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు నుంచి 5,09,250 క్యూసెక్కులను దిగువన సముద్రంలోకి వదులుతున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

'సిట్' సోదాల పర్వం!

ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంతోపాటు ఆయన ముఖ్య అనుచరుడు బూనేటి చాణక్య(ఏ-8)కు చెందిన టీ గ్రిల్ రెస్టారెంట్ (నానక్‌రామ్‌గూడ)లోనూ తనిఖీలు నిర్వహించింది. మూడు బృందాలుగా ఏర్పడిన సిట్ అధికారులు... తమతోపాటు డిజిటల్ ఎఫ్ఎస్ఎల్ నిపుణులనూ తీసుకెళ్లారు.

అక్కడే బాలాజీ భేటీలు...

భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప(ఏ-33) పలువురు డిస్టిలరీల యజమానులతో సమావేశమైన ప్రదేశాన్ని 'సిట్' ఇదివరకే సాంకేతికత ద్వారా గుర్తించింది. హైదరాబాద్ బంజారా హిల్స్ రోడ్ నంబర్ 10లో ఉన్న భారతీ సిమెంట్స్ కార్యాలయంలోని ఈ భేటీలు జరిగినట్లు తేలింది. శనివారం బాలాజీ గోవిందప్ప చాంబర్‌ను పరిశీలించేందుకు వెళ్లిన సిట్ సిబ్బందిని... సెర్చ్ వారంట్ లేకుండా తనిఖీలకు అనుమతించమని సంస్థ న్యాయవాదులు అడ్డుకున్నారు. మధ్యాహ్నం 3నుంచి రాత్రి 7గంటల దాకా ఈ హైడ్రామా కొనసాగింది. సిట్ అధికారులు గోవిందప్ప చాంబర్‌ను పరిశీలించి, సహాయకులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మీటింగ్ హాల్‌ను పరిశీలించారు. బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని బాలాజీ గోవిందప్ప ఇంటికి చేరుకున్నారు. అక్కడ కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇక... రాజ్ కసిరెడ్డి కార్యాలయంలో ఫైళ్లు, చాణక్య రెస్టారెంట్‌లో పలుమార్లు సమావేశమైన వ్యక్తుల వివరాలు సేకరించినట్లు తెలిసింది. లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేసిన అధికారులు... త్వరలో అనుబంధ చార్జిషీట్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. మొదటి చార్జిషీట్‌లో గోవిందప్ప పాత్రను ప్రస్తావించలేదు. రెండో చార్జిషీట్‌లో ఆయన పాత్ర, తగిన ఆధారాలు చూపించే ప్రయత్నాల్లో భాగంగానే సోదాలు చేపట్టినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.